మార్క్సిస్టు

జూన్
2022

194

సంపుటి : 17  సంచిక : 1   వెల రు. 15 /-

ఈ సంచికలో........

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నపాలకవర్గాలు

ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాటం

ఉద్యమ పోరాటాలా? మార్కెట్ నమూనాలా?

అశోకుడి పాలన - ప్రత్యేకతలు

కాశి, మధుర - ఉద్రిక్తతలు పెంచుతున్న సంఘ్ పరివార్

గోద్రా మారణకాండ ప్రజాస్వామ్య పతనం

గ్రామీణ ప్రాంతంలో బలపడిన భూస్వామ్య కూటమి

గోథా కార్యక్రమం మార్క్స్ విశ్లేషణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆవిర్భావం



epaper.prajasakti.com

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆవిర్భావం

1964 అక్టోబర్ 31 నుండి నవంబర్ 7 వరకు కలకత్తాలో కమ్యూనిస్టు పార్టీ ఏడవ మహాసభ జరిగింది. రివిజనిజానికి వ్యతిరేకంగా పార్టీలో జరిగిన పోరాటం ఈ మహాసభలో ఉచ్ఛస్థితికి చేరింది. కార్యక్రమం, నిర్మాణం, సైద్ధాంతిక అంశాలపై ఈ మహాసభ రివిజనిజంతో పూర్తిగా విడగొట్టుకొంది. అందువలన పార్టీ అనుసరించే ఎత్తుగడలు పూర్తిగా మారిపోయాయి. దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఏడవ మహాసభ ఒక మూలమలుపు. అందులో పార్టీ నూతన కార్యక్రమం, విధాన ప్రకటన, కర్తవ్యాలపై తీర్మానాలు ఆమోదించారు. వీటిలో భారతదేశ విప్లవ పంథా, ఎత్తుగడలను స్పష్టంగా ప్రకటించారు. 1961లో జరిగిన ఆరవ మహాసభ నాటికి ఉన్న సభ్యత్వంలో 60 శాతంకు ప్రాతినిధ్యం వహిస్తూ 422 మంది ప్రతినిధులు ఏడవ మహాసభకు హాజరై, పార్టీలోని విప్లవతత్వానికి ప్రాతినిధ్యం వహించేవారితో నిలిచారు.

భారతదేశ పరిస్థితులపై అన్ని సంస్కరణవాద సూత్రీకరణలను మహాసభ తిరస్కరించి, రాజ్యం స్వభావాన్ని సరిగా విశ్లేషించింది. 'ప్రస్తుత రాజ్యం బూర్జువా, భూస్వామ్య వర్గాల వర్గపాలనకు సాధనంగా ఉన్నదని, 'దీనికి బడా పెట్టుబడిదారులు నాయకత్వం వహిస్తున్నారని, పెట్టుబడిదారి అభివృద్ధి మార్గాన్ని అనుసరించే క్రమంలో ఇది అంతకంతకు విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ అవుతున్నదని" సరిగ్గా అంచనా వేసింది. భారత ప్రభుత్వాన్ని జాతీయ బూర్జువా వర్గం నడుపుతున్నదని, అందువలన దానికి మద్దతుగా నిలవాలన్న సోవియట్ కమ్యూనిస్టు పార్టీ అంచనాను తిరస్కరించింది. అదే సమయంలో భారత ప్రభుత్వం దళారీ బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నదన్న చైనా కమ్యూనిస్టు పార్టీ అంచనాను కూడా మహాసభ తిరస్కరించింది.

మన విప్లవం మొదటి దశ సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక, గుత్త పెట్టుబడిదారీ వ్యతిరేక, ప్రజాస్వామిక



సిపిఐ(ఎం) ప్రథమ ప్రధాన కార్యదర్శి పి.సుందరయ్య

విప్లవమని మహాసభ ఆమోదించిన కార్యక్రమం స్పష్టం చేసింది. ఈ దశ ముగిసిన తర్వాతే సోషలిస్టు విప్లవ దశకు వెళ్లడం జరుగుతుంది. కార్యక్రమం ఇలా ప్రకటించింది : "ప్రస్తుత దశలో పరిపూర్ణంగా, మౌలికంగా భారతదేశ విప్లవ కర్తవ్యాలు నెరవేర్చాలంటే, ఇప్పుడున్న బడా బూర్జువావర్గ నాయకత్వంలోని బూర్జువా, భూస్వామ్య రాజ్యం స్థానంలో కార్మికవర్గ నాయకత్వంలో, జనతా ప్రజాస్వామిక రాజ్యం ఏర్పడాలన్నది సుస్పష్టం."

ప్రస్తుత దశ జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తిచేయడం అంటే బడా బూర్జువాల నాయకత్వంలోని బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రభుత్వ స్థానంలో, కార్మిక – కర్షక మైత్రి ఆధారంగా, కార్మికవర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరచడం. ఇదే ఇప్పటి ప్రధాన లక్ష్యం. "ప్రస్తుతం భూస్వామ్యవర్గంతో మిలాఖత్ అయి పాలిస్తున్న బడా బూర్జువా నాయకత్వాన్ని రాజ్యాధికారం నుండి కూలదోసి, ఆ స్థానంలో కార్మికవర్గ రాజ్యాధికారాన్ని స్థాపిస్తేగాని రైతాంగానికి అసలైన ప్రయోజనాలు చేకూర్చే నిజమైన వ్యవసాయ సంస్కరణలు అమలు చేయటం సాధ్యం కాదు అనేది స్పష్టం..." పైగా ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం, దాని విధానాలు, విదేశీ గుత్త పెట్టుబడి, సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అవుతున్నంత కాలం విదేశీ గుత్తపెట్టుబడిని, వారి దోపిడీని తప్పించుకోవటం సాధ్యం కాదు. విదేశీ గుత్త పెట్టుబడిని పూర్తిగా పారదోలి, దేశాన్ని స్వతంత్రమైన, పటిష్టమైన పునాదులపై నిలపాలంటే అది కేవలం కార్మికవర్గ నాయకత్వాన ఉన్న జనతా ప్రజాతంత్ర సంఘటనకు తప్ప వేరెవరికీ సాధ్యపడదు. ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రస్తుత ప్రభుత్వాన్ని నిర్ణయాత్మకంగా ఓడించి, ప్రత్యామ్నాయ విధానాలను అమలుచేసే ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పరిస్తే తప్ప చారిత్రికంగా కాలం చెల్లిన పెట్టుబడిదారీ హింసాత్మక అభివృద్ధి బాట నుండి మన ప్రజలకు రక్షణ లేదు. ఇటువంటి కాలం చెల్లిన అభివృద్ధి బాటను అనుసరిస్తున్నందువల్ల నానాటికి పెరుగుతున్న గుత్తపెట్టుబడిదారీ సంకెళ్ళ నుండి ప్రజలను రక్షించడం సాధ్యపడదు."

బడా బూర్జువా నాయకత్వంలోని బూర్జువా, భూస్వామ్య ప్రభుత్వాన్ని గద్దె దించడం కోసం జనతా ప్రజాతంత్ర సంఘటన (పి.డి.ఎఫ్) నిర్మాణం విప్లవోద్యమ అంతిమ లక్ష్యం. పి.డి.ఎఫ్‌ను నిర్మించడం, విప్లవాన్ని విజయవంతం చేయడం కేవలం కార్మికవర్గం, దాని రాజకీయ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోనే సాధ్యమని కార్యక్రమం ప్రకటించింది. ఈ సంఘటనలో బలమైన కార్మిక, కర్షక మైత్రికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడింది. "ఈ మైత్రి పి.డి.ఎఫ్ లో అత్యంత కీలకం. దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడే ప్రధానశక్తి ఈ మైత్రిలో ఇమిడి ఉంది. ఇది తీవ్రమైన పరిణామాలకు దారితీసే ప్రజాస్వామ్య పరివర్తనకు దోహద పడుతుంది. సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందేటట్టు భరోసా కల్పిస్తుంది."

కీలకమైన కార్మిక, కర్షక మైత్రి చుట్టూ వ్యవసాయ కార్మికులు, పేద రైతులను సమీకరించాలి. మధ్య తరగతి రైతులు దృఢమైన మిత్రులు. ధనిక రైతులను కూడా సంఘటనలోకి తెచ్చుకొనే అవకాశాలు ఉన్నాయి. పట్టణ, ఇతర

(మిగతా 35వ పేజీలో)



epaper.prajasakti.com

మార్క్సిస్టు

## ఈ సంచికలో...

1. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆవిర్భావం .... 2

2. హిందుత్వ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న పాలకవర్గాలు
బి.వి.రాఘవులు ..... 4

3. ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాటం కొనసాగిస్తున్న సిపిఐ(ఎం)
ప్రభాత్ పట్నాయక్ ... 8

4. ఉద్యమ పోరాటాలా? మార్కెట్ నమూనాలా?
ఎస్.వీరయ్య ..... 14

5. అశోకుడి పాలన - ప్రత్యేకతలు
యం.వి.ఎస్.శర్మ ...... 17

6. కాశి, మధుర - ఉద్రిక్తతలు పెంచుతున్న సంఘ్ పరివార్
ఎ.కోటిరెడ్డి ..... 20

7. గోధ్రా మారణకాండ ప్రజాస్వామ్య పతనం
ప్రేమ్ శంకర్ ఝా .....23

8. గ్రామీణ ప్రాంతంలో బలపడిన భూస్వామ్య కూటమి
బి.టి.రణదివె ..... 26

9. గోధా కార్యక్రమం మార్క్స్ విశ్లేషణ
వై.రాము ..... 32

**సంపాదకుడు:**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

# ప్రత్యామ్నాయం ఏర్పడాలంటే...

ఈ మధ్యనే భారత జాతీయ కాంగ్రెస్ చింతన్ శిబిర్ జరిగింది. మోడీ ప్రభుత్వ పాలనలో ప్రజలు అనుభవిస్తున్న కష్టాల గురించి, దేశంలో సంఘ్‌పరివార్ చెలరేగిపోతున్నందువలన పెరుగుతున్న మత వైషమ్యాల గురించి, రాష్ట్రాల హక్కులపై, ఫెడరల్ సూత్రాలపై, ప్రజాస్వామ్య సాంప్రదాయాలపై జరుగుతున్న దాడుల గురించి ఆ శిబిరం చర్చించింది. మోడీ ప్రభుత్వం స్థానే మరో ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడాల్సిన ఆవశ్యకతను గురించి కూడా చర్చించారు. ఆ దిశగా కాంగ్రెస్ పార్టీ రానున్న కాలంలో కృషి చేయాలని కూడా తీర్మానించారు. అదే శిబిరంలో పూర్వపు ఆర్థికమంత్రి పి.చిదంబరం మాట్లాడుతూ దేశంలో నయా ఉదారవాద విధానాలను తొలుత ప్రవేశపెట్టినది తమ ప్రభుత్వమేనని, దానిని కొనసాగించడంలో మోడీ ప్రభుత్వం తప్పుదోవ పడుతున్నదని, కాంగ్రెస్ పార్టీ గనుక తిరిగి అధికారంలోకి వస్తే నయా ఉదారవాద విధానాలను సక్రమమైన రీతిలో అమలు చేస్తామని ప్రకటించారు.

ఇదే సమయంలో ఒకవైపు నుండి మమతా బెనర్జీ, ఇంకొకవైపు నుండి కెసిఆర్ తమ తమ వ్యూహాలలో భాగంగా దేశంలోని బిజెపియేతర పార్టీలతో, ముఖ్యంగా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపియేతర పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ మధ్యలోనే ఎన్నికల వ్యూహకర్తగా ప్రసిద్ధికెక్కిన ప్రశాంత్ కిశోర్ ముందు కాంగ్రెస్‌లో చేరడానికి సుముఖంగా ఉన్నట్టు వార్తలు వచ్చాయి. సంప్రదింపులు కూడా జరిగాయి. ఆ తర్వాత తానే స్వంతంగా ఓ పార్టీ పెడుతున్నట్టు ప్రకటించారు.

మొత్తంమీద చూసినపుడు బిజెపి కూటమిని ఓడించాలంటే తతిమ్మా రాజకీయ పార్టీలన్నీ ఒక కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేయడమే పరిష్కారం అన్న ధోరణి వ్యక్తం ఔతోంది.

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా దేశాన్ని భ్రష్టు పట్టించింది. అటు కార్పొరేట్ల సేవలో, ఇటు మతవిద్వేష జ్వాలలను రగల్చడంలో మునిగి తేల్తోంది. తనకు తందానా అనే కార్పొరేట్ మీడియా తోడుగా ఉండడంతో ప్రచారార్భాటంతో ప్రజానీకాన్ని భ్రమల్లో ముంచగలనని భావిస్తోంది. ప్రశ్నించే గొంతులను పెగలనివ్వకుండా నొక్కిపెట్టడమే విధానంగా నిరంకుశ పాలన సాగిస్తోంది. ఇటువంటి సమయంలో ఆ ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రత్యామ్నాయాన్ని నెలకొల్పడం అత్యంత అవశ్యం అన్న విషయంలో ప్రజాస్వామికవాదులలో ఎటువంటి భిన్నాభిప్రాయమూ ఉండనవసరం లేదు. అయితే అటువంటి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకోవలసినది సామాన్య ప్రజలు అన్న విషయాన్ని మాత్రం మరిచిపోకూడదు. బిజెపికి ప్రత్యామ్నాయంగా ఏర్పడే రాజకీయ కూటమి పట్ల ఆ ప్రజల్లో తగిన మోతాదులో విశ్వాసం కలగాలి. అది చాలా కీలకం.

హిందుత్వ-కార్పొరేట్ కూటమికి వ్యతిరేకంగా నిలవడం అంటే, ఒక ప్రత్యామ్నాయంగా వ్యవహరించడం అంటే కేవలం ఎన్నికల పొత్తులు మాత్రమే కాదు. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించి, వాటిని చిత్తశుద్ధితో అమలు చేస్తామని ప్రకటించాలి. ఆ ప్రాతిపదికన ప్రజల్లో విశ్వాసం కల్పించాలి. కాని ప్రస్తుతం అత్యంత కీలకమైన ఈ ప్రత్యామ్నాయ విధానాల గురించి ఏ మాత్రమూ చర్చ జరగడం లేదు. ప్రజలు నేడు అనుభవిస్తున్న కష్టాలకు, నయా ఉదారవాద విధానాలకు మధ్య ఉన్న సంబంధం గురించిన చర్చ ఎక్కడా ముందుకురావడం లేదు. వామపక్ష పార్టీలు మాత్రమే ఇందుకు మినహాయింపుగా ఉన్నాయి.

హిందుత్వ శక్తుల మత విద్వేష, ఫాసిస్టు ధోరణులకు, కార్పొరేట్ సంస్థల విచ్చలవిడి దోపిడీకి నడుమ ఇంత గట్టి బంధం ఏర్పడిందంటే దానికి కారణం నయా ఉదారవాద విధానాలను ఎలాగైనా కొనసాగించాలనే కాంక్షే. దేశ, విదేశాల శత కోటీశ్వరులకు, వారి వెన్నుదన్నుగా ఉన్న అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి, సామ్రాజ్యవాద శక్తులకు ఈ కాంక్ష బలంగా ఉంది. మతవిద్వేష వివాదాల దిశగా ప్రజల దృష్టిని మళ్ళించగలిగే హిందుత్వ శక్తుల పట్ల అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, బడా కార్పొరేట్లు ఇంత సానుకూలంగా వ్యవహరించడానికి ఇదే కారణం.

అందుకే దేశంలో బిజెపి కూటమికి ప్రత్యామ్నాయం ఏర్పడాలని కోరుకునేవారు, అందుకోసం ప్రయత్నించేవారు ముందు నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయాన్ని రూపొందించాలి. అదే సమయంలో మతవిద్వేషపూరిత, నిరంకుశ విధానాలకు ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాన్ని కూడా రూపొందించాలి. ఆ ప్రత్యామ్నాయం చుట్టూ విశాల ప్రజానీకం మద్దత్తును కూడగట్టాలి. ఇది కేవలం ఎన్నికల ఎత్తుగడలతోటే సాధ్యమయేది కాదు. కాంగ్రెస్ గాని, బిజెపిని ఓడించాలనుకునే మరే ఇతర పార్టీ గాని ఈ వాస్తవాన్ని ఎంత త్వరగా గ్రహిస్తే దేశానికి, ప్రజాస్వామ్య వ్యవస్థలకు అంత మంచిది.




epaper.prajasakti.com

**ఈ మాసం ముఖ్యాంశం**

# హిందుత్వ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న పాలకవర్గాలు

**బి.వి.రాఘవులు**



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

బిజెపి రెండవసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద ప్రమాదం అనేక రెట్లు పెరిగింది. మతోన్మాదాన్ని బలపరచటం, లౌకిక విధానాలను అమలు చేస్తున్న మనదేశాన్ని 'హిందురాష్ట్ర'గా మార్చటం కోసం వరుస చర్యలు తీసుకుంటున్నది. పార్లమెంటు ఉభయసభలలోనూ తనకున్న మెజారిటీని ఉపయోగించుకుని జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370, 35ఎ లను రద్దుచేసి, ఆ రాష్ట్రాన్ని ముక్కలు చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌ల నుండి దేశంలోకి వచ్చే శరణార్థులకు పౌరసత్వం ఇవ్వటానికి మతాన్ని ప్రాతిపదికగా చేస్తూ పౌరసత్వ సవరణ బిల్లును చట్టంగా చేశారు. ముస్లీం మహిళలకు మేలు కన్నా ఎక్కువ కీడు చేసే ట్రిపుల్ తలాక్ చట్టాన్ని ఆమోదించారు. అధికారాన్ని ఉపయోగించుకొని రాజ్యంలోని వివిధ విభాగాలలోని కీలక స్థానాలలో తన మనుషులను ప్రతిష్ఠించటం ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని మతతత్వపూరితం చేయటానికి పథకం ప్రకారం పని చేస్తున్నది. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కార్యకర్తలు, అనుయాయులను రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమిస్తున్నారు. తమ ప్రయోజనాలకు అనుగుణంగా అత్యున్నత న్యాయ విభాగాన్ని పనిచేయించటానికి అనేకరకాలుగా వత్తిడి చేస్తున్నారు. అయోధ్య, శబరిమల విషయంలో ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు న్యాయవ్యవస్థ స్వతంత్రత కుదించుకుపోతున్నదని స్పష్టం చేస్తున్నాయి. సాయుధ బలగాలు, పోలీసు వ్యవస్థలోని ఉన్నతస్థాయి విభాగాలను కూడా వారు వదలటం లేదు. ఉన్నత విద్య, శాస్త్రీయ అధ్యయనం, పరిశోధనా విభాగాలను ప్రత్యేకంగా లక్ష్యంగా పెట్టుకుని, వాటిని సంఘ్ పరివార్ ఆలోచనా కేంద్రాలుగా మార్చటానికి ప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధి నిరోధక, శాస్త్రీయ వ్యతిరేక, మతమౌఢ్యంతో కూడిన భావాలను అధికారికంగా ప్రచారం చేస్తున్నారు.

తమ వ్యతిరేకులను, ప్రజలను భయభ్రాంతులను చేయటానికి, మైనారిటీలపై విద్వేషాన్ని పెంచటానికి సంఘ్ పరివార్ సంస్థలు ఫాసిస్టు పద్ధతులు అనుసరిస్తున్నాయి. బిజెపి ప్రభుత్వాల మద్దతుతో సంఘ్ పరివార్ సంస్థలు అనధికారిక రక్షణ (విజిలెంటే) గ్రూపులను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ అరాచక మూకలు ప్రత్యేకంగా ముస్లీంలు, దళితులను లక్ష్యంగా చేసుకుని గో రక్షణ, లవ్ జిహాద్ పేరుతో దాడులు చేయటం, కొట్టి చంపటం చేస్తున్నాయి.

బిజెపి స్వదేశీ ముసుగును పక్కన పెట్టి ఆర్థికరంగంలో నయా ఉదారవాద విధానాలను అత్యంత వేగంగా అమలు చేస్తున్నది. ఆర్థిక వ్యవస్థలో సృష్టించిన సంపదలో అత్యధిక భాగాన్ని దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టటం కోసం విదేశీ పెట్టుబడులకు తలుపుల మరింత బార్లా తెరవటం, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వేగవంతం చేయటం, ఆస్తులను మానిటైజేషన్ చెయ్యడం, ప్రభుత్వబ్యాంకులను విలీనం చేయటం, కార్మికచట్టాలను నీరుగార్చటం, భూసంస్కరణలను, మార్కెటింగ్ చట్టాలను పక్కన పెట్టటం చేస్తున్నది. ఈ విధానాల ఫలితంగా విస్తారంగా ఉన్న సామాన్య ప్రజానీకానికి అతి తక్కువ సంపద మాత్రమే దక్కుతున్నది. ఈ విధానాల వలన ఆర్థికవ్యవస్థ మాంద్యంలోకి పోవటంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. నిరుద్యోగం, దరిద్రం పెరుగుతున్నాయి. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫలితంగా ప్రజలలో అసంతృప్తి తీవ్రమౌతున్నది.

మతోన్మాద రాజకీయాలను, కార్పొరేట్లకు ప్రయోజనం కలిగిస్తున్న ఆర్థిక విధానాలను ముందుకు తీసుకుపోవటం కోసం బిజెపి రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నది. ప్రజాస్వామిక సంస్థలను దిగజారుస్తూ నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నది. పార్లమెంటును పక్కన పెట్టి వ్యవహరించటం అలవాటుగా మార్చుకున్నది. అధికారాలన్నీ ప్రధాని, ప్రధాని కార్యాలయం చేతుల్లో కేంద్రీకరించారు. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలలో ప్రభుత్వాల పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకోవటానికి గవర్నర్లను ఉపయోగించుకుంటున్నారు. రాజకీయ వ్యవస్థ సమాఖ్య స్వభావాన్ని బలహీన పర్చటం కోసం పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరపటం గురించి ప్రచారం చేస్తున్నారు. వివిధ భాషా ప్రాంతాల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన ప్రస్తుత భాషా విధానాన్ని దెబ్బతీసి, అన్ని రాష్ట్రాలపైనా హిందీని రుద్దటాన్ని వేగవంతం చేస్తున్నారు.

ప్రజలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయటాన్ని, అసమ్మతిని అణచివేయటం కోసం యుఎపిఎ లాంటి క్రూరమైన చట్టాలు, ఐఎన్ఎ లాంటి కేంద్ర విచారణ సంస్థలను ఉపయోగిస్తున్నారు. అసమ్మతి గళాలను వినిపిస్తున్న సాంస్కృతిక రంగంలోని ప్రముఖులు, మేధావులు, ప్రతిపక్షపార్టీల నాయకులను జాతి వ్యతిరేకులు, దేశభక్తి లేనివారు, పాకిస్తానీ అనుకూలురనే పేర్లతో వేటాడుతున్నారు. వారిని అక్రమంగా శిక్షించటంతో పాటు, హత్యలు కూడా చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తమ విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై విద్వేషాన్ని రెచ్చగొట్టటం (ట్రోలింగ్), పుకార్లను వ్యాపింపజేయటం, భౌతికదాడులు చేయటాన్ని



epaper.prajasakti.com

సంఘ్ పరివార్ ప్రధానమైన ఆయుధంగా వినియోగిస్తున్నది. ఇందుకోసం విద్వేషాన్ని రెచ్చగొట్టే (ట్రోల్) సైన్యాన్ని నిర్వహిస్తున్నది.

బిజెపి ప్రభుత్వాల విధానాలు, సంఘ్ పరివార్ సంస్థల కార్యకలాపాలు లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పునాదులను కుంగదీస్తున్నాయి. సంఘ్ పరివార్ శక్తుల విచ్ఛిన్నకర, ఫాసిస్టు కార్యకలాపాలు శ్రామిక ప్రజల వర్గ ఐక్యత, దేశ సమగ్రతకు ప్రమాదంగా పరిణమిస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగంపై పట్టు, దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థల పూర్తి మద్దతు, మతోన్మాద ప్రచారం, కార్యకలాపాల ద్వారా మతతత్వ భావాలు, మైనారిటీలపై విద్వేషం 'సహజమైన విషయాలు'గా ప్రజల భావజాలంలోకి చొప్పించటానికి సంఘ్ పరివార్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఈ మతోన్మాద శక్తులను భౌతికంగా, సైద్ధాంతికంగా, రాజకీయంగా బలహీనపర్చటం దేశంలోని లౌకికశక్తులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు. హిందుత్వ మతోన్మాద శక్తులను ఎదుర్కొని ఓడించటానికి దీర్ఘకాలిక వ్యూహం, స్వల్పకాలిక కార్యాచరణ ప్రణాళిక ఉండాలి. ఈ ఫాసిస్టు శక్తుల సిద్ధాంతంలోని మౌలిక లక్ష్యాలు, వారి నిర్మాణం, కార్యకలాపాలను ఎదుర్కొని, పోరాడటానికి అవసరమైన పద్ధతులు, విధానాలను తర్వాతి పేజీలలో క్లుప్తంగా చర్చిద్దాం.

**కీలక భావనలు**

సంఘ్ పరివార్ కార్యకలాపాల వలన పెరుగుతున్న ప్రమాదాలకు వ్యతిరేకంగా శక్తివంతంగా పోరాటం చేయాలంటే మనం మొదట లౌకికవాదం, జాతీయవాదం, మతతత్వం వంటి భావనలను సరిగా అర్థం చేసుకోవాలి.

**1. లౌకికవాదం:** మొదటిది, భారతదేశంలోని లౌకికవాదులు ఈ భావనకు రెండు విధాలైన అర్థాలను చెబుతున్నారు. ఇందుకు సంబంధించి **సర్వధర్మ సమభావన** ను మన రాజ్యాంగంలో పొందుపరచారు. అన్ని మతాలను సమానంగా చూడటం అనే ఈ అవగాహనతోనే స్వాతంత్ర్యానంతరం భారతదేశ రాజ్యం వ్యవహరించింది. కాని ఆచరణలో ఈ విధానం దానిలోనే అంతర్గతంగా ఉన్న మెజారిటీ మత విశ్వాసాల పట్ల పక్షపాతంతో వ్యవహరించటానికి దారితీసింది. నేడు తమ రాజకీయ లక్ష్యాలను ముందుకు తీసుకుపోవటానికి మతోన్మాద, తిరోగమన

" మతం నుండి పూర్తిగా విడగొట్టుకోకపోవటం అనే ఈ బలహీనత తమకు అవసరమైనపుడు మతశక్తులను సంతృప్తిపరచటానికి, తమకు ఉపయోగం ఉంటుందనుకున్నపుడు వాటిని తమ ప్రయోజనాల కోసం వినియోగించుకోవటానికి భారత పాలకవర్గాలకు అవకాశం కల్పించింది. లౌకికవాద విలువలు క్షీణించిపోవటానికి, మతశక్తుల పెరుగుదలకు ఈ విధానాలు మార్గం సుగమం చేశాయి. "

శక్తులు ఈ బలహీనతను పూర్తిగా వినియోగించుకుంటున్నాయి.

రెండవది, లౌకికవాదం అంటే మతాన్ని రాజకీయాల నుండి వేరు చేయటం, మతాన్ని వ్యక్తిగత అంశంగా చూడటం. వ్యక్తులు తమ వ్యక్తిగత విశ్వాసాలను అనుసరించటానికి ప్రభుత్వం అన్ని విధాల రక్షణ కల్పించటం, అదే సమయంలో ప్రభుత్వం ఏ మత విశ్వాసాలను అనుసరించకుండా, ప్రచారం చేయకుండా, ఏ మతానికీ ప్రాధాన్యత ఇవ్వకుండా ఉండాలనేది దీని అర్థం.

సామాజిక జీవితంలో ఎదురయే సమస్యలకు అర్థం చెప్పటంలో చర్చి అవధులు లేని అధికారం కలిగి ఉండటాన్ని చారిత్రకంగా అభివృద్ధి అయిన లౌకికవాద భావాలు ప్రశ్నించాయి. యూరప్‌లో అభివృద్ధి అవుతున్న బూర్జువాలకు, అప్పటికి ఆధిపత్యంలో ఉన్న ఫ్యూడల్ శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభువులు, చర్చికి మధ్య పోరాటం జరిగింది. ఈ పోరాటంలో పైచేయి సాధించిన బూర్జువాలు రాజ్యంపై మతం ఆధిపత్యాన్ని తోసిపుచ్చారు. దానితో ప్రజాస్వామ్యం, మానవులంతా సమానులనే భావన, శాస్త్రీయాభివృద్ధికి ప్రాధాన్యత, మూఢభావాలను వదిలి అభ్యుదయ దృక్పథానికి ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా లౌకికవాద రాజ్యాన్ని ఏర్పాటు చేశారు.

కాని భారతదేశంలో భిన్నమైన క్రమంలో లౌకికవాదం అభివృద్ధి చెందింది. భారతదేశ బూర్జువాల నాయకత్వంలో వలస విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం, భిన్నమైన మత విశ్వాసాలున్న ప్రజలను ఐక్యం చేయవలసిన ఆవశ్యకత వలన దేశంలో లౌకికవాద భావాలు అభివృద్ధి చెందాయి. ఈ విధమైన ప్రత్యేకతల వలన స్వాతంత్ర్యానంతరం బూర్జువావర్గ నాయకత్వం లోని భారత రాజ్యం అన్ని మతాలకు సమానమైన గౌరవాన్ని ఇవ్వటం, అన్ని మతాలకు సమదూరం పాటించటం అనే విధానాన్ని లౌకికవాదంగా ప్రవచించింది. మతం నుండి పూర్తిగా విడగొట్టుకోకపోవటం అనే ఈ బలహీనత తమకు అవసరమైనపుడు మతశక్తులను సంతృప్తిపరచటానికి, తమకు ఉపయోగం ఉంటుందనుకున్నపుడు వాటిని తమ ప్రయోజనాల కోసం వినియోగించుకోవటానికి భారత పాలకవర్గాలకు అవకాశం కల్పించింది. లౌకికవాద విలువలు క్షీణించిపోవటానికి, మతశక్తుల పెరుగుదలకు ఈ విధానాలు మార్గం సుగమం చేశాయి.

హిందుత్వవాదులు తమదే 'అసలైన' లౌకికవాదమని, తమ ప్రత్యర్థులు అనుసరించేది నకిలీ లౌకికవాదమని వాదిస్తుంటారు. సర్వధర్మ సమభావన అంటే అన్ని మతాలను ఒకే విధంగా చూడాలని చట్టం చెబుతుందని అంటారు. మతం ప్రాతిపదికగా ఏ మతాన్ని అయినా ప్రత్యేకంగా చూస్తే చట్టాన్ని ఉల్లంఘించటమే నంటారు. అందువలన మైనారిటీలకు ప్రత్యేక సదుపాయాలను కల్పించే చట్టాలు, విధానాలను అమలు చేయటం నకిలీ లౌకికవాదమని, మైనారిటీలను జోకొట్టే విధానాలంటూ వ్యతిరేకిస్తారు. ఈ ప్రాతిపదికపైనే ఆర్టికల్ 370ని రద్దు చేయటం, ఉమ్మడి పౌరసత్వ చట్టం తీసుకురావటాన్ని సమర్థిస్తారు. అసమానమైన సంఖ్యలలో ఉన్న వివిధ మతాలకు చెందిన ప్రజలకు అన్ని చట్టాలను సమానంగా వర్తింపజేయాలని ఆర్‌ఎస్‌ఎస్ చెబుతున్నది. ఆధిపత్యంలో ఉన్న మతానికి చెందిన వారిని మరింత శక్తివంతం చేయటానికి అవసరమైన సూత్రాలను రూపొందిస్తూ, వాటిని ఇతర మతాలకు చెందిన వారు అనుసరించాలని ఒత్తిడి చేస్తున్నది.

రాజ్యం అన్ని మతాల పట్ల సహనంతో వ్యవహరించటమే లౌకికవాదం అన్న భాష్యాన్ని ఆధారం చేసుకుని ఇతర మతాలన్నింటి పట్ల నిజమైన సహనంతో వ్యవహరించేది హిందుమతం అని, కాబట్టి హిందుమతం



epaper.prajasakti.com

> **ఈ అవగాహనను అనుసరించి ఈ దేశంలో ఉద్భవించిన మత నమ్మకాలు, అలవాట్లు, ఆచారాలు జాతిని నిర్వచించటానికి కొలబద్దలుగా ఉంటాయి. పితృభూమి, పుణ్యభూమి అనే వాక్యాలు పైన చెప్పిన స్థానికతను నిర్వచిస్తాయి. ఈ కొలబద్ద ప్రకారం చూస్తే ఇస్లాం, క్రైస్తవం విదేశీ మతాలు అవుతాయి. ఆ మతాలను అనుసరించే వారు అనుమానితులు, జాతి వ్యతిరేకులు అవుతారు.**

ప్రాతిపదికగా ఉన్న దేశమే నిజమైన లౌకికవాద దేశంగా ఉంటుందని చెబుతారు.

**2. జాతీయవాదం :** రాజకీయంగా ఐక్యమైన ప్రజలను ప్రధానమైన అంశాలలో ఉమ్మడిగా కలిపి ఉంచేదే ఆధునిక జాతి. ఆ విధంగా రాజకీయంగా ఐక్యమైన ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు అంకితమై పనిచేసేదే జాతీయవాదం. జాతీయవాదం అనేది ఒకే సిద్ధాంతం కాదు. అభ్యుదయకరమైన జాతీయవాదం, తిరోగమన జాతీయవాదం ఉన్నాయి. జాతి రాజ్యంపై ఆధిపత్యం వహించే అధికార కూటమి అమలు చేసే రాజకీయ విధానాల (ప్రాజెక్టు) ద్వారా ఆయా జాతీయవాదాల నిజ స్వభావం వెల్లడౌతుంది. నిర్దిష్టమైన సరిహద్దుల లోపల ఉన్న ప్రాంతంపై జాతిరాజ్యం సార్వభౌమా ధికారం కలిగి వుంటుంది. ఆ విధంగా ఏర్పడిన దేశానికి అంకితభావంతో సేవ చేయటమే దేశభక్తి.

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి ఫలితంగా పశ్చిమదేశాలలో జాతి రాజ్యాలు ఆవిర్భవించాయి. అపుడే ఉద్భవిస్తున్న, అభివృద్ధి అవుతున్న పెట్టుబడిదారులకు జాతీయ మార్కెట్లు అవసరమైనాయి. పరిమిత ప్రాంతాలలో అధికారంలో ఉన్నవారు సరుకులపై పన్నులు విధించటం, రోడ్లపై పన్ను (టోల్) వసూలు చేయటం, ప్రత్యేకమైన ద్రవ్యం, వేరువేరు తూనికలు, కొలతలు తదితర స్థానికంగా ఉన్న ఆటంకాలను వారు బద్దలు కొట్టాల్సివచ్చింది. అందువలన స్థానిక గుర్తింపులు, మతసంస్థలకు, పాలకులకు, ప్రభువులకు లోబడి ఉండటానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం, సహోదరత్వం, సమానత్వం ప్రాతిపదికగా జరుగుతున్న జాతీయ ఉద్యమాలకు అది నాయకత్వం వహించింది. కుల, మత, వర్గ, లింగ విభజనలతో సంబంధం లేకుండా అందరికీ సమానమైన పౌరహక్కులతో జాతి ఉనికిలోకి వచ్చింది. ఒక భాష మాట్లాడే ప్రజల ఐక్యత ప్రాతిపదికగా యూరోపియన్ జాతి రాజ్యాలు ఏర్పడ్డాయి. కాని వలస దేశాలను సామ్రాజ్యవాద దేశాలు దోపిడీ చేయటంతో యూరోపియన్ జాతీయవాదం ప్రారంభం నుండి కలుషితమైపోయింది. మరో విధంగా చెప్పుకోవాలంటే యూరోపియన్ జాతీయ వాదానికి దురాక్రమణలతో కూడిన వలసవాదం, సామ్రాజ్యవాదం పర్యాయ పదంగా మారాయి.

వలస విధానం నుండి విముక్తి కోసం పోరాడుతున్న మూడో ప్రపంచదేశాల జాతీయవాదం సామ్రాజ్యవాద వ్యతిరేకమైనది, అభ్యుదయకరమైనది. విస్తారమైన ప్రజానీకాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలోకి సమీకరించటం కోసం కులం, మతం, భాష, లింగ విభజన పరిధులను బద్దలుకొట్టటం ద్వారా ఆటంకాలను అధిగమించే క్రమం కొనసాగింది. ఈ విధంగా రూపుదిద్దుకున్న సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం, వలసపాలన కాలంలో రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి అయిన ఐక్యత స్వాతంత్ర్యానంతర భారతదేశం రూపుదిద్దుకోవటానికి పునాదులు వేశాయి. స్వాతంత్రం సాధించిన నాటికి ఆనాటి ప్రపంచంలో మతాలు, భాషలతో కూడిన దేశాలలో అత్యంత వైవిధ్యభరితమైనదిగా భారతదేశం ఉన్నది. భారతదేశంలో జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ఉద్యమాల ఫలితంగా వయోజనులందరికి ఓటుహక్కునిచ్చారు. యూరోపియన్ దేశాలతో పోల్చినపుడు ఇది కూడా గుణాత్మకమైన ముందడుగుగా ఉన్నది.

ఈ విధమైన సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాద ఉద్యమ వారసత్వం స్వాతంత్ర్యనంతరం కొంతకాలం సమాజాన్ని కలిపివుంచే సైద్ధాంతిక బంధంగా పనిచేసింది. 20వ శతాబ్దంలోని చివరి 25 సంవత్సరాల కాలంలో జాతీయంగా, అంతర్జాతీయంగా చోటు చేసుకున్న ఆర్థిక, రాజకీయ పరిణామాలు మన జాతీయవాదంలోని సామ్రాజ్యవాద వ్యతిరేక సారాన్ని క్షీణింపజేశాయి. మతం, సంస్కృతి ప్రాతిపదికగా జాతీయవాదాన్ని ప్రబోధించే శక్తుల పెరుగుదలకు మార్గం సుగమం చేశాయి.

**3. సాంస్కృతిక జాతీయవాదం:** భూభాగం, రాజకీయ ప్రాతిపదికగా ఏర్పడిన జాతిని సంఘ్ పరివార్ తిరస్కరిస్తూ, దాని స్థానంలో మతం ప్రాతిపదికగా ఉండే సాంస్కృతిక జాతీయవాదాన్ని ముందుకుతెస్తున్నది. భారతదేశ సంస్కృతి, వారసత్వం హిందు మతానికి చెందినవని, భారతదేశం ఎల్లప్పుడూ హిందుదేశంగానే ఉన్నది కాబట్టి ఇతర మతాలకు చెందిన వారు జాతిలో భాగం కాదని చెబుతారు. ఒక మత నమ్మకాలకు కట్టుబడిన ప్రజలు ఉమ్మడి సంస్కృతిని అనుసరిస్తూ, ఒకే భూభాగంలో ఉన్నపుడు జాతి ఆవిర్భవిస్తుందని ఆర్ఎస్ఎస్ వివరిస్తున్నది. పురాతన కాలం నుండి హిందుదేశంలో నివసిస్తున్న ప్రజలు ఒకే సంస్కృతి, ఒకే జీవన తత్వం, ఒకే విలువలు, ఒకే విధమైన ఆకాంక్షలతో ఉండి ఒకజాతిగా రూపొందారని, చారిత్రక కాలం నుండి ఈ జాతి కొనసాగుతున్నదని చెబుతారు.

ఈ అవగాహనను అనుసరించి ఈ దేశంలో ఉద్భవించిన మత నమ్మకాలు, అలవాట్లు, ఆచారాలు జాతిని నిర్వచించటానికి కొలబద్దలుగా ఉంటాయి. పితృభూమి, పుణ్యభూమి అనే వాక్యాలు పైన చెప్పిన స్థానికతను నిర్వచిస్తాయి. ఈ కొలబద్ద ప్రకారం చూస్తే ఇస్లాం, క్రైస్తవం విదేశీ మతాలు అవుతాయి. ఆ మతాలను అనుసరించే వారు అనుమానితులు, జాతి వ్యతిరేకులు అవుతారు. మైనారిటీలను జాతి నుండి పూర్తిగా మినహాయించనప్పటికీ వారిని దిగువ తరగతి పౌరులుగా చూడటం సంఘ్ పరివార్ చెబుతున్న సాంస్కృతిక జాతీయవాద సూత్రాలలో ప్రధానమైనది. సాంస్కృతిక జాతీయవాదం అనేది ఆర్ఎస్ఎస్ చెబుతున్న హిందు జాతీయవాదాన్ని బహిరంగంగా సమర్థించేది మినహా వేరుకాదు. ఆర్ఎస్ఎస్ దృక్పథంలో జాతీయవాదం అన్నా, దేశభక్తి అన్నా హిందుయిజాన్ని గొప్పగా పొగడటమే. ఇవి మినహా ఇతర కార్యకలాపాలన్నీ జాతి


epaper.prajasakti.com

వ్యతిరేకమైనవి. అటువంటి పనులు చేసే వారందరినీ దేశద్రోహులుగా పరిగణిస్తారు.

గోల్వాల్కర్ ఇదే చెప్పాడు: ''హిందుజాతిని, హిందుదేశాన్ని తమ హృదయంలో ఘనంగా ప్రతిష్ఠించుకున్నవారు, వాటిని సాధించటం కోసం కార్యాచరణకు పూనుకున్నవారు మాత్రమే జాతీయవాదులు, దేశభక్తులు. మిగతా వారంతా దోశద్రోహులు, జాతీయ ప్రయోజనాలకు శతృవులు, సున్నితంగా చెప్పాలంటే వెధవలు''.(99-100 పేజీలు)

మతం, సంస్కృతిని ఒకటిగా చూడటం ఈ వాదనకు పునాది. అన్ని సమాజాలలోనూ చారిత్రకంగా మత, సాంస్కృతిక పరిణామాలు పరస్పరం కలిసిపోవటం ఇందుకు కారణం. ఈ కలగలిసిపోవటాన్ని ఉపయోగించుకొని, సాంస్కృతికంగా రూపుదిద్దుకున్న అంశాలను మత చైతన్యంలో భాగంగా చూపటానికి సంఘ్ పరివార్ ప్రయత్నం చేస్తున్నది. ఆ విధంగా మత నమ్మకాలపై ఆధారపడిన అంశాలను సంస్కృతిలో భాగంగా చూయించటానికి పూనుకున్నది. ఆర్ఎస్ఎస్ ముందుకు తెస్తున్న ఒకేదేశం, ఒకే భాష, ఒకే సంస్కృతి తదితర నినాదాలన్నీ సంస్కృతి ముసుగులో హిందు జాతీయవాదాన్ని ఆచరణలో పెట్టటానికి ఉద్దేశించినవి.

**4. మతతత్వం:** మతతత్వం ఒక సిద్ధాంతం. ఒక మతానికి చెందినవారందరికీ ఒకే విధమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఉంటాయని, ఒక మతంలోని వారి జీవిత విధానాలను ఆ మతమే నిర్ణయిస్తుందని, ఒక మతంలోని వారి ప్రయోజనాలతో ఇతర మతాలలోని వారి ప్రయోజనాలు పొసగవని, పూర్తి భిన్నంగా ఉంటాయని అది భావిస్తుంది. దీని ప్రకారం భారతదేశంలోని హిందువులు, ముస్లీంకు ఉమ్మడిగా ప్రయోజనం కలిగించే అంశాలు ఉండవు. ముస్లీంలకు ఉపయోగం కలిగించేవి ఏవైనా హిందువులు, హిందుజాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంటాయి.

కాని విభిన్న మతాలకు చెందినవారికి ఒకే విధమైన ప్రయోజనాలు ఉండవని భౌతిక జీవితంలో కాని, శాస్త్రీయంగా కానీ రుజువు కాలేదు. ప్రజల ప్రయోజనాలను నిర్ణయించటంలో హిందు-ముస్లిం మత విభజన ప్రధానమైనది కాదు. వర్గం, కులం, ప్రాంతం, భాష, సంస్కృతి, సామాజిక హెూదా, ఆహారం, బట్టలు ధరించే అలవాటు తదితర విభజనలు కూడా ప్రజల రోజువారీ జీవితంలో ప్రధానమైన పాత్ర నిర్వహిస్తాయి. అఖిల భారత లేదా ప్రాంతీయ స్థాయిలో నైనా హిందు-ముస్లిం మతం ప్రాతిపదికపై ప్రజలకు రాజకీయ, ఆర్థిక జీవనం లేదా ప్రత్యేక ప్రయోజనాలు ఉండవు.

మతతత్వానికి రాజకీయ ప్రయోజనాలున్నాయి. మతం పేరుతో అది పనిచేస్తుంది. రాజకీయ సమీకరణల కోసం మతపరమైన గుర్తింపును ఉపయోగించు కుంటుంది. రాజకీయ ప్రయోజనాలను సాధించుకోవటం కోసం మతానికి తప్పుడు భాష్యాలు చెబుతుంది. తన స్వప్రయోజనాలను సాధించుకోవటానికి సామాజిక జీవితాన్ని మతతత్వపూరితం చేస్తుంది. కేవలం మతపరమైన విభేదాలు, ఘర్షణలు ఉంటే మతోన్మాదం ఉన్నదని చెప్పలేం. తమ రాజకీయ లక్ష్యాలను సాధించుకోవటం కోసం ప్రజలలో ఉన్న మతపరమైన భావాలను దుర్వినియోగం చేయటం మతం నుండి మతతత్వాన్ని వేరు చేస్తుంది. ఇది ఆధునిక కాలంలోని ఒక లక్షణం.

మతతత్వం, మతం, మతాచరణలు ఒకటి కావు. మత కార్యాచరణ పెరగటాన్ని మతతత్వం పెరగటంగా భావించరాదు. ప్రజలు తమ రోజువారీ సామాజిక జీవితంలో మతపరమైన క్రతువులు, ఆచారాలను పాటించటాన్ని మత భావనలు (రెలిజియోసిటి) అంటాం. కాని మతాచారాలను పాటించటం పెరగటం మతతత్వ భావజాలం ప్రవేశించటాన్ని సులభం చేస్తుంది. సమాజంలో ఉన్న ఆర్థిక, సామాజిక పరిస్థితులు మతాచారాలను పాటించటం- ముఖ్యంగా మధ్య తరగతిలో - తగ్గటం, పెరగటానికి దారితీస్తాయి. నూతనంగా మధ్య తరగతిలో చేరిన వారిలో గణనీయమైన భాగానికి అందుకు తగినట్లుగా సామాజిక స్థాయి పెరగదు. మతాచారాలను పాటించటం, మతపరమైన కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొనటం ద్వారా ఆర్థిక స్థాయికి అనుగుణంగా సామాజిక స్థాయిని పెంచుకోవటానికి ప్రయత్నం చేస్తారు. ప్రపంచంలో అనిశ్చితి తీవ్రంగా పెరిగిన నేపథ్యంలో అప్పటికే స్థిరపడిన మధ్య తరగతి మతాచారాలను ఆచరించటాన్ని పెంచుకోవటం ద్వారా మరింత భద్రత చేకూరినట్లు భావిస్తారు.

స్వాతంత్ర్యానికి పూర్వం నుండి మనదేశంలో హిందు, ముస్లిం మతతత్వాలు చురుకుగా ఉన్నాయి. హిందు మతతత్వానికి సంఘ్ పరివార్ ప్రతినిధిగా ఉండగా, ముస్లిం మతతత్వానికి సమైక్య నాయకత్వం లేకపోవటంతో ఆ లక్ష్యానికి కట్టుబడిన వివిధ పార్టీలు, గ్రూపులు, సంస్థలు ప్రతినిధులుగా ఉన్నాయి.

**5. ఇస్లాం మతమౌఢ్యం:** ఇస్లాం మతం ప్రమాదంలో ఉందనే ప్రచారంతో వలస పాలన కాలంలో 1940వ దశాబ్దంలో ఇస్లామిక్ మతమౌఢ్యం బలపడింది. స్వాతంత్ర్యానంతరం 1960 దశాబ్దం తర్వాత హిందుత్వ మతతత్వంతో పాటు ముస్లిం మతమౌఢ్యం కూడా పెరిగింది. ముస్లిం మతచట్రంలో మతపరమైన, సాంస్కృతికపరమైన గుర్తింపును కాపాడుకోవటమనేది వారి ప్రధాన లక్ష్యంగా ఉన్నది. ఆధునిక విద్యను వారు నిరుత్సాహపరుస్తారు. ఇస్లాం మతంలో సమ్మిళిత, సహకార ధోరణులను వ్యతిరేకిస్తారు. తమ మతంలో సంస్కరణలకు ఏ మాత్రం చొరవ చూపినా ప్రతిఘటిస్తారు. మతపరమైన హింసాకాండ, సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను కల్పించటంలో ప్రభుత్వం పక్షపాతంతో వ్యవహరించటం సామాన్య ముస్లింలను కూడా మతోన్మాదుల చేతుల్లోకి నెడుతున్నాయి.

**(తరువాయి భాగం జులై సంచికలో)**


**" కాని విభిన్న మతాలకు చెందినవారికి ఒకే విధమైన ప్రయోజనాలు ఉండవని భౌతిక జీవితంలో కాని, శాస్త్రీయంగా కానీ రుజువు కాలేదు. ప్రజల ప్రయోజనాలను నిర్ణయించటంలో హిందు-ముస్లిం మత విభజన ప్రధానమైనది కాదు. వర్గం, కులం, ప్రాంతం, భాష, సంస్కృతి, సామాజిక హెూదా, ఆహారం, బట్టలు ధరించే అలవాటు తదితర విభజనలు కూడా ప్రజల రోజువారీ జీవితంలో ప్రధానమైన పాత్ర నిర్వహిస్తాయి. "**



epaper.prajasakti.com

# ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాటం కొనసాగిస్తున్న సిపిఐ(ఎం)

ప్రభాత్ పట్నాయక్



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త

**బో**ల్షివిక్ విప్లవం ముగిసిన కొద్ది కాలానికే ప్రపంచంలోని చాలా దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడి, కొత్త కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో చేరాయి. భారతదేశంలో కూడా 1920లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. బూర్జువావర్గ నాయకత్వంలో సాగుతున్న సామ్రాజ్య వ్యతిరేక పోరాటంతో కమ్యూనిస్టు పార్టీని ఎలా అనుసంధానించాలి, సమాజంలోని ఇతర వర్గాలతో, ముఖ్యంగా బూర్జువా వర్గంతో కమ్యూనిస్టు పార్టీ ఎటువంటి సంబంధాలు కలిగి ఉండాలనేవి కొత్తగా ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ ముందు అతి పెద్ద సవాళ్లుగా ఉన్నాయి.

మొదట్లో ఈ సమస్యలపై కమ్యూనిస్టుల ఆలోచనలలో ఒంటెత్తు పోకడల ప్రభావం కొంత వరకు ఉండేది. 1928లో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆరవ మహాసభ సామ్రాజ్యవాద సమస్యపై ప్రామాణికమైన సిద్ధాంతం, మరికొన్ని సమస్యలపై ముఖ్యమైన సూత్రీకరణలు రూపొందించింది. ఉదాహరణకి 'సామ్రాజ్యవాద పాలనలో వలస దేశాలలోని రైతులు పేదరికంలోకి నెట్టబడతారు, కానీ కార్మికవర్గంగా రూపొందరు' అని చెప్పింది. అందువలన ఒక సాధారణ రైతు కింద చాలా మంది వ్యవసాయ కూలీలు పని చేస్తున్నా, ఆ రైతుని పెట్టుబడిదారునిగా పరిగణించలేమని స్పష్టం చేసింది. కానీ వలస దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు అనుసరించవలసిన వ్యూహాలు ఎత్తుగడలు ఒంటెత్తువాద అవగాహనతో రూపొందాయి.

ఈ వాస్తవ పరిస్థితులతో పాటుగా కమ్యూనిస్టులపై సామ్రాజ్యవాద ప్రభుత్వాలు విపరీతమైన దమనకాండకు పాల్పడ్డాయి. 1922-27లో మోపబడిన పెషావర్ కుట్ర కేసు, 1924లో కాన్పూర్ కుట్ర కేసు, 1929లో మీరట్ కుట్ర కేసులను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. దేశంలో యువకులలో కమ్యూనిస్టు పార్టీకి మంచి పలుకుబడి ఉన్నప్పటికీ, కేసుల వలన ముఖ్యమైన కమ్యూనిస్టు నాయకులు జైళ్ల పాలవడంతో కమ్యూనిస్టు ఉద్యమం కుంటుపడింది. ఈ పలుకుబడి, సోవియట్ యూనియన్ నుండి విస్తరిస్తున్న కమ్యూనిస్టు భావాల ప్రభావంతో ఒక సంస్థగా కమ్యూనిస్టు పార్టీ చాలా చిన్నది గానే ఉన్నప్పటికీ, విస్తారమైన కమ్యూనిస్టేతర తరగతులలోకి దాని ప్రభావం విస్తరించింది. హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీలోని భగత్ సింగ్, అతని సహచర కామ్రేడ్స్‌లో దీనిని చూడవచ్చు. భగత్‌సింగ్ ఉరి తీయబడిన కొద్ది రోజుల వ్యవధిలో జరిగిన కరాచీ కాంగ్రెస్‌లో చేసిన తీర్మానాలలో అభివృద్ధి కాముక ఆలోచనల ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది- స్వతంత్ర భారతదేశం లౌకికంగా, ప్రజాతంత్ర యుతంగా, సమ సమాజంగా ఉంటుందని, పౌరులందరూ సార్వత్రిక ఓటు హక్కు కలిగి ఉంటారని, కులం, జాతి, లింగంతో ప్రమేయం లేకుండా చట్టం ముందు అందరూ సమానులుగా ఉంటారని తీర్మానం చేయబడింది.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆరవ మహాసభలో ప్రబలంగా ఉన్న ఒంటెత్తు పోకడల నుండి 1935లో జర్మనీలో నాజీలు అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఏడవ మహాసభ పూర్తిగా బయటపడింది. ఫాసిస్టు వ్యతిరేక ఐక్య వేదికకి ఈ మహాసభ పిలుపునిచ్చింది. సామ్రాజ్యవాదంతో తలపడటానికి వలస దేశాలలో వివిధ తరగతులతో కూడిన ఐక్యవేదికలు ఏర్పడాలని ఈ మహాసభ పిలుపునిచ్చింది. ఈ తీర్మానం ఫలితంగా మనదేశంలో దత్-బ్రాడ్లీ సిద్ధాంతం రూపొందించబడింది. దాని ఆధారంగా కొంత మంది కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీలో రహస్యంగా చేరి పనిచేయడం ప్రారంభించారు. కాంగ్రెస్ ద్వంద సభ్యత్వాన్ని అనుమతించదు కాబట్టి దక్షిణ ఆఫ్రికాలో ఎస్ఏసిపి ఏఎన్‌సి లో కూడా సభ్యత్వం కలిగి ఉన్నట్టుగా, కాంగ్రెస్‌లో కమ్యూనిస్టు పార్టీలో కూడా సభ్యత్వాన్ని కలిగి ఉండటం కుదరదు.

కాంగ్రెస్‌లో ఉన్న కమ్యూనిస్టులే కాదు, కమ్యూనిస్టు పార్టీ కూడా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీతో కలిసి పనిచేసేది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అంతర్గతంగా వామపక్ష ఉద్యమం శక్తి పెరగడానికి ఇవన్నీ దోహదపడ్డాయి. స్విడ్జర్లాండ్‌లోని లాసానేలో అనారోగ్యంగా ఉన్న తన భార్యను కలవడానికి నెహ్రూ వెళ్లినప్పుడు, అక్కడ రజని పామిదత్, బెన్ బ్రాడ్లీలు ఆయనను కలవడం వామపక్ష ధోరణులు దేశంలో స్థిరపడడానికి ఎంతగానో దోహద పడింది.

సమ్మె హక్కు, వేతనాలు తగ్గించడాన్ని నిరోధించడం, కార్మికులను పనుల నుండి తొలగించడం, కనీస వేతనాలు ఇవ్వాలని, ఎనిమిది గంటల పని దినాలు ఉండాలని, కౌలు వసూళ్లు 50 శాతం తగ్గించాలని, మన దేశస్థులు గాని, సామ్రాజ్యవాదులు గాని, వడ్డీ వ్యాపారులు గాని, జమిందారులు గాని ఇచ్చిన రుణాలు చెల్లించనందుకు రైతుల నుంచి భూములు లాక్కొని కూడదని, దత్ - బ్రాడ్లీ రూపొందించిన సిద్ధాంతం. ఈ ఆర్థిక కార్యక్రమాన్ని అమలు చేయాలని సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య ప్రజావేదికకి సూచించడం జరిగింది.

మహా మాంద్యం కాలమైన 1930వ దశాబ్దం రైతాంగానికి అత్యంత సంక్లిష్టమైన కాలం. రైతులంతా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారు. దివాళా తీసిన రైతాంగం పట్టణాలకు వలసలు పోవడంతో అక్కడ నిరుద్యోగ సైన్యం విపరీతంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో సామ్రాజ్యవాద వ్యతిరేకత బలపడింది. ఐక్య సంఘటనలు ఇందుకు దోహద పడడమే కాదు, కార్మికులలో, కర్షకులలో కమ్యూనిస్టు ఉద్యమం బలపడడానికి కూడా సహాయపడ్డాయి. ఒక వైపు రాష్ట్రాలలో పెల్లుబుకుతున్న ప్రజా ఉద్యమాలు, మరోవైపు భూస్వాములకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ఉద్యమాలు, రెండింటిలో ప్రధాన పాత్రధారులు కమ్యూనిస్టులే. ఉప్పెనలా చెలరేగిన అనేక ఉద్యమాలకు కమ్యూనిస్టులు నాయకత్వం వహించారు. ఈ మహోద్యమాలు 1930 చివరిలో జరిగిన ప్రావిన్షియల్ అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులంతా కాంగ్రెస్ నాయకులుగా గెలవడానికి ఉపయోగపడ్డాయి.

సోవియట్ యూనియన్ పై జర్మనీ దాడి చేయడం మొదలవగానే ఐక్య సంఘటన దశ ముగిసిపోయింది. కొంతమంది కాంగ్రెస్ వారికి కమ్యూనిస్టులపై సానుభూతి అధికంగా ఉన్నప్పటికీ, సిఎస్‌పి, కాంగ్రెస్ కూడా యుద్ధ



epaper.prajasakti.com

స్వభావంపై కమ్యూనిస్టుల అవగాహనను తోసిపుచ్చాయి. నిజానికి కాంగ్రెస్ ఇదే సమయంలో క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చింది. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్న కాంగ్రెస్ వారిలో ఎంతో మంది కమ్యూనిస్టు నాయకులు ఉన్నారు. అయితే వారు క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించడం వలన కమ్యూనిస్టులుగా ముద్రవేయటంతో కాంగ్రెస్ లోని బూర్జువా నాయకత్వం చేత కాంగ్రెస్ నుంచి బహిష్కరించబడ్డారు. భారతదేశానికి స్వతంత్రం రావలసిన కాలం దగ్గర పడుతుండడంతో కమ్యూనిస్టులతో అధికారం పంచుకోవాల్సి వస్తుందనే భయం ఈ నాయకత్వాన్ని ముంచెత్తింది.

– 2 –

స్వతంత్రం వచ్చిన వెంటనే కొత్తగా ఏర్పడిన రాజ్యం స్వభావం, కమ్యూనిస్టులకు పాలక పార్టీతో ఎటువంటి సంబంధాలు ఉండాలనే ప్రశ్నలు ముందుకు వచ్చాయి. పార్టీలో అంతర్గత చర్చలు ఉధృతమయ్యాయి. చివరికి పార్టీ విడిపోయింది. సిపిఐ(ఎం) సైద్ధాంతిక విధానం దాని కార్యక్రమంలో పొందుపరచబడింది. విప్లవానికి ముందు ఆర్ఎస్‌డిఎల్‌పిలో జరిగిన చర్చల్లో లెనిన్ ప్రతిపాదనల ప్రభావం, ఇరవైయ్యో శతాబ్దంలో మూడో ప్రపంచ దేశాలలో జరిగిన విప్లవ కార్యక్రమాలపై ఏదో ఒక మేరకు అంతర్లీనంగా ఉంటూనే ఉన్నది. చారిత్రికంగా బూర్జువావర్గం ఆలస్యంగా రంగంలోకి దిగిన నేపథ్యంలో, రష్యాలో జరిగినట్టే ఇక్కడ కూడా భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించే సమర్థత బూర్జువావర్గానికి లేకుండాపోయింది. భూస్వాముల ఆస్తులకి వ్యతిరేకంగా పోరాటం జరిపితే, రేపొద్దున తమ ఆస్తులపై కూడా కార్మికవర్గం దాడి చేస్తుందని వారు భయపడతారని' లెనిన్ వాదన. కేవలం కార్మికవర్గం నాయకత్వంలో, రైతాంగం మైత్రితో మాత్రమే భూస్వామ్య వ్యవస్థను సమూలంగా కూలదోయడం, భూస్వామ్య ప్రయోజనాలు ధ్వంసం చేయడం, ప్రజాతంత్ర విప్లవం పూర్తి చేయడం (సోషలిజం స్థాపించడం) భూమి పంచడం సాధ్యపడుతుందని లెనిన్ వాదించారు. ఇది ఆర్థిక అభివృద్ధిని నిలువరించదు, సరికదా జాతీయ ఆర్థిక పునాదిని విస్తృతపరిచి, మరింతగా పెద్దదిగా విస్తరింపచేస్తుంది. వ్యవసాయ అభివృద్ధి వేగం పెరుగుతుంది.

స్వాతంత్రానంతర భారత రాజ్యం భూపంపిణీని వేగవంతం చేసే బదులు, భూస్వాములను ప్రోత్సహించి, భూమి వైపు తిరిగి చూడక పోయినా, వారసత్వంగా, భూ

**“ అందువలన ఇక్కడ పెట్టుబడిదారీ రాజ్యం స్థానంలో, రైతాంగం మైత్రితో కార్మిక వర్గం కొత్త రాజ్యాన్ని స్థాపించి ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లాలి. ఆ తర్వాత సోషలిజం వైపుకు నడిపించాలి. సామ్రాజ్యవాదులలాగే స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో వెళ్లాలనే కాంక్ష బూర్జువావర్గానికి ఉన్నా, అది విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ అవుతుందనే విషయాన్ని మనం గమనించాలి. ”**

హక్కులు కలిగిన ధనిక రైతులను కాపాడుతూ, పెట్టుబడి దారులను స్వయంకృషి, తో భూమిని సంపాదించుకోమంటున్నది. ఇది పెట్టుబడిదారీ విధానం అవలంబిస్తున్న, బడా బూర్జువాజి నాయకత్వంలో నడుస్తున్న బూర్జువా భూస్వామ్య రాజ్యం. అందువలన ఇక్కడ పెట్టుబడిదారీ రాజ్యం స్థానంలో, రైతాంగం మైత్రితో కార్మిక వర్గం కొత్త రాజ్యాన్ని స్థాపించి ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లాలి. ఆ తర్వాత సోషలిజం వైపుకు నడిపించాలి. సామ్రాజ్య వాదులలాగే స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో వెళ్లాలనే కాంక్ష బూర్జువావర్గానికి ఉన్నా, అది విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ అవుతుందనే విషయాన్ని మనం గమనించాలి.

దీని స్వభావంలో రెండు పార్శ్వాలు గమనించాలి. మొదటిది, వామపక్ష తీవ్రవాదం చిత్రిస్తున్నట్టు ఇది పెట్టుబడిదారీ విధానాన్ని కొనసాగిస్తున్నప్పటికీ సామ్రాజ్యవాదులకు లొంగి వ్యవహరించటం లేదు. నిజానికి బూర్జువావర్గం ధనికదేశాల పెట్టుబడికి వ్యతిరేకంగా ప్రభుత్వ రంగాన్ని ప్రయోగించడం, సోవియెట్ సహాయంతో వలస ఆర్థిక విధానాలను రద్దు చేయడం, విదేశీ విధానంలో అలీన విధానం ప్రవేశ పెట్టడం వగైరాలు దేశ సహజ వనరులను తిరిగి తన అధీనంలోకి తెచ్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల వ్యక్తీకరణలు. దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయడం అంటే స్వాతంత్రానంతర భారతదేశాన్ని ప్రపంచ పెట్టుబడిదారీ క్యాంపుతో కలిపేయడం కాదు.

రెండోది, రాజ్యం బూర్జువా, భూస్వామ్యవర్గాల అనుకూల విధానంతో పెట్టుబడిదారీ వ్యవస్థకు బాట వేస్తున్నదంటే కేవలం బూర్జువా, భూస్వాముల ప్రయోజనాలే కాపాడ్డానికి అని అర్థం కాదు. అది అన్ని వర్గాలకు అతీతంగా ఉన్నట్లుగా ఒక్కొక్కసారి కార్మిక వర్గానికి, రైతాంగానికి అనుకూలమైన విధానాలు కూడా అమలు చేస్తుండవచ్చు. అందువలన అది భూస్వాములకు చెందిన భూములను కౌలు రైతుల నుండి స్వాధీనం చేసుకుని, పెట్టుబడిదారీ వ్యవసాయానికి తిరిగి భూమిని ఉపయోగించినా, సాధారణ అర్థంలో పెట్టుబడి ఆదిమ సంచయనం జరగకుండా నిలవరించింది. అంటే బడా బూర్జువాలు, రైతుల వ్యవసాయ భూములను, చిన్న ఉత్పత్తిదారుల ఉత్పత్తిని ఆక్రమించుకోకుండా నిలవరించింది. అదేసమయంలో చిన్న ఉత్పత్తిదారులు తయారు చేసే చేనేత వస్త్రాలకు కొంత రిజర్వేషన్ కల్పించింది. అంతేకాదు, వ్యవసాయ మార్కెట్‌లోకి ప్రవేశించి వారి ఉత్పత్తికి తగిన ధర వచ్చేటట్టు జోక్యం చేసుకుంటుంది. ఈ జోక్యం వలన లాభ పడే వారు కేవలం వ్యవసాయ పెట్టుబడిదారులు, భూస్వాములు మాత్రమే అయి ఉండరు. అలాగే వ్యవసాయానికి లాభం చేకూర్చే విధానాలు, ప్రపంచ మార్కెట్ నుండి రక్షణ కల్పించడం, పెట్టుబడులకు సబ్సిడీ ఇవ్వడం, వ్యవస్థాగత రుణాలు తక్కువ వడ్డీలకు సమకూర్చడం, కొత్త కొత్త విధానాలు అమలు చేయడం, కొత్త వంగడాలు రూపొందించడం వంటివన్నీ రాజ్యం చేత నడపబడే సంస్థల ద్వారా జరుగుతాయి. అయితే వీటివల్ల లాభపడేది మాత్రం అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలలోని ఎదుగుతున్న పెట్టుబడిదారీ వర్గంతో పాటు రైతాంగం కూడా లాభపడతారు.

అందువలన అమలవుతున్న పెట్టుబడిదారీ అభివృద్ధి వ్యవస్థ ప్రత్యేకమైన స్వభావం కలిగినది. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గతంగా అభివృద్ధి చెందినది. ఇది కేవలం సామ్రాజ్యవాదం ఆశీస్సులతోనే అభివృద్ధి చెందినది కాదు. ప్రధాన పెట్టుబడులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సొంతం చేసుకుని, మరింతగా సామ్రాజ్యవాదులతో మిలాఖత్ అవుతున్నప్పటికీ, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు భిన్నమైనవి అంశాలు కూడా ఉన్నాయి. ఈ ప్రత్యేక స్వభావం వలన ఇది సమాజంలో పూడ్చలేనన్ని చీలికలు తేలేదు. అంటే సామ్రాజ్యవాదులకి వ్యతిరేకంగా భుజం భుజం కలిపి పోరాడిన తరగతులు చీలిపోలేదు. ఇంకో విధంగా చెప్పాలంటే బూర్జువావర్గం తాను చేసిన అనేక వాగ్దానాలను తుంగలో తొక్కింది. ఉదాహరణకి దున్నేవాడికే భూమి ఇవ్వడం. కానీ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని, ప్రభుత్వానికి దేశ ఆర్థికవ్యవస్థపై పట్టు ఉన్నంతవరకు వదిలిపెట్టలేదు.


epaper.prajasakti.com

> **వలస పాలన కాలంలో కన్నా ఆహారధాన్యాల అభివృద్ధి రేటు పెరిగినా, అవసరమైనంతగా పెరగకపోవటానికి కారణం ఇదివరకే చెప్పినట్టు భూసంస్కరణలు జరగకపోవడమే. భారతదేశంలో జరిగిన భూసంస్కరణ ఫలితంగా భూములు కలిగిన వారిలో పై 15 శాతం మంది లాభం పొందారు. దున్నని భూములు పెద్ద మొత్తం భూస్వాముల అధీనం నుండి తప్పించి, ధనిక, కౌలు రైతులకు దఖలు చేయబడ్డాయి.**

అందువలనే పార్టీ ప్రభుత్వ పాలనను వ్యతిరేకిస్తున్నప్పటికీ, అది తీసుకున్న అనేక చర్యలను,– బ్యాంకుల జాతీయకరణ, ప్రభుత్వ రంగం అభివృద్ధి, ప్రధాన పెట్టుబడిదారుల నుంచి ప్రకృతి వనరులను స్వాధీనం చేసుకోవడం, విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టం వగైరాలను, – వ్యతిరేకించలేదు.

పెట్టుబడి అభివృద్ధి చేసుకున్న ఈ ప్రత్యేక స్వభావం, కొందరిలో ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ కాదనే అభిప్రాయాన్ని కలుగచేసింది. ఈ వ్యవస్థని 'పెట్టుబడిదారి యేతర అభివృద్ధి' వ్యవస్థగా చిత్రీకరించడం అందులో భాగమే. ఇది పాలక వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోలేకపోవటానికి, పాలకవర్గాలను గుర్తించడంలో సైద్ధాంతిక దృక్పథం లేకుండా వ్యవహరించటానికి దారితీసింది. రెండో దృక్పథం వాస్తవాలతో నిమిత్తం లేకుండా పాలకవర్గాల స్వభావాన్ని, అభివృద్ధి బాటను అంచనా వేస్తుంది. పట్టణ మధ్యతరగతికి చెందిన పెట్టి బుర్జువాలు, గ్రామీణ ప్రాంతానికి చెందిన ధనిక రైతాంగాన్ని కూడా పాలకవర్గాలలో కలిపేస్తుంది. సోషలిస్టు వ్యవస్థ లేదా పెట్టుబడిదారీ వ్యవస్థ గాని కాకుండా మధ్యేమార్గంలో అభివృద్ధి జరుగుతున్నదని చెబుతుంది. చారిత్రికంగా మధ్యతరగతి ఆధిపత్యం దీర్ఘకాలం మనలేదని స్పష్టమైనప్పటికీ, యుద్ధం ముగిసిన తర్వాత సోషలిస్టు, పెట్టుబడిదారీ శిబిరాలు ఉనికిలో ఉండడం వలన ఇది సాధ్యమౌతుందని వీరి వాదన. జరిగిన సంఘటనలు ఇది తప్పని నిరూపించాయి. కానీ స్వాతంత్ర్యానంతర కాలంలో ప్రభుత్వాలు స్వతంత్రంగా ఆర్థికవ్యవస్థను అభివృద్ధి చేయటానికి పూనుకున్నయనేందుకు ఈ తప్పుడు అవగాహన తార్కాణంగా నిలుస్తుంది.

– 3 –

అయితే ఇటువంటి ప్రభుత్వాలు దీర్ఘకాలం కొనసాగలేకపోవడానికి అందులోని అంతర్గత వైరుధ్యాలే కారణం. దాని అభివృద్ధి పూర్తిగా దేశీయ మార్కెట్ పైన ఆధారపడి ఉంటుంది. భారతదేశం వంటి దేశాలలో వ్యవసాయోత్పత్తుల ఉత్పత్తుల పెరుగుదల, ముఖ్యంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదలపై మార్కెట్ విస్తరించటం ఆధారపడుతుంది. తగినంత డిమాండ్ లేకపోవటం వలన ఆర్థికవ్యవస్థలో పూర్తి మాంద్యం చోటు చేసుకోకుండా రాజ్యం జోక్యం చేసుకుంటున్న ఆర్థికవ్యవస్థలో ప్రజల ఆహార అవసరాలు తీరిన తర్వాత మిగిలిన కొనుగోలు శక్తి ఎంతమొత్తం పారిశ్రామిక సరకులు, ఇతర సేవలకు వెచ్చించగలరనే దానిని నిర్ణయిస్తుంది. అంటే ప్రజల వద్ద నున్న మిగులుపై ఆధారపడి పారిశ్రామిక సరుకులు, సేవలకు డిమాండ్ పెరుగుదల ఆధారపడి ఉంటుంది. స్వతంత్రంగా ఆర్థికాభివృద్ధికి ప్రయత్నం చేస్తున్నపుడు దేశ జనాభా పెరుగుదల కన్నా ఆహారోత్పత్తుల అభివృద్ధి రేటు అధికంగా ఉంటే, ప్రజల వద్ద కొనుగోలు శక్తి ఎంత వేగంగా పెరిగితే, దేశీయ మార్కెట్ అంతవేగంగా అభివృద్ధి అవుతుంది.

ఇరవైయవ శతాబ్దపు మొదటి రోజుల్లో, అంటే వలస పాలన చివరి 50 సంవత్సరాలకు ముందు, తలసరి ఆహార ధాన్యాల తలసరి లభ్యత 200 కిలోలుగా ఉండేది. స్వాతంత్రం వచ్చే నాటికి 25 శాతం తగ్గి 150 కిలోలకు దిగజారింది. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం తీసుకున్న చర్యల వలన భారతదేశంలో తలసరి ఆహారధాన్యాల తలసరి లభ్యత పెరిగి, 1980ల నాటికి 180 కిలోలకు చేరింది. కానీ స్థూల జాతీయోత్పత్తి రేటు 3. 5 నుండి 4 శాతం వరకు పెంచగల స్థాయిలో ఆహారధాన్యాల పెరుగుదల లేదు. ద్రవ్యోల్బణం పెంచటం ద్వారా అభివృద్ధిని పెంచటానికి పూనుకుంటే ధరల పెరుగుదల ఎన్నికల్లో ప్రభుత్వాలకు నష్టం కలిగిస్తుంది కాబట్టి ఎన్నికలను ఎదుర్కోవలసిన ప్రభుత్వాలు ఆ మార్గాన్ని ఎంచుకోలేవు. స్థూల జాతీయోత్పత్తి రేటు, ఉద్యోగిత రేటు ఆ నాడు ఏడాదికి 2 శాతంగా, దాదాపు జనాభా పెరుగుదలకు సమానంగా ఉండేది. అందువలన నిరుద్యోగం కూడా జనాభాతో పాటుగా పెరుగుతూనే ఉండేది. అందువలన స్వతంత్రం సాధించడానికి ముందు నిరుద్యోగం తొలగిస్తామని చేసిన వాగ్దానం అమలుకాలేదు. ఆధునిక రంగాల్లో నెమ్మదిగా పెరుగుతున్న అభివృద్ధి రేటు నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది.

వలస పాలన కాలంలో కన్నా ఆహారధాన్యాల అభివృద్ధి రేటు పెరిగినా, అవసరమైనంతగా పెరగకపోవటానికి కారణం ఇదివరకే చెప్పినట్టు భూసంస్కరణలు జరగకపోవడమే. భారతదేశంలో జరిగిన భూసంస్కరణ ఫలితంగా భూములు కలిగిన వారిలో పై 15 శాతం మంది లాభం పొందారు. దున్నని భూములు పెద్ద మొత్తం భూస్వాముల అధీనం నుండి తప్పించి, ధనిక, కౌలు రైతులకు దఖలు చేయబడ్డాయి. కౌలుచేస్తున్న వారి చేతుల నుండి ఆ భూములు జారిపోలేదు. కొంత సొమ్ము చెల్లించి వారు భూములను స్వాధీనం చేసుకున్నారు. ఫలితంగా మొత్తం వ్యవసాయ భూమిలో వారి దామాషా అలాగే ఉండి పోయింది. భూ సంస్కరణలు పూర్తిగా అమలు చేసి, భూమి మొత్తాన్ని దున్నేవారికే పంచి ఉంటే పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉండేవి.

యాభై యవ దశకంలోనే పండించగల నికర భూమి మొత్తాన్ని దాదాపుగా ఉపయోగించినందు వలన ఉత్పత్తులు పెరగడానికి ఇక మిగిలింది రెండు మార్గాలే. పంట దిగుబడిని పెంచడం. స్థూల భూ వినియోగం పెంచడం. నీటిపారుదల సౌకర్యం రెండింటిని పెంచుతుంది. అయితే ఏ మేరకు పెరుగుతుందనేది ఆ సదుపాయాలు వినియోగించుకునే రైతుల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. ఎంత ఎక్కువ మంది రైతులకు ఈ సదుపాయాలు అందుబాటులోకి వస్తే పంట దిగుబడి అంత ఎక్కువగా ఉంటుంది. భూ పంపకం ఎంత ఎక్కువగా జరిగితే అంతమంది ఎక్కువ రైతులు వ్యవసాయం చేస్తారు. పైగా స్వచ్ఛంద సహకార, ఉమ్మడి వ్యవసాయ విధానాలు ఉత్పత్తిని పెంచుతాయి. ఇవే సమసమాజ స్థాపనకు ముందస్తు నిబంధనలుగా ఉంటాయి. ఈ ప్రభుత్వాల పాలనలో సక్రమైమ పద్ధతిలో భూ పంపకం జరగకపోవడం ఉద్యోగ కల్పనను పెంచడానికి ప్రధాన అవరోధంగా ఉంది.

సాధారణ ప్రజలలో ప్రభుత్వాల పట్ల అసంతృప్తి ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థ తలుపులు బార్లా తెరవడం వల్ల తమకు అవకాశాలు పెరుగుతాయని, వ్యాపారాలు స్వేచ్ఛగా జరుగుతాయని, పెట్టుబడులు దేశంలోనికి, వెలుపలికి ప్రవహించే అవకాశాలు పెరుగుతాయని, అందువలన తాము ప్రయోజనం పొందుతామని మధ్యతరగతి



epaper.prajasakti.com

భావిస్తున్నారు. వాళ్ళ పిల్లలు విదేశాలకు వెళ్లగలుగుతున్నారు. అభివృద్ధి చెందిన, అధికవేతనాలున్న దేశాల నుండి అభివృద్ధి చెందుతున్న దేశాలకు పెట్టుబడులు సులువుగా ప్రవహించడం వలన తాము ప్రయోజనం పొందగలమని, అధిక వేతనాలున్న దేశాలకు సులభంగా వలసలు వెళ్లగలుగుతున్నారు. ఫలితంగా స్వతంత్ర ఆర్థికాభివృద్ధిని సాధించటానికి పూనుకున్న ప్రభుత్వాలకు వారి మద్దతు క్షీణించింది.

అయితే ఈ భ్రమలు తొలగుతుండడానికి కారణం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో వస్తున్న నిర్మాణాత్మక మార్పులే. అమెరికా నిరంతరంగా లోటు బడ్జెట్‌లోకి వెళ్ళడానికి సోవియట్ యూనియన్, చైనాలను దిగ్బంధించటం కోసం ప్రపంచవ్యాపితంగా సైనిక స్థావరాలు ఏర్పాటు చేయడం కారణం. కానీ ఒకప్పటి సామ్రాజ్యవాద దేశం అయిన బ్రిటన్‌కు వలసల నుండి సంపద ప్రవహించినట్లుగా అమెరికాకు సంపద ప్రవహించటానికి అవకాశాలు లేకుండాపోయాయి. అందువలన ఈ లోటును పుడ్చుకోవడానికి కొత్త డాలర్ నోట్లను ముద్రించవలసి వస్తున్నది. (రెండో ప్రపంచ యుద్ధం తర్వాత డాలర్ బంగారంతో సమానంగా పరిగణించబడుతూ, 35 డాలర్లకు ఔన్సు బంగారం చొప్పున మార్చుకోవటానికి అవకాశం ఉన్నది). దానితో డాలర్లు యూరోపియన్, అమెరికన్ బ్యాంకులలోకి ప్రవహించడం మొదలు పెట్టాయి. అమెరికన్ బ్యాంకులు వాటిని లాభాలు వచ్చే అన్ని రంగాలకు అప్పులివ్వడం మొదలు పెట్టాయి. బ్రెటన్ వుడ్స్ వ్యవస్థలోలాగా అమెరికా ఏ దేశం పైనా ఆంక్షలు పెట్టదలుచుకోలేదు. మొత్తం ప్రపంచమంతా తమ ద్రవ్య పెట్టుబడులు పెట్టకోడానికి బార్లా తెరిచి ఉండాలని భావించింది.

ఈ విధంగా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించగల ద్రవ్య పెట్టుబడులు ఉనికిలోకి రావటం, 1973-74, 1979-80 లలో చమురు ధరలు పెరగడంతో వాటి పరిమాణం మరింతగా పెరిగింది. ధనికదేశాల బ్యాంకులలో డిపాజిట్లు పెరిగాయి. ఇది భారతదేశం వంటి దేశాలను ఒత్తిడికి గురిచేసింది. ఇది ఐఎంఎఫ్ వంటి సంస్థల ద్వారా జరిగింది. ఐఎంఎఫ్ అదే సమయంలో దేశ విదేశీ చెల్లింపుల లోటు పూడ్చేందుకు అవసరమైన నిధులను సమకూర్చటాన్ని సులభతరం చేసింది. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలాగా కాకుండా, భారతదేశం ఆ ఆకర్షణ నుండి కొంత కాలం పాటు దూరంగా ఉండగలిగింది. కానీ 1980లో వాటి ఎరకి లోనుకాక తప్పలేదు. ఫలితంగా నూతన ఆర్థిక

“ పశ్చిమ బెంగాల్‌లోని వామపక్ష ప్రభుత్వం 'ఆపరేషన్ బర్గా' పేరుతో కౌలుదార్లను నమోదు చేయడం ద్వారా ఈ సంస్కరణలను ప్రారంభించింది. అప్పటివరకు కౌలు రైతులకు ఏ హక్కులు ఉండేవి కావు. వాళ్ళు ఎక్కడా నమోదు చేయబడేవారు కాదు. వారికి ఏ గుర్తింపు ఉండేది కాదు. ఈ కార్యక్రమంతో గత రెండు ఐక్య సంఘటన ప్రభుత్వాలు ప్రారంభించి, చాలాకాలం మూలపడేసిన ఉన్న భూ పంపకం ఊపందుకున్నది. ”

విధానాలకు తలుపులు బార్లా తెరిచింది.

నూతన ఆర్థిక విధానాలకు తలొగ్గడమే భారతదేశ బడా బూర్జువావర్గ వైఖరిలో సమూలమైన మార్పు రావడానికి కారణం. సామ్రాజ్యవాదంతో సంబంధం లేని, పరిమితంగా నైనా తన సొంత పెట్టుబడిదారీ విధానాన్ని స్థాపించుకోవాలనే లక్ష్యం నుండి అది వైదొలగింది. దేశీయ మార్కెట్‌కే పరిమితమవడం దానిని నిరుత్సాహపరిచింది. దేశీయ మార్కెట్‌ను తన అధీనంలో ఉంచుకుంటూనే అంతర్జాతీయ మార్కెట్‌పై పట్టు సాధించడానికి విదేశీ పెట్టుబడితో సంబంధం పెట్టుకోవాలని భావించింది. కానీ విదేశీ పెట్టుబడి దాని ఆటలు సాగనివ్వలేదు. మన దేశీయ మార్కెట్లోకి కూడా ప్రవేశించడానికి అవకాశాలు ఉండాలని అది పట్టుబట్టింది. చివరికి భారతదేశ బడా బూర్జువావర్గం అంతర్జాతీయ పెట్టుబడి డిమాండ్‌కి తలొగ్గక తప్పలేదు. అందువలననే ఇతర దేశాలకంటే భారతదేశంలో నయా-ఉదారవాద విధానాల అమలు ఆలస్యంగా ప్రారంభమైంది.

ఇవన్నీ సోవియట్ యూనియన్ కుప్పకూలిపోయే ముందే జరిగాయి. అయితే సోవియట్ యూనియన్ కుప్పకూలిపోవడంతో నయా-ఉదారవాద విధానాల వైపు మొగ్గు నిర్ణయాత్మకంగా మారింది.

\- 4 -

చివరికి మన ప్రభుత్వాల పాలన ఒక మూలమలుపుకు చేరుకుంది. ఈ దారిలో ప్రయాణం నిరుద్యోగ సైన్యాన్ని పెంచింది. నిరుద్యోగాన్ని తగ్గించడానికి ఉత్పత్తిని పెంచే ఏ చర్యలు తీసుకున్నా అవి, ఆహారధాన్యాల ధరలతో సహా అన్ని ధరల పెరుగుదలకు దారితీస్తున్నాయి. ప్రజలు నిరుదోగాన్ని గాని, అధికధరలను గాని సహించే పరిస్థితిలో లేరు. వాళ్ళు తమ వ్యతిరేకతను ప్రజాతంత్రయుతంగా ఎన్నికలలో తెలియచేసారు. అందువలన యధాతథ పరిస్థితికి, ఎన్నికల ప్రజాస్వామ్యానికి పొసగే పరిస్థితి లేదు. దానితో ప్రజాస్వామిక ఎన్నికల విధానాన్ని వదులుకోవటానికి జరిగిన ప్రయత్నం 1975-77లో అత్యవసర పరిస్థితి విధించడానికి దారితీసింది.

సిపిఐ(ఎం) అత్యవసర పరిస్థితి విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రజల హక్కులు కాపాడడానికి దృఢంగా నిలబడింది. ఆ తర్వాత వచ్చిన ఎన్నికలలో దానికి పార్లమెంటులో గణనీయమైన ప్రాతినిధ్యం లభించింది (22 స్థానాలు దక్కాయి). 1977లో పశ్చిమ బెంగాల్‌లో మొదటి సారిగా వామపక్ష సంఘటన ప్రభుత్వం ఏర్పడింది (అంతకు ముందు ఏర్పడ్డ ప్రభుత్వాలు ఐక్య సంఘటన ప్రభుత్వాలు. అయితే 1957లో కేరళ ప్రభుత్వం లాగే ఇది కూడా భూ సంస్కరణలు అమలు చేయడం మొదలు పెట్టింది.)

పశ్చిమ బెంగాల్‌లోని వామపక్ష ప్రభుత్వం 'ఆపరేషన్ బర్గా' పేరుతో కౌలుదార్లను నమోదు చేయడం ద్వారా ఈ సంస్కరణలను ప్రారంభించింది. అప్పటివరకు కౌలు రైతులకు ఏ హక్కులు ఉండేవి కావు. వాళ్ళు ఎక్కడా నమోదు చేయబడేవారు కాదు. వారికి ఏ గుర్తింపు ఉండేది కాదు. ఈ కార్యక్రమంతో గత రెండు ఐక్య సంఘటన ప్రభుత్వాలు ప్రారంభించి, చాలాకాలం మూలపడేసిన ఉన్న భూ పంపకం ఊపందుకున్నది.

భూ పంపకం, ఇతర చర్యలు కలిసి పశ్చిమబెంగాల్‌లో వ్యవసాయాభివృద్ధి వేగాన్ని పెంచాయి. వాటిలో ఒకటి వ్యవసాయానికి కేటాయింపులు పెంచడం, నీటిపారుదల తదితర సౌకర్యాలు కల్పించడం. మరొకటి 'దున్నేవాడికే పంట' విధానాన్ని వ్యవస్థాగతం చేయటం. ఇంతకు ముందు కౌలు రైతు భూమిని దున్నేవాడు. పంటను భూస్వామి కొల్లగొట్టేవాడు (కౌలు రైతుకు తనకు చిత్తం వచ్చినంత ఇచ్చేవాడు). కౌలు విధానాన్ని వ్యవస్థాగతం చేయడంతో రైతు పంటను తీసుకుని, భూస్వామికి చట్టపరంగా చెల్లించవలసినది చెల్లిస్తే చాలు (ఇందుకు గాను అతడు రసీదు కూడా పొందుతాడు). ఇది కౌలు రైతులకు అధిక పంట పండించేందుకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. అందువలనే 1990లలో పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి వేగం ఊపందుకుంది. దేశంలోని అన్ని రాష్ట్రాలను వెనక్కి నెట్టి పశ్చిమ బెంగాల్ అగ్రభాగాన



epaper.prajasakti.com

> "పారిశ్రామికరణకు మరికొన్ని చర్యలు కూడా చేపట్టవలసిన అవసరం ఉంది. ఉదాహరణకి స్థానిక ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో పరిశ్రమలు స్థాపించడం లాంటి కొత్త ఆవిష్కరణలను గురించి ఆలోచించవలసి ఉంటుంది. లేదా రైతాంగ సహకార సంస్థల సహకారంతో పరిశ్రమలు నెలకొల్పవచ్చు (కేరళలోని కొన్ని ప్రాంతాలలో ఈ విధమైన ప్రయోగం జరుగుతున్నది). అప్పుడు భూమి స్వాధీన పరుచుకోడానికి, పారిశ్రామికీకరణకు మధ్య వైరుధ్యం తలెత్తదు."

నిలిచింది. వ్యవసాయ ఉత్పత్తిలో పెరుగుదల ఇతర వినిమయ వస్తువుల డిమాండ్‌ని పెంచింది. ఫలితంగా ఇతర వస్తు ఉత్పత్తి డిమాండ్ పెరిగింది. ఈ పెరిగిన డిమాండ్‌తో చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు ఊపందుకున్నాయి.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చిన మరో సరికొత్త మార్పు ప్రజాతంత్ర వ్యవస్థ వికేంద్రీకరణ ద్వారా స్థానిక సంస్థల వనరులను, అధికారాలను పెంచడం. స్థానిక సంస్థలు, స్థానికులతో చర్చించుకుని తమ గ్రామాలకు అవసరమైన వివిధ ప్రణాళికలు రూపొందించుకొని, వాటిని అమలు చేసేవారు. నిజమైన ఈ ప్రజాతంత్ర వ్యవస్థ వికేంద్రీకరణ ఆ తర్వాతి రోజుల్లో దేశవ్యాప్తంగా అమలు చేయబడింది. ముఖ్యంగా దీనిని రాజ్యాంగంలో కూడా సవరణ చేసి చేర్చడం జరిగింది. అయితే పశ్చిమ బెంగాల్‌లోని వామపక్ష ప్రభుత్వం దీనంతటికి ప్రధాన పాత్ర పోషించింది.

కేరళలో పాలిస్తున్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. అనేక బడులు, ఆసుపత్రులను అక్కడ పనిచేసే ఉద్యోగులతో సహా ఆయా స్థానిక సంస్థలకి అప్పచెప్పింది. ప్రభుత్వం నిర్ణయించిన దామాషాలో రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రతి సంవత్సరం స్థానిక సంస్థలకు ప్రణాళికా నిధులు బదిలీ చేయడం తప్పనిసరి అని శాసనసభలో చట్టం చేసింది. స్థానిక సంస్థలు ఆ నిధులను తమ గ్రామ సభలు నిర్ణయించిన ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉపయోగించుకోవచ్చు.

ఎల్‌డిఎఫ్ ఆధ్వర్యంలో కేరళలో కూడా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. అయితే కేరళలో ఉన్న భౌగోళిక పరిమితుల వలన బెంగాల్ స్థాయిలో పెరగలేదు. కానీ రాష్ట్ర బడ్జెట్లో ప్రజలకు సంక్షేమ పథకాలకు ఖర్చులు పెంచడం వలన ప్రజల వినిమయ శక్తి పెరిగింది. ఇది కూడా స్థానికంగా డిమాండ్ పెరగడానికి దోహదం చేసింది. అందువలనే చిన్న పరిశ్రమల అభివృద్ధి బాగా పెరిగింది. నిజానికి 2004-05, 2011-12 కేరళ తలసరి నిజ స్థూల ఉత్పత్తి, ప్రజలలో అసమానతలు చాలావరకు తగ్గించడమే కాకుండా, మోడీ గారు అత్యంత అధిక అభివృద్ధి సాధించానని గొప్పలకు పోతున్న ఆయన గారి గుజరాత్‌కి దాదాపు సరి సమానంగా ఉండేది.

త్రిపుర మూడవ వామపక్ష పాలిత రాష్ట్రం. ఆ కాలంలో అక్కడ కూడా అనేక సామాజిక సూచికలలో గణనీయమైన మార్పు జరిగింది. సామాజిక ఆర్థిక, సూచికలలోనే కాక మరో ముఖ్యమైన అంశంలో కూడా వామపక్ష ప్రభుత్వం నూతన విధానాలను అమలు చేసి, విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్‌లో గూర్ఖాలాండ్, త్రిపురలో గిరిజన ఉద్యమాలు ముందుకుతెస్తున్న సమస్యలను పరిష్కరించటం కోసం చేసిన విధంగా స్వయం ప్రతిపత్తి కౌన్సిళ్ళను ఏర్పాటు చేసింది.

ఈ మూడు వామపక్ష ప్రభుత్వాల చర్యలు వామపక్ష అభివృద్ధి వ్యూహాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. అందులో ముఖ్యాంశాలు, వ్యవసాయ రంగం పెరుగుదలను శ్రామిక వర్గం చేతులలో ఉంచి, రాష్ట్రం బడ్జెట్లో ఈ రంగానికి కేటాయింపులు చేస్తే, వ్యవసాయరంగం వేగంగా అభివృద్ధి చెంది, ప్రజల చేతులలో వినిమయ శక్తిని పెంచుతుంది. దీనివల్ల వివిధ వర్గాల గ్రామీణ ప్రజల మధ్య ఆర్థిక సమతుల్యత ఏర్పడుతుంది. పెరిగిన వినిమయ శక్తితో స్థానిక చిన్న ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుంది. దీనివలన చిన్న పరిశ్రమలు అభివృద్ధి చెంది మరింత మందికి ఉపాధి కల్పిస్తాయి. వినిమయ సరుకుల డిమాండ్ మరింత పెరుగుతుంది. ఇది ఉద్యోగితను అనేక రెట్లు పెంచుతుంది. ఈ విధమైన అభివృద్ధి వలన ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ప్రధానంగా ముఖ్యంగా విద్య, సంపదను సృష్టించడంలో సామాజిక వ్యయం పెంచాలి. దీనికి తోడుగా స్థానికంగా కింది వరకు ప్రజలు పాల్గొనే విధంగా ప్రజాతంత్ర వ్యవస్థను పటిష్టం చేయాలి.

బడా బూర్జువావర్గానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పన్ను రాయితీలు, ఆదాయాన్ని కేంద్రీకరించటంతో ఆర్థిక వనరులు కుంచించుకుపోవటం వలన రాష్ట్రాలపై వత్తిడి పెరుగుతున్నది. ఫలితంగా కాలం గడిచేకొద్దీ ఈ వ్యూహాన్ని అమలు చేయడం కష్టసాధ్యమవుతుంది. కానీ పార్టీ నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు సరైన ఫలితాలను ఇస్తున్నాయని ఈ ప్రభుత్వాలు వరుసగా ఎన్నికలలో గెలవడం తెలియజేసింది. నిజానికి బెంగాల్‌లో వామమపక్ష ప్రభుత్వంపై కార్మికవర్గం 34 ఏళ్లపాటు నమ్మకాన్ని ఉంచింది.

అయితే, ఈ వ్యూహానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా-ఉదారవాద విధానాలకు మధ్య వైరుధ్యం ఉంది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా-ఉదారవాద విధానాలు వ్యవసాయ సంక్షోభానికి కారణం. కేంద్రం తన ఉదారవాద విధానాలతో రైతులతో సహా చిన్న ఉత్పత్తి రంగానికి మద్దతును ఉపసంహరించేటట్టు ప్రపంచ ద్రవ్య పెట్టుబడి చేస్తుంది. అందువలన ప్రజలలో కొనుగోలు శక్తి క్షీణిస్తోంది. సరుకులు సేవల(జిఎస్‌టి) పన్ను వలన వనరులు కేంద్రం వద్ద చేరతాయి. సంక్షేమ పథకాలకు, బళ్ళు, ఆసుపత్రులు నడపడానికి కూడా రాష్ట్రాల చేతిలో వనరులు లేకుండా చేస్తుంది. విద్యను, ఆరోగ్యాన్ని ప్రైవేటీకరించడం వలన కార్మికవర్గం నిజ ఆదాయం మరింత కుంచించుకుపోతుంది.

వామపక్ష నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి, భారీ పరిశ్రమల నిర్మాణానికి పెట్టుబడులను ఆహ్వానించడాన్ని ఈ నేపథ్యంలో చూడాలి. అయితే ఇదొక్కటే చాలదని అనుభవం చెపుతున్నది. పారిశ్రామికరణకు మరికొన్ని చర్యలు కూడా చేపట్టవలసిన అవసరం ఉంది. ఉదాహరణకి స్థానిక ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో పరిశ్రమలు స్థాపించడం లాంటి కొత్త ఆవిష్కరణలను గురించి ఆలోచించవలసి ఉంటుంది. లేదా రైతాంగ సహకార సంస్థల సహకారంతో పరిశ్రమలు నెలకొల్పవచ్చు (కేరళలోని కొన్ని ప్రాంతాలలో ఈ విధమైన ప్రయోగం జరుగుతున్నది). అప్పుడు భూమి స్వాధీన పరుచుకోడానికి, పారిశ్రామికీకరణకు మధ్య వైరుధ్యం తలెత్తదు. స్థూలంగా చెప్పుకోవాలంటే, వామపక్షాలు అభివృద్ధికి బాటలు వేయడానికి కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు రావాలి.

– 5 –

ఈ రోజు పార్టీ, వామపక్షాలు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తున్నది. అందులో మొదటిది గతంలో వలె కాకుండా సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత వైరుధ్యాలు మొద్దుబారడం. సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలున్నాయని, అవి ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా



epaper.prajasakti.com

విప్లవాలు తేవడానికి అనుకూలమైన పరిస్థితులు కల్పిస్తాయని మొదటి నుండి కమ్యూనిస్టులు భావిస్తున్నారు. నిజానికి 'సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత వైరుధ్యాలు, సంఘర్షణలు ఉండడం వలన "అది బోల్షివిక్ విప్లవం" 'ఊపిరి పీల్చుకునే అవకాశం కలిగించింది' అని లెనిన్ తన చివరి రచనలలో ఒక దానిలో రాసారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒకవైపు సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు మొద్దు బారడం, మరో వైపు సోవియట్ యూనియన్ కుప్పకూలిపోవడం ప్రపంచంలోని కమ్యూనిస్టుల ముందు ఒక పెద్ద సవాలుగా ఉంది.

> **" అందువలన ఈ నాటి పాలనలో కమ్యూనిస్టు రాజకీయాలు ముందు నిలిచి నడవలేకపోయినా, సరైన సమయం వచ్చినప్పుడు ఉప్పెనలా ఎగసిపడి, విభజించి పాలించే రాజకీయాలకు ఎదురు నిలుస్తాయి. నయా-ఉదారవాద విధానాల వలన ఏర్పడిన సంక్షోభం ఇటువంటి పరిస్థితులను కల్పిస్తుంది. ఈ సంక్షోభంలో సంపద అంతా ఒక వైపు పోగుపడుతుంటుంది. ప్రపంచంలోని అన్ని దేశాలు, ప్రతి దేశంలో ఆదాయాల అసమానతలు పెరుగుతాయి. "**

దీనికి అదనంగా మరో సవాలు ఉంది. అదే నయా-ఉదారవాదం. ఇది ప్రపంచంలోని కార్మిక వర్గాన్ని నిరంతరం డబ్బును ఆర్జించడంలో మునిగిపోయేట్టు చేయడమే కాక, వారిలో పోరాడే శక్తిని బలహీనపరుస్తుంది. భారతదేశంలో కూడా ఈ పరిస్థితిని చూస్తాం. ప్రణాళికా సంఘం దారిద్ర్యరేఖకు ప్రమాణంగా నిర్ణయించిన రోజుకి 2200 క్యాలరీల ఆహారం అందుబాటులో లేని గ్రామీణ ప్రజలు 1993-94లో 58 శాతం ఉండగా, 2011-12కి అది 68 శాతానికి, పట్టణ ప్రాంతాలలో 2100 క్యాలరీలు ఆహారం అందని వారు 57 శాతం నుండి 65 శాతానికి పెరిగిందని ప్రణాళికా సంఘం చెప్పింది.

ఇదెలా జరిగిందన్నది మనకు తెలిసిన విషయమే. వ్యవసాయం సంక్షోభంలో పడడం, చిన్న ఉత్పత్తిదారులకు ప్రభుత్వం మద్దత్తు ఉపసంహరించడం. అందు వలన రైతాంగం పొట్ట చేతపట్టుకుని గ్రామాల నుండి పట్టణాలకు వలసలు పోయారు. కానీ నయా-ఉదారవాద విధానాలు అమలు చేయడం వలన కొంతమంది బడా పెట్టుబడిదారులు తమ ఉత్పత్తుల స్థానాలను (పరిశ్రమలను) మార్చడం, స్థూల జాతీయోత్పత్తి పెరిగినప్పటికీ ఉద్యోగకల్పన రేటు జనాభా పెరుగుదల రేటుకన్నా తక్కువగా ఉంది. 1991 కంటే 2011 లో భారతదేశంలో రైతుల సంఖ్య 1.5 కోట్లు తగ్గింది. కొందరు వ్యవసాయ కార్మికులలో చేరిపోగా,ఇతరులు పట్టణ ప్రాంతాలకు పోయి అక్కడ పరిమితంగా ఉన్న పనుల కోసం నిరుద్యోగులతో పోటీపడుతున్నారు.

ఈ పెరిగిన పట్టణ కార్మిక శక్తి వలన అక్కడ వేతనాలు, వారి బేరసారాల శక్తి క్షీణించింది. అలా క్షీణించడానికి అదనంగా మరో రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా సంచరించే అవకాశాలు ఏర్పడడం. అంటే ఏ ఒక్క ప్రాంతంలో అయినా కార్మికులు సంఘటిత పోరాటాలు చేయడం మొదలు పెడితే అక్కడి నుండి పెట్టుబడి మరో ప్రాంతానికి తరలిపోతుంది. ఇది కార్మికులను సంఘటిత పోరాటాలలోకి దిగకుండా నిలవరిస్తుంది. రెండోది ప్రభుత్వ రంగం ప్రైవేటీకరించబడడం. ప్రపంచంలో ఏ దేశం అయినా ప్రభుత్వ రంగంలో సంఘాల ఏర్పాటుకు కొంత మెరుగైన అవకాశాలు ఉంటాయి. వారు సంఘటిత పోరాటాలు చేయగలుగుతారు. ప్రైవేటీకరించడం వలన సంఘటిత పోరాటాలు చేసే కార్మిక వర్గ శక్తికి అడ్డుకట్ట పడుతుంది.

అంటే ప్రభుత్వ రంగం ఉన్నప్పటి కన్నా నయా-ఉదారవాద విధానాలు కార్మికుల పోరాట శక్తిన తగ్గించిందన్నమాట. నయా-ఉదారవాద విధానాలు అమలవు తున్నప్పుడు కూడా కార్మిక వర్గం భారత దేశంలో అనేక పెద్ద పెద్ద పోరాటాలు చేసిన మాట వాస్తవమే. కానీ అంతకు ముందు చేసిన పోరాటాలతో పోల్చినపుడు వారి సమ్మె చేసే శక్తి క్షీణించింది. అలాగే వ్యవసాయ కూలీలు, చిన్న ఉత్పత్తి దారులలో ఇదివరకే పోరాట శక్తి తక్కువగా ఉండేది. ఈ ఉదారవాద విధానాలు అమలైనప్పటి నుండి వారి పోరాట శక్తి మరింత క్షీణించింది. ఈ పరిమితులు దృష్టిలో ఉంచుకున్నప్పుడు ఈ మధ్య జరిగిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం మరింత మహత్తరమైనది అని చెప్పుకోవలసి ఉంటుంది.

నయా-ఉదారవాద విధానాలు వర్గ పోరాటాలపై నీళ్లు జల్లి, 'అస్తిత్వ రాజకీయాలను' ప్రోత్సహిస్తాయి. అంటే సామాజికంగా అణగారిన దళితులు, వెనకబడిన వారి హక్కులు సాధించుకోడానికి, వారు కూడా ఉన్నత కులాలతో సరిసమానంగా ఎదగడానికి ప్రోత్సహిస్తుందని కాదు. కార్మిక వర్గాన్ని కులాల వారి, మతాల వారి చీలుస్తుందని అర్థం. అందువలనే నయా-ఉదారవాద విధానాలు సంక్షోభంలో పడినప్పుడు బడా బూర్జువావర్గం నిధులిచ్చిమతతత్వ ఫాసిస్టు శక్తులను పోషిస్తుంది.

అందువలన ఈ నాటి పాలనలో కమ్యూనిస్టు రాజకీయాలు ముందు నిలిచి నడవలేకపోయినా, సరైన సమయం వచ్చినప్పుడు ఉప్పెనలా ఎగసిపడి, విభజించి పాలించే రాజకీయాలకు ఎదురు నిలుస్తాయి. నయా-ఉదారవాద విధానాల వలన ఏర్పడిన సంక్షోభం ఇటువంటి పరిస్థితులను కల్పిస్తుంది. ఈ సంక్షోభంలో సంపద అంతా ఒక వైపు పోగుపడుతుంటుంది. ప్రపంచంలోని అన్ని దేశాలు, ప్రతి దేశంలో ఆదాయాల అసమానతలు పెరుగుతాయి. ఉత్పత్తి విపరీతంగా పెరగడానికి ఇది దోహద పడుతుంది. రాజ్యాలు జోక్యం చేసుకుని ఆర్థిక వ్యవస్థను సరి చేయగలిగినా, ప్రపంచ ద్రవ్య పెట్టుబడి అందుకు అడ్డు తగులుతుంది. దాని శాసనాల ఫలితంగానే రాజ్యం తన ఖర్చులకు గాను పొందే వనరులు కుదించబడతాయి. ద్రవ్యలోటు లేని బడ్జెట్లు రూపొందించ బడతాయి. ధనికులపై పన్ను భారాలు లేని విధానాలను అమలుచేస్తారు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు, ప్రజల సంక్షేమానికీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోకి రాజ్యం నెట్టబడుతుంది.

\- 5 -

ఈ పరిస్థితులలోనే కార్పొరేట్ ద్రవ్య కూటములు ప్రపంచవ్యాప్తంగా ఉదారవాద విధానాలు కొనసాగేలా చర్యలు తీసుకునేందుకు ఫాసిస్టు శక్తులను ప్రోత్సహిస్తున్నాయి. ఈ ధోరణికి భారతదేశం మినహాయింపు కాదు. ఇక్కడ కార్పొరేట్ ద్రవ్య కూటమి హిందుత్వ శక్తులతో మిలాఖత్ అయి, కార్పొరేట్ హిందుత్వ కూటమిగా ఏర్పడింది. ఈ కార్పొరేట్ హిందుత్వ కూటమే ఈ నాటి విధాన రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషిస్తున్నది. అది ముస్లింలను 'ఇతరులుగా' ముద్రవేస్తున్నది. వారిపై విషం చిమ్ముతున్నది. ప్రజల సమస్యలను ఆ విధంగా పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నది. అందువలన ప్రభుత్వం నిరుద్యోగం, అధిక ధరలు వంటి తీవ్రమైన సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్ళించగలుగుతున్నది. ఇంత తీవ్రమైన సంక్షోభం ఉన్నప్పటికీ అధికారంలో ఉన్నవారే కొనసాగుతున్నారు. ఇదివరకటి ప్రభుత్వాలను ఈ సంక్షోభానికి కారణంగా, 'ఇతరులను' 'సంతృప్తి' పరచడం వలన ఏర్పడినవిగా ఈ సమస్యలను చిత్రించగలుగుతున్నారు.

ఈ కూటమి కేవలం ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలు - దేశీయ కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడి కూటమి, ప్రపంచ పెట్టుబడుల


(మిగతా 16వ పేజీలో)



epaper.prajasakti.com

పార్టీ నిర్మాణం

# ఉద్యమ పోరాటాలా? మార్కెట్ నమూనాలా?



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఎస్.వీరయ్య

**సమాజంలో వినిమయ సంస్కృతి ఎందుకు విస్తరిస్తున్నది? పార్టీశ్రేణులను ఉదారవాద ప్రభావాలు ఆవహిస్తే ఏం జరుగుతుంది? కమ్యూనిస్టు విలువలు బలంగా ఉంటే ఏమవుతుంది?**

ఇవన్నీ ఇప్పుడు చర్చించాల్సిన విషయాలే. వీటికి తోడు శాసనసభలో ప్రాతినిధ్యం కూడా లేకుండా కమ్యూనిస్టు ఉద్యమం ముందుకు సాగుతుందా లేదా అనే ప్రశ్న కూడా తలెత్తుతున్నది. ఒకటి నిజం. గత కొంత కాలంగా ఉద్యమాల తీవ్రత తగ్గింది. కులం, మతం, ప్రాంతం లాంటి భావాలే ఎక్కువగా ప్రభావితం చేసిన కాలం. దీనికితోడు సమాజంలో సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా అనేక మార్పులు వచ్చాయి. సాధారణ ప్రజలమీద భారాలు పెరిగాయి. విద్య, వైద్యం కార్పొరేట్ పరమైంది. ఆదాయంలో అధిక భాగం వీటికే పోతున్నది. మరోవైపు అక్రమ సంపాదనా మార్గాలు పెరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం, అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాంట్రాక్టులు సంపాదించడం, ప్రజాప్రతినిధిగా ఉండి ఖజానా కొల్లగొట్టటం, రకరకాల పేర్లతో వసూళ్ళ దందాలు, సెటిల్‌మెంట్లు, కబ్జాలు ఇంకా ఎన్నో మార్గాలు ముందుకొచ్చాయి. కొంతమంది అడ్డదారులలో సంపాదించడం పెరిగింది. వీటితో పాటు మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతికి సౌకర్యాలు కూడా పెరిగాయి. సాధారణ ప్రజల్లోకి కూడా కొన్ని సౌకర్యాలు విస్తరించాయి. కొత్తరకాల ఖర్చులు ముందుకొచ్చాయి. కార్లు, మోటారు సైకిళ్ళు, స్మార్ట్ ఫోన్లు, వాషింగ్ మెషిన్లు, ఏసి బస్సులు, లాడ్జీలు, స్విగ్గీ, జొమాటో, ఓలా, ఊబర్ లాంటి సర్వీసుల వినియోగాలు పెరిగాయి. ఈ పరిణామాలన్నీ సహజంగానే కమ్యూనిస్టు శ్రేణుల మీద కూడా ప్రభావం చూపుతాయి. కుటుంబాల మీద ఒత్తిడులు పెరిగాయి. పాలకవర్గాలకు ఇవి అవకాశాలుగా మారాయి.

ప్రభుత్వ విధానాల్లోనూ, ప్రజల ఆలోచనా ధోరణుల్లోనూ అనేక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు పాలకులు పొదుపును ప్రోత్సహించారు. పోస్టాఫీసులో పొదుపు పథకాలు మొదలు అనేక రకాల స్కీములు ప్రచారంలో పెట్టేవారు. దానికి పూర్తి విరుద్ధంగా ఇప్పుడు ఖర్చు పెట్టే మార్గాలు చూపిస్తున్నారు. విశృంఖల ఖర్చును ప్రోత్సహిస్తున్నారు. అనేకమంది జేబుల్లోకి క్రెడిట్ కార్డు వచ్చేసింది. జేబులో గానీ ఇంట్లో గానీ డబ్బు లేకపోయినా కార్డు గీకి ఎన్ని సరుకులైనా కొనవచ్చు. నెలాఖరుకు 22-23 శాతం వడ్డీ పడుతుందనే స్పృహ మాత్రం ఉండదు. ఇప్పుడు డెబిట్ కార్డు సర్వసాధారణమైంది. ఇది సరుకుల కొనుగోళ్ళకు అవసరం. ఒకప్పుడు ఆదాయాన్ని బట్టి ఖర్చు నిర్ణయించుకునేవారు. నెల బడ్జెట్ వేసుకునేవారు. ఇప్పుడు ఆర్భాటాలకు వనరుల సమీకరణ ముందుకొచ్చింది. ఆదాయంతో సంబంధం లేదు. పుట్టినరోజు, పెండ్లి రోజు, షష్టిపూర్తి మొదలు ఇప్పుడు బహుశా 365 రోజుల్లో ప్రతిరోజూ ఏదోఒక పేరున్నది. మదర్స్ డే, ఫాదర్స్ డే, ప్రేమికుల దినోత్సవం, ఫ్రెండ్స్ డే... ఏదో ఒక పేరు, ప్రతి రోజూ ఉత్సవమే. ఏదో ఒక పేరుమీద బహుమతులు ఇవ్వవలసిందే. ఎందుకీ మార్పు? సరుకుల అమ్మకం కోసమే, మార్కెట్ కోసమే ఈ మార్పు. పెట్టుబడిదారుల లాభార్జన పెంచుకోవడం కోసమే ఈ మార్పు. సరుకులు కొనడం అంటే ఖర్చులు పెరగడమే. ఆడంబరాలు పెరగడం అంటే అప్పులు పెరగడమే. మరి సంపాదన కూడా పెరగాలి కదా! అందుకే సంపాదించడమే తెలివితేటలకు కొలబద్దగా భావించడం మొదలైంది. ఎట్లానైనా సంపాదించు. సంపాదించడమే ముఖ్యం. 'సంపాదించు, అనుభవించు, ఆనందించు'... ఇదే ఇప్పుడు అమలులో ఉన్న సూత్రం. వినిమయ సంస్కృతికి మూల సూత్రం. ఈ వినిమయదారీతత్వం, వ్యక్తివాదం, ఆర్భాటాలు, విలాసాలు గొప్పతనానికీ, ప్రతిష్టకు నిదర్శనాలుగా మారాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అభివృద్ధి నిరోధక విలువలు ఆధిపత్యంలోకి వచ్చాయి.

ఉదారవాద విధానాలు బలపడుతున్న కాలంలోనే మధ్యతరగతి కూడా పెద్దఎత్తున విస్తరించింది. ఈ విధానాల వల్ల మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కొంత లాభపడింది కూడా. అందుకే కొంతకాలం మోజుపడింది కూడా. ఈ పరిణామమే సమాజంలో సమిష్టితత్వం స్థానంలో స్వార్థం పెరగడానికి దారితీసింది. ఆ మేరకు కమ్యూనిస్టు శ్రేణుల మీద కూడా ప్రభావం చూపింది. గుర్తింపు కోసం తాపత్రయం పెంచింది. 'అంతా నేనే' అనే అహంభావాన్ని పెంచింది. ప్రజలకన్నా తానొక మెట్టు పైనున్న భావాన్ని ప్రోత్సహించింది. ప్రజాపునాది కన్నా వ్యక్తి గుర్తింపు మిన్నగా భావించే ధోరణి కూడా పెరిగింది. భజనపరులకు పట్టం కట్టింది.

అవినీతి పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం. సరళీకృత ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా అదొక మహమ్మారిలా విస్తరించింది. పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల అవినీతి బంధం బలపడింది. దీనికితోడు ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం వేగం పుంజుకుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమవారికి అదనంగా దోచిపెట్టే ధోరణి పెరిగింది. రాజకీయ అవినీతి అసాధారణంగా పెరిగింది. వీటన్నిటి ఫలితంగా సమాజంలో అన్ని వ్యవస్థలు అవినీతిమయమైనాయి. అన్ని వ్యవస్థలూ, రంగాలూ చెదలు పట్టి బలహీన పడుతుంటే కమ్యూనిస్టులను మాత్రం పవిత్రంగా ఉండనిస్తారా? కమ్యూనిస్టులు ఆదర్శంగా కనిపిస్తే ప్రత్యామ్నాయంగానే ప్రజలు భావిస్తారు. అది దోపిడీ వ్యవస్థకే సవాలుగా మారుతుంది కదా! తమ దోపిడీ నిరాఘాటంగా సాగాలంటే అందుకు మరో ప్రత్యామ్నాయం కనిపించకూడదు. ఇంతకన్నా దిక్కులేదనే నిరాశావాదంలోకి ప్రజలను నెట్టాలి. అది జరగాలంటే కమ్యూనిస్టులు పవిత్రంగా కనిపించకూడదు. ఇతర పార్టీలకూ, కమ్యూనిస్టులకూ మధ్య విభజన రేఖ

చెదిరిపోవాలి. అదే ఇప్పుడు జరుగుతున్నది. వనరుల కోసం ప్రజల మీద కాకుండా వ్యక్తుల మీద, సంస్థల మీద ఆధారపడే ధోరణి పెరిగింది. ప్రజల మీద ఆధారపడితే ప్రజల పట్ల బాధ్యత పెరుగుతుంది. వ్యక్తుల మీద ఆధారపడితే మొహమాటం ముందుకొస్తుంది. దర్పం ప్రదర్శించకపోతే నాయకులుగా గుర్తింపు రాదన్న భావం పెరిగింది. ఆహార్యం, అలవాట్లు, సౌకర్యాల కోసం ఆరాటం ముదిరింది. ఇది బూర్జువా పార్టీల నాయకులతో పెరిగిన సాన్నిహిత్యం ఫలితం. బూర్జువా పార్టీలకు భిన్నమైన ప్రత్యామ్నాయం చూపించలేనప్పుడు కమ్యూనిస్టు పునాది నిలబడుతుందా? అందుకేకదా ఇప్పుడు కరిగిపోతున్నది. కమ్యూనిస్టు శ్రేణుల అంకితభావానికీ, చైతన్యానికీ ఇది పరీక్ష. ఇదే కన్నూరులో జరిగిన సిపిఐ(ఎం) అఖిల భారత మహాసభ కూడా గుర్తు చేసింది. "పార్లమెంటరీ తత్వం పెరుగుదల, సైద్ధాంతిక పటుత్వం బలహీనపడటం... ఫలితంగా బూర్జువా పార్టీలకు భిన్నమైన రాజకీయ శక్తిగా కమ్యూనిస్టు పార్టీని నిలబెట్టలేకపోయాం" అని కోల్‌కతా ప్లీనమే నిర్ధారించింది. అదే విషయాన్ని ఇప్పుడు పార్టీ మహాసభ మరోసారి గుర్తుచేసింది.

కొంతమందిలో కొన్ని కొత్త మాటలు వినిపిస్తాయి. "విప్లవం ఇప్పుడు వచ్చేదా... అంత త్యాగం ఇప్పుడు అవసరమా... కుటుంబాన్ని కూడా కొంత చూసుకోవాలి కదా" ఈ మాటల వినికిడి పెరిగింది. కొందరికి ఆదర్శాలు ఛాదస్తాలుగా కనిపిస్తున్నాయి. మూఢ విశ్వాసాలనూ, తప్పుడు సాంప్రదాయాలనూ ప్రతిఘటించి వివాహం చేసుకోవడం ఒక ఆదర్శం. కమ్యూనిస్టులు భూస్వామ్య భావజాలాన్ని తిరస్కరించాలి. హంగూ, ఆర్భాటాలూ వినిమయ సంస్కృతి ప్రభావాలు. వీటికి భిన్నంగా సాదాసీదాగా ముగించడం కూడా ఒక ఆదర్శం. కమ్యూనిస్టు ఉద్యమం వీటిని బలంగా ప్రోత్సహించేది. ఆ వరవడి కొంత బలహీనపడింది. ఆదర్శాలు ఛాదస్తాలుగా కొట్టివేయడం కూడా చూస్తున్నాము. ఆదర్శాలు అనగానే తెలుగు ప్రజలకు గుర్తుకొచ్చేది పుచ్చలపల్లి సుందరయ్య. ఆ మాట వినగానే కొందరు "అబ్బో, అవన్నీ గత స్మృతులు... ఇప్పుడయ్యే పని కాదు" అనడం కూడా చూస్తున్నాము. అవి ఇప్పుడయ్యే పని కాదు అని చెప్పడం కూడా విప్లవం ఇప్పుడు వచ్చేది కాదు అని చెప్పడమే. సమీప భవిష్యత్తులో వస్తుందన్న నమ్మకం సడలిపోవడం వల్లనే ఈ భావాలు ముందుకొస్తున్నాయి. కొంతమంది మరింత చాకచక్యంగా "ఆధునిక సౌకర్యాలు కూడా వాడుకోవాలి" అంటారు. విప్లవానికి కూడా ఇవి అవసరమే అని సమర్థించుకుంటారు. మహనీయుల మాటలను

" కొందరికి ఆదర్శాలు ఛాదస్తాలుగా కనిపిస్తున్నాయి. మూఢ విశ్వాసాలనూ, తప్పుడు సాంప్రదాయాలనూ ప్రతిఘటించి వివాహం చేసుకోవడం ఒక ఆదర్శం. కమ్యూనిస్టులు భూస్వామ్య భావజాలాన్ని తిరస్కరించాలి. హంగూ, ఆర్భాటాలూ వినిమయ సంస్కృతి ప్రభావాలు. వీటికి భిన్నంగా సాదాసీదాగా ముగించడం కూడా ఒక ఆదర్శం. కమ్యూనిస్టు ఉద్యమం వీటిని బలంగా ప్రోత్సహించేది. "



వినియోగదారుల చేత అనవసర సరుకులను కూడా కొనుగోళ్లు చేయిస్తున్న కార్పొరేట్ల మాల్స్

కూడా సమయోచితంగా వాడుకుంటారు. "ఎట్లా ఉన్నామన్నది కాదు... ఏం చేస్తున్నామన్నది ముఖ్యం" అంటారు. ఇవన్నీ సాకులు వెతకడమే. ఆధునిక సౌకర్యాలు వాడుకోకూడదని మార్క్సిజం ఎక్కడా చెప్పలేదు. తోటి కార్యకర్తలకు అలవెన్సులు కూడా ఇబ్బందవుతున్న సమయంలో ఇన్ని ఆధునిక సౌకర్యాలు అవసరమా అన్నదే ప్రశ్న. ప్రజలు కమ్యూనిస్టులను కూడా బూర్జువా పార్టీలతో సమానంగా చూస్తున్నప్పుడు హంగులూ, ఆర్భాటాలూ, దర్పం ప్రదర్శించడం అవసరమా అన్నదే ఇక్కడ సమస్య. కమ్యూనిస్టులను ప్రజలు ప్రత్యామ్నాయంగా చూస్తున్నారా, లేక అనేక పార్టీలలో వీరూ ఒకరని భావిస్తున్నారా? అందుకే కన్నూరు మహాసభ గుర్తు చేసిన విషయాన్ని పరిశీలించుకోవాలి. ప్రత్యామ్నాయంగా ప్రజలకు విశ్వాసం కల్పించడం కోసం ప్రయత్నించాలి.

సరుకుల అమ్మకాన్ని ప్రోత్సహించటం, లాభాలు దండుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నది పెట్టుబడిదారీ వ్యవస్థ. ఇందు కోసం ఉద్యమ నమూనాలను నీరుగార్చడం, మార్కెట్ నమూనాలను ముందుకు తేవటం పాలకవర్గాల లక్షణం. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవుతున్న సమయంలో ఇదే విషయం మనం గమనించాము. లెనిన్, స్టాలిన్ విగ్రహాలను ధ్వంసం చేసారు. వారి విగ్రహాలు విప్లవోద్యమ స్ఫూర్తి చిహ్నాలు. అవి ప్రజల ముందు ఇంకా మిగిలి ఉండటం పెట్టుబడిదారీ శక్తులకు గిట్టదు. ఉద్యమ నమూనాలను సహించరు. త్యాగం, నిరాడంబరత, సూత్రబద్ధమైన వైఖరి ప్రదర్శించటం, మూఢ విశ్వాసాలు, తప్పుడు సాంప్రదాయాలను ప్రతిఘటించడం ఉద్యమ నమూనాలు. సరిగ్గా వీటినే చులకనగా చూడటం పెరుగుతున్నది. అంటే ఉద్యమ నమూనాలను నీరుగార్చే ధోరణి పెరిగింది. పెట్టుబడిదారీ దోపిడీకి, దిగజారుతున్న విలువలకు ప్రత్యామ్నాయం లేదనిపించటమే పాలకవర్గాల లక్ష్యం. ఇదే ఉదారవాద విధానాల పర్యవసానం. ప్రజలకు ప్రత్యామ్నాయం కనిపించకూడదు. నిరాశావాదం పెరగాలి. అందుకే కమ్యూనిస్టు శ్రేణులను కూడా ప్రభావితం చేసే ప్రయత్నం. కమ్యూనిస్టుల పవిత్రతను కూడా ప్రశ్నార్థకంగా మార్చే ప్రయత్నం. సిద్ధాంతం ప్రజలను ఆవహిస్తే అదొక భౌతికశక్తిగా మారుతుందంటాడు కార్ల్ మార్క్స్. ఈ మాటలను సానుకూల కోణంలో మాత్రమే మనం పరిశీలిస్తున్నాము. విప్లవ సిద్ధాంతం ఆవహిస్తే విప్లవోద్యమంగా మారుతుందని అన్వయిస్తున్నాము. అది నిజమే. కానీ కమ్యూనిస్టు శ్రేణులను ఉదారవాద విధానాల ప్రభావాలు ఆవహిస్తే ఏం జరుగుతుంది? ప్రజా ఉద్యమాన్ని నీరుగార్చే శక్తిగా అది మారదా? ఉన్న ప్రజా పునాదిని



epaper.prajasakti.com

> **"సిద్ధాంతం ప్రజలను ఆవహిస్తే అదొక భౌతికశక్తిగా మారుతుందంటాడు కార్ల్ మార్క్స్. ఈ మాటలను సానుకూల కోణంలో మాత్రమే మనం పరిశీలిస్తున్నాము. విప్లవ సిద్ధాంతం ఆవహిస్తే విప్లవోద్యమంగా మారుతుందని అన్వయిస్తున్నాము. అది నిజమే. కానీ కమ్యూనిస్టు శ్రేణులను ఉదారవాద విధానాల ప్రభావాలు ఆవహిస్తే ఏం జరుగుతుంది? ప్రజా ఉద్యమాన్ని నీరుగార్చే శక్తిగా అది మారదా?"**

అది కరిగించదా? అందుకే సానుకూలంగానే కాదు ప్రతికూల పరిస్థితుల ప్రభావాలను కూడా మనం అంచనా వేసుకోవాలి. **విప్లవ నమూనాలు నీరుగారితే బలపడేది మార్కెట్ నమూనాలే.** మార్కెట్ నమూనాలను ఎదుర్కోకుండా, కమ్యూనిస్టు చైతన్యం ప్రదర్శించకుండా, కార్మికవర్గ సంస్కృతిని అనుసరించకుండా వర్గ పోరాటం ముందుకు సాగదు. సాంస్కృతిక రంగంలో కర్తవ్యాల గురించి సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ తీర్మానాన్ని ఈ వెలుగులోనే అర్థం చేసుకోవాలి. పై నుంచి కిందివరకూ పార్టీ శ్రేణులంతా ప్రజలతో మమేకం కావాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది అందుకే. ఇది ప్రజల బాట. సుందరయ్య బాట. పోగొట్టుకున్న చోటనే వెతుక్కోవాలన్నది నానుడి. ఇప్పుడు వెతుక్కోవలసింది సుందరయ్య బాటలోనే. విప్లవం ఎప్పుడొస్తుందో చెప్పలేము.... చెప్పి మాత్రం రాదు. భూస్వామ్య దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఐలమ్మ తిరగబడుతుందని ఆనాటి కమ్యూనిస్టులు ముందు ఊహించింది కాదు. జూలై 4న అమరుడైన దొడ్డి కొమరయ్య ముందుగా సుందరయ్యకు చెప్పి చేయలేదు. ఆ వీర మరణమే చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆజ్యం పోస్తుందని ఎవరూ కలగనలేదు. ప్రజలు పోరాటానికి సిద్ధపడినప్పుడు ముందు పీఠిన నిలబడటమే కమ్యూనిస్టుల లక్షణం. అప్పటిదాకా ప్రజలతో మమేకం కావటం, ప్రజలకు దారి చూపటం కమ్యూనిస్టుల బాధ్యత. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో శాసనసభలో కమ్యూనిస్టులకు స్థానం లేదు. ప్రజా ప్రతినిధులే లేనప్పుడు పోరాటాలు జరిగాయి. పోరాటాలే ప్రజా పునాది నిర్మించాయి. ఇప్పుడూ అంతే.

❋

# ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాటం

**(13వ పేజీ తరువాయి)**

ప్రయోజనాలు – కాపాడడానికే ఏర్పడింది. ఇది మహమ్మారివ్యాప్తిని అవకాశంగా తీసుకుని కార్మికుల హక్కులను కాలరాసే చట్టాలను చేసింది. ఆ తర్వాత మూడు వినాశకర వ్యవసాయ బిల్లులను చట్టాలుగా చేసింది. ఈ చట్టాలు అమలైతే రాజ్యం వ్యవసాయానికి అందించే కొద్దిపాటి మద్దతు కూడా అందేది కాదు. కార్పొరేట్‌లు వ్యవసాయాన్ని పూర్తిగా ఆక్రమించుకుని ఉండేవారు. ఏడాది పొడుగునా జరిగిన ఆ పోరాటం, అందుకు కార్మికుల మద్దతు లభించడంతో ఈ దుర్మార్గ చట్టాలను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. కానీ ప్రభుత్వం తన ఎజెండా నుండి వైదొలగలేదు. బడా పెట్టుబడిదార్లతో జాతీయం చేయబడిన బ్యాంకులతో కలిపి వ్యవసాయానికి అప్పులివ్వడానికి అంగీకరించడంతో ఇది తేటతెల్లం అవుతున్నది. దీని ద్వారా ప్రజలు బ్యాంకులలో దాచుకున్న డిపాజిట్లను ఉపయోగించుకుని, కార్పొరేట్లు వ్యవసాయ రంగాన్ని హస్తగతం చేసుకునే వీలుంటుంది.

చాలా రోజుల స్తబ్దత తర్వాత జరిగిన రైతుల ప్రతిఘటన కార్మికవర్గ పోరాట వెల్లువలకు దారులు తెరిచింది. ఇది రాజ్యాంగాన్ని కూలదోసేందుకు కార్పొరేట్ హిందుత్వ కూటమి ప్రయత్నాలను ఓడించటానికి, ప్రజాతంత్ర రాజకీయాలకు అవకాశాలను కల్పించింది. కానీ ఫాసిసుశక్తులు పెరగడానికి కారణమైన మౌలిక విధానాలను ఓడించకుండా కార్మికవర్గం విజయం సాధించిందని అనుకోలేం. అంటే నయా–ఉదారవాద విధానాలను సమూలంగా ఓడించవలసిందే. రాజ్యాంగాన్ని ఓడించడానికి ఏర్పడ్డ కార్పొరేట్ హిందుత్వ కూటమిని సమూలంగా తుడిచి పెట్టడమే కాదు, రాజ్యాంగాన్ని రక్షించాలనుకున్న, కార్మికవర్గ ప్రయోజనాలు నిలవరిస్తున్న నయా–ఉదారవాద విధానాలకు స్వస్తి చెప్పి, కార్మికవర్గానికి ఊరట నిచ్చే కనీస ఆర్థిక విధానాలను అమలు చేయడానికి ముందుకు వచ్చే, రాజకీయ శక్తులన్నింటినీ కలుపుకుని పార్టీ ఇప్పుడు ముందుకెళ్లాలి. అప్పుడే నయా–ఉదారవాద విధానాల హద్దులను బద్దలుకొట్ట గలుగుతాము.

**అనువాదం : కె ఉషారాణి**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com



epaper.prajasakti.com

# అశోకుడి పాలన - ప్రత్యేకతలు

## బౌద్ధం - అశోకుడి ధర్మం

యం.వి.ఎస్.శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

**శి**లా శాసనాల ద్వారా ప్రజల మధ్య అశోకుడు విస్తృతంగా తన ధర్మాన్ని ప్రచారం చేశాడు. (ఆ సూత్రాలను గత సంచికలో తెలియజేశాం) అశోకుడి ధర్మసూత్రాలకు ప్రేరణ బౌద్ధం నుండే వచ్చిందని అంగీకరించినా ఆ బౌద్ధ ధర్మానికి, అశోకుడు ప్రచారం చేసిన ధర్మానికి తేడా ఉంది. నిర్యాణం పొందడం ఎలా? అన్నది బౌద్ధ ధర్మంలో కేంద్ర స్థానంలో ఉంటుంది. ఆ ధర్మాన్ని స్వీకరించినవారు పునర్జన్మల వలయం నుండి విముక్తి పొందడం ఎలా అన్నది ప్రధానం. బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన భిక్షువులు, సన్యాసులు అనుసరించవలసిన జీవన శైలి, పాటించవలసిన బౌద్ధ సంఘ నియమాలు వంటివి ఆ ధర్మంలో కేంద్ర స్థానంలో ఉంటాయి. అదే అశోకుడు ప్రచారం చేసిన ధర్మంలో సామాన్య ప్రజలు తమ నిత్య జీవితంలో పాటించవలసిన పద్ధతులు, అనుసరించవలసిన ఆదర్శాలు ప్రధానంగా ఉన్నాయి. బౌద్ధం నిర్యాణం గురించి బోధిస్తే, అశోకుడు దాని ప్రస్తావనను ఎక్కడా తన ధర్మంలో తీసుకురాలేదు. దానికి బదులు స్వర్గం చేరుకోడానికి పాటించాల్సిన ధర్మం గురించి చెప్పాడు. సామాన్యుడి ప్రాపంచిక జీవితం కేంద్రంగా అశోకుడి ధర్మం ఉంటుంది. వ్యక్తులుగా పాటించవలసిన దయ. జాలి, అహింస వంటి నైతిక ఆదర్శాలను బౌద్ధం నుండి స్వీకరించినా, మానవులు సాంఘీక జీవితంలో తోటి వారి యెడల అనుసరించవలసిన వైఖరుల గురించి అశోకుడు ఎక్కువగా చెప్పాడు. దానితోబాటు సమాజం, రాజ్యం ఎటువంటి దృక్పథాన్ని కలిగి వుండాలో కూడా అశోకుడు తెలియజెప్పాడు. ఆనాటి ప్రమాణాలను బట్టి చూస్తే నిస్సందేహంగా ఇది అసాధారణమైన అంశమే.

**అశోకుడి పాలన**

క్రీ.పూ. 262లో జరిగిన కళింగ యుద్ధం, అందులో జరిగిన అపార జననష్టం, ఆ యుద్ధం వలన కలిగిన కష్టాలు అశోకుడిపై బలమైన ముద్ర వేశాయి. దానితో తన రాజ్య భూభాగ విస్తరణకు ముగింపు చెప్పి, తన ధర్మ విజయానికి నాంది పలికాడు. ధర్మ విజయం అంటే అందుకు తన ప్రజల ఎడల, అనుచరుల ఎడల క్షమాగుణంతో వ్యవహరించడం అవసరం. దానితో బాటు తను రూపొందించిన ధర్మ సూత్రాలను విస్తారంగా జనం మధ్య ప్రచారం చేయడం ముఖ్యం.

సామాన్య జనానికి తన ధర్మ సూత్రాలు చేరువ కావడానికి వీలుగా ఆ సూత్రాలను రాతి స్థూపాల మీద స్థానిక భాషలలో చెక్కించి ఎక్కువమంది జనం పోగయే ప్రదేశాలలో వాటిని ప్రతిష్టించాడు. దానితోపాటు వస్త్రాల మీద, తాళ పత్రాల మీద రాయించి, ప్రచారకులతో దూర ప్రాంతాలకు పంపించాడు. పండుగ దినాలలో ప్రత్యేకంగా తన ఉద్యోగులతో ప్రజల మధ్య ప్రచారం నిర్వహించడంతోబాటు ఆ ప్రచారం తరచూ జరిగేలా ఆదేశించాడు. ప్రచార దినాలలో ఒక్క వ్యక్తి హాజరైనా సరే అతనికి ధర్మ ప్రచారాన్ని చదివి వినిపించాలని ఆదేశాలు ఇచ్చాడు.

ఈ ధర్మ ప్రచారం దక్షిణాదిన శ్రీలంక, వాయువ్యాన ఆఫ్ఘనిస్తాన్ వరకు జరిగింది. ఈ విస్తార ప్రాంతంలో పలు చోట్ల అశోకుడి ధర్మ సూత్రాలతో ఉన్న స్తూపాలు లభించాయి.

తాను ప్రతిపాదించిన ధర్మ సూత్రాలను అందరూ ఆచరించాలని అశోకుడు చెప్పాడు. తాను రాజు అయినప్పటికీ, తనకు కూడా ఆ సూత్రాలు వర్తిస్తాయని ప్రకటించాడు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు ఏ సమయంలోనైనా రావచ్చునని ప్రకటించాడు. ప్రజా సంక్షేమానికి అశోకుడు తన పాలనలో పెద్దపీట వేశాడు. ప్రజలకు, పశువులకు వైద్య సదుపాయాలను విస్తృతంగా కల్పించాడు. ఆ క్రమంలో అనేక ఔషధులు, మూలికలు దేశంలో అన్ని ప్రాంతాలలోనూ పెంచడానికి వీలు కలిగింది. దానితో బాటు ఆ మూలికల, ఓషధుల వినియోగం గురించిన పరిజ్ఞానం కూడా విస్తరించింది.

రహదారుల వెంబడి ప్రతీ 2 లేదా 3 కి.మీ. దూరానికి ఒక విశ్రాంతి గృహం ఉండేలా, అక్కడ మంచినీరు లభించేలా ఏర్పాటు చేశాడు. విశాలమైన తన రాజ్యం మొత్తం మీద ఆ విధంగా చేయడానికి చాలా ఎక్కువ ధనం అవసరం. అయినా అశోకుడు ఈ సౌకర్యాన్ని కల్పించడానికి ప్రాధాన్యతనిచ్చాడు. వేసవిలో చలివేంద్రాలను నిర్వహించమని ఆదేశించాడు. పశువులకు సైతం తాగునీరు కల్పించాలన్నది ఆ ఆదేశాలలో ఉంది. తాగునీటితో బాటు చెరువుల నుండి పంట పొలాలకు సాగునీరు అందేలా కాల్వలు తవ్వించాడు. ఈ ప్రజా సంక్షేమ చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత అని ప్రకటించాడు. ప్రాచీన భారతదేశ ఔన్నత్యం గురించి గుండెలు బాదుకునే ప్రస్తుత పాలకులు మాత్రం ప్రజా సంక్షేమ బాధ్యత నుండి తప్పుకోవడమే తమ విధానంగా, ఆ సంక్షేమం కార్పొరేట్ల దయాధర్మం మీద ఆధారపడి అమలు జరిగేదిగా ప్రకటిస్తున్నారు. మన ప్రాచీనతలోని ఉత్తమ సాంప్రదాయాల పట్ల ఏ మాత్రమూ విలువ లేని వైఖరి ఇది.



epaper.prajasakti.com

"అదే సమయంలో తక్కిన మతాల పట్ల అశోకుడు సమ గౌరవాన్ని ప్రదర్శించాడు. అన్ని మతాలనూ సమంగా గౌరవించాలని క్రీపూ.243లో తయారు చేసిన ఒక శిలా శాసనంలో ప్రకటించాడు. బుద్ధగయ పర్యటించిన వెంటనే బ్రాహ్మణులను దర్శించి, వారికి కూడా కానుకలు సమర్పించాడు. జైనులనూ ఆదరించాడు. అజీవికుల పట్ల కూడా బుద్ధుడు గౌరవాన్ని ప్రదర్శించాడు. వారికి బుద్ధ గయ సమీపంలో మూడు అద్భుతమైన గుహలను నిర్మించి ఇచ్చాడు."

న్యాయాన్ని అమలు చేసే విషయంలో కులం, మత విశ్వాసం, ఆర్థిక స్తోమత వంటి అంశాలతో నిమిత్తం లేకుండా అందరినీ సమంగా చూడాలని అశోకుడు ఆదేశించాడు. ఆనాటి సమకాలీన పాలకుల పరిపాలనతో పోల్చితే ఇది చాలా పెద్ద ముందడుగు. తప్పు చేసిన వారిని శిక్షించడం వెనుక వారిలో మార్పు తీసుకురావడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని చెప్పాడు. మరణశిక్ష విధించవలసిన సందర్భాలలో ఆ శిక్షను అమలు చేయడానికి కొంత వ్యవధి తీసుకోవాలని, ఆ తీర్పుపై పునర్విచారణకు అవకాశం ఇవ్వాలని చెప్పాడు. వృద్ధుల పట్ల, కుటుంబ బాధ్యతలు ఉన్న నేరస్తుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించమని ఆదేశించాడు.

విచక్షణా రహితంగా జంతువధ జరగకుండా చర్యలు తీసుకున్నాడు. ముందు తాను వేటను ఒక వినోదంగా పరిగణించడం మానుకున్నాడు. తన భోజనశాలలో ఆహారం నిమిత్తం పరిమితంగా మాత్రమే జంతు వధ జరపాలని నిర్దేశించాడు. జంతువుల యెడల క్రూరంగా వ్యవహరించడం తప్పు అని ప్రకటించాడు. తన రాజధాని ప్రాంతంలో జంతు బలులను నిషేధిస్తూ క్రీ.పూ.258లో ఉత్తర్వులు జారీ చేశాడు.

అంతకు ముందు నుండి ఉన్న ప్రభుత్వ పాలనా విధానాలలో అశోకుడు గణనీయంగా సంస్కరణలు ప్రవేశపెట్టాడు. ప్రజలు రాజుకు సేవకులు అన్న భావన స్థానంలో రాజుగా తానే ప్రజలకు రుణపడివున్నానని, అందుచేత ఆ ప్రజలను సుఖసంతోషాలతో ఉంచడానికి ప్రయత్నించడం ద్వారా ఆ రుణం తీర్చుకుంటానని ఒక శిలా శాసనం ద్వారా ప్రకటించాడు. తనలో వచ్చిన మార్పు అదే మోతాదులో తన దిగువ పని చేసే సామంతులలో, అధికారులలో వచ్చిందని చెప్పలేం. అయితే తన ధర్మ సూత్రాలను ప్రచారం చేయడానికి అశోకుడు ప్రత్యేకంగా ధర్మ మహామాత్రలు అనే అధికారులను నియమించాడు. వారు కేవలం ధర్మప్రచారానికే పరిమితం కాకుండా మానవతా దృక్పథంతో పేదలకు, వృద్ధులకు, రోగిష్టి వారికి సేవలు చేయాలని కూడా నిర్దేశించాడు. వారి ద్వారా దాన ధర్మాలు సైతం నిర్వహించాడు.

ధర్మ ప్రచారం మీద దృష్టి పెట్టడం వలన అశోకుడు తన సైన్యాన్ని బలోపేతం చేయడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఒక అభిప్రాయం కొందరు చరిత్రకారులలో ఉంది. అయితే సైన్యం యొక్క పాత్ర ఏమిటన్నదానిపై అశోకుడి అభిప్రాయం స్పష్టంగా ఉంది. తన ప్రజలను సైనిక బలాధిపత్యంతో గాక, ధర్మ పాలనతో పాలించాలన్నది అశోకుడి విధానం. అదే సమయంలో రాజ్య సరిహద్దులను పటిష్టంగా కాపాడడానికి తగినంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. రాజ్య విస్తరణ తన లక్ష్యం కాదు గనుక ఆ సైన్యం బాధ్యత ప్రధానంగా రాజ్య సరిహద్దులను పరిరక్షించడంగా ఉంటుంది. తిరుగుబాటుదారులను కఠినంగా శిక్షించడం, సరిహద్దుల రక్షణకు అవసరమైన దుర్గాలను, కోటలను నిర్మించడం చేశాడు. తన పాలనలో విస్తారమైన తన యావత్తు సామ్రాజ్యాన్నీ పటిష్టంగా కాపాడుకున్నాడు. అయితే అమరావతి (ఆంధ్రప్రదేశ్) లో లభించిన స్తూపం (క్రీ.పూ. 256 నాటిది) తప్ప దక్కన్ ప్రాంతంలో అశోకుడి స్థూపాలేవీ లభించకపోవడం బట్టి క్రీ.పూ.250 నాటికి అశోకుడు దక్కన్ ప్రాంతానికి దిగువ ఎక్కడా తన పాలనను చేయలేదని భావించాలి. ఆ ప్రాంతం మేరకు అశోకుడు వెనక్కి తగ్గాడని అనుకోవచ్చు.

## అశోకుడు-బౌద్ధం

అశోకుడు బౌద్ధమతాన్ని అనుసరించాడన్న అభిప్రాయం కూడా చరిత్రకారులలో ఉంది. అయితే ఇటీవల లభించిన శిలా శాసనాలను అన్నింటినీ కలిపి అధ్యయనం చేసినప్పుడే సరైన అంచనాకి రాగలుగుతాం. కళింగ యుద్ధానంతరం దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు అశోకుడు బౌద్ధ ఉపాసకుడిగా (సాధారణ అనుచరుడిగా) ఉన్నాడని, క్రీ.పూ.260 నాటికి తన ధర్మాన్ని రూపొందించి ప్రచారం చేశాడని చెప్పవచ్చు. బౌద్ధ ఉపాసకుడిగా ఉన్న కాలంలో 256 రోజులు యాత్ర చేశాడని, అందులో భాగంగానే బుద్ధగయ పర్యటించాడని ఒక శిలా శాసనం (కాందహార్‌లో లభించినది) తెలియజేస్తోంది. అయితే తన పాలనలో బౌద్ధాన్ని అశోకుడు బాగా ఆదరించాడు. కొన్ని వేల బౌద్ధ ఆరామాలను నిర్మించాడు. ఆరామాలకు ధనసహాయం కూడా విరివిగా చేశాడు. బౌద్ధంలో వచ్చిన చీలికల పట్ల అశోకుడు తీవ్ర అసంతృప్తిని ప్రకటిస్తూ క్రీ.పూ.243లో విడుదల చేసిన శిలా శాసనంలో చీలికలకు కారకులైన బౌద్ధ భిక్షువులందరినీ ఆరామాల నుండి వెళ్ళగొట్టాలని ఆదేశించాడు. అంటే బౌద్ధ మత వ్యవహారాలలో ఒక పెద్ద మనిషి పాత్రను అశోకుడు పోషించాడని భావించాలి.

అదే సమయంలో తక్కిన మతాల పట్ల అశోకుడు సమ గౌరవాన్ని ప్రదర్శించాడు. అన్ని మతాలనూ సమంగా గౌరవించాలని క్రీ.పూ.243లో తయారు చేసిన ఒక శిలా శాసనంలో ప్రకటించాడు. బుద్ధగయ పర్యటించిన వెంటనే బ్రాహ్మణులను దర్శించి, వారికి కూడా కానుకలు సమర్పించాడు. జైనులనూ ఆదరించాడు. అజీవికుల పట్ల కూడా బుద్ధుడు గౌరవాన్ని ప్రదర్శించాడు. వారికి బుద్ధ గయ సమీపంలో మూడు అద్భుతమైన గుహలను నిర్మించి ఇచ్చాడు. క్రీ.పూ. 258లో మొదటిది ఇస్తే, క్రీ.పూ.251లో మూడవది ఇచ్చాడు. అంటే బౌద్ధాన్ని స్వీకరించిన పదేళ్ళ తర్వాత కూడా అశోకుడు అన్ని మతాల పట్లా సమాదరణతో వ్యవహరించాడని స్పష్టం అవుతోంది. అశోకుడు నేటికి 2250 సంవత్సరాల క్రితం ప్రదర్శించిన ఈ సమధర్మం గురించి మాత్రం మన కాషాయ ప్రచారకులు ఎక్కడా నోరు విప్పరు. వారిలో నిజాయితీ ఎంత


epaper.prajasakti.com

లోపించిందో దీనిని బట్టి మనం తెలుసుకోవచ్చు.

అదే సమయంలో బౌద్ధం అశోకుడి నుండి ఎక్కువగా ఆదరణ పొందింది. బౌద్ధం ఇతర దేశాలకు కూడా వ్యాపించడానికి అశోకుడి ఆదరణ ప్రధాన కారణం అని శ్రీలంకలో ప్రాచీన బౌద్ధ ఆధారాలు, మహాయాన బౌద్ధ ఆధారాలు వెల్లడిస్తున్నాయి. అశోకుడి అనంతరం దాదాపు ఆరు దశాబ్దాల పాటు పాలకుల నుండి బౌద్ధం పొందిన ఆదరణ, ఆ మత విస్తరణ పరిశీలిస్తే బ్రాహ్మణ మతాన్ని వెనక్కి నెట్టి అన్ని కులాల వారినీ తనలో కలుపుకోగలిగిన ఈ మతం ఎటువంటి ఆధిపత్యాన్ని ప్రదర్శించిందో స్పష్టమౌతోంది.. పాలకుల నుండి వచ్చిన ఆదరణతో బాటు సామాన్యుల నుండి సైతం బౌద్ధ ఆరామాలకు అభించిన కానుకలు దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు.

తక్కువ కులాల ప్రజల పట్ల అశోకుడు ప్రత్యేకంగా ప్రదర్శించిన శ్రద్ధ, ప్రోత్సాహం ప్రత్యేకమైనది. కాని అదే సమయంలో అడవుల్లో జీవించే ప్రజల పట్ల అశోకుడు చాలా కఠినంగా వ్యవహరించాడు. వారి సాంప్రదాయ జీవన విధానమైన వేటను నిషేధించడం, ఒకవేళ వేటాడితే కఠిన శిక్షలకు గురి చేయడం గమనించాలి. బహుశా అహింసను ప్రోత్సహించాలన్న తన ధర్మ ప్రచారం కోసం ఈ విధంగా వ్యవహరించి వుండవచ్చు.

ఏమైనప్పటికీ, వర్ణ వ్యవస్థ మీద ఆధారపడిన సమాజంలో దానికి భిన్నమైన ధర్మాన్ని ముందుకు తెచ్చి, కుల వ్యవస్థ విస్తరణను సవాలు చేయడం, అన్ని మతాల పట్ల సమదృష్టిని, సహనాన్ని ప్రదర్శించడం చెప్పుకోదగ్గది. పొరుగు రాజ్యాలైన గ్రీసు, ఇరాన్ వంటి రాజ్యాలతో అశోకుడు స్నేహపూర్వక వైఖరి ప్రదర్శించాడు. అదే సమయంలో ఆ దేశాల ప్రభావాలు మన దేశం మీద పడకుండా చూశాడు. అయితే, అలెగ్జాండర్, అకిమినీడ్ చక్రవర్తుల కాలంలో మన దేశంలో ప్రవేశించిన గ్రీకు, ఇరానియన్ సంస్కృతుల ధోరణులను స్వీకరించి వాటిని విస్తరింపజేశాడు.

భారతదేశ చరిత్ర అని చెప్పాలంటే వాస్తవానికి అది అశోకుడి కాలం నుండే మొదలౌతుంది. అశోకుడి శిలా శాసనాల నుండి లభించే సమాచారం కన్నా అశోకుడు పోషించిన పాత్ర ఎంతో విశిష్టమైనది. అశోకుడు క్రీ.పూ.234 లో మరణించాడు.

> **"బౌద్ధం ఇతర దేశాలకు కూడా వ్యాపించడానికి అశోకుడి ఆదరణ ప్రధాన కారణం అని శ్రీలంకలో ప్రాచీన బౌద్ధ ఆధారాలు, మహాయాన బౌద్ధ ఆధారాలు వెల్లడిస్తున్నాయి. అశోకుడి అనంతరం దాదాపు ఆరు దశాబ్దాల పాటు పాలకుల నుండి బౌద్ధం పొందిన ఆదరణ, ఆ మత విస్తరణ పరిశీలిస్తే బ్రాహ్మణ మతాన్ని వెనక్కి నెట్టి అన్ని కులాల వారినీ తనలో కలుపుకోగలిగిన ఈ మతం ఎటువంటి ఆధిపత్యాన్ని ప్రదర్శించిందో స్పష్టమౌతోంది."**

### మౌర్య సామ్రాజ్య పతనం

క్రీ.పూ. 322 లో చంద్ర గుప్త మౌర్యుడితో మొదలైన మౌర్య సామ్రాజ్యం క్రీ.పూ.185లో ఆఖరి రాజు బృహద్రధుడిని ఓడించి పుష్యమిత్రుడు శుంగ వంశ పాలనను నెలకొల్పడంతో ముగిసింది.

అశోకుడు క్రీ.పూ.234లో మరణించే నాటికే ఏకీకృత మహా సామ్రాజ్యంగా కొనసాగగలిగిన స్థితి లేదు. బహు భార్యలు, వారికి పుట్టిన సంతానం అందరూ అశోకుడికి వారసులే. తన కుమారులను తక్షశిల, ఉజ్జయిని, తోశాలి (ఒరిస్సా) వంటి ప్రాంతాలకు రాజ ప్రతినిధులుగా అశోకుడు నియమించాడు. వాయవ్య ప్రాంతంలో సెల్యూకస్ కాలం నుండీ కొనసాగిన గ్రీకు అధికారులు చాలా మంది ఉన్నారు. వీరంతా తమ తమ సరిహద్దుల మేరకు ఉన్న సైన్యాలను అజమాయిషీ చేసేవారు. క్రమంగా తమ తమ ప్రాంతాల్లో స్వంతంగా పన్నులు వసూలు చేయడం ప్రారంభించారు. స్వంతంగా సంపదలను సమకూర్చుకున్నారు. అశోకుడు వృద్ధాప్యంలో పడి, అతని కుమారుడు కునాలుడు రాజుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండీ క్రమంగా తిరుగుబాట్లు మొదలయ్యాయి. ఎక్కడికక్కడ స్వతంత్రాన్ని ప్రకటించుకోవడం, కుట్రల ద్వారా కూలదోయడం వంటివి జరిగాయి. ఈ వివరాలను సాధికారికంగా తెలియజేయగలిగే ఆధారాలు లేవు. కాని శ్రీలంక పురాణాలను, వాయవ్య ప్రాంత పురాణాలను, బౌద్ధ గ్రంధాలలో పేర్కొన్న వివరాలను బట్టి కొన్ని విషయాలను రేఖామాత్రంగా చెప్పవచ్చు.

అశోకుడి కాలంలో తక్షశిలలో రాజప్రతినిధిగా ఉన్న కునాలుడు అశోకుడి తర్వాత రాజు అయ్యాడు. ఆ తర్వాత అతని కుమారుడు సంపతి రాజు అయ్యాడు. అప్పటికి దానధర్మాలకు, బౌద్ధ మత ఆదరణకు ఖజానా దాదాపు ఖాళీ అయింది. ఉజ్జయినికి రాజ ప్రతినిధిగా ఉండిన సంపతి తన హయాంలో జైనమతాన్ని విశేషంగా ఆదరించాడు. మరికొన్ని పురాణాల ప్రకారం ఈ సంపతి కునాలుడి కొడుకు కాదు. అశోకుడి మనవడైన దశరధుడి కొడుకు. ఈ దశరధుడు తన హయాంలో అజీవికులను బాగా ఆదరించాడు.

రెండు రకాల పురాణ గాధలను బట్టి అశోకుడి వారసత్వం కోసం రెండు భాగాలుగా అతని వారసులు చీలిపోయారని భావించవచ్చు. ఇదే సమయంలో వాయవ్య ప్రాంతం మొత్తం మౌర్య సామ్రాజ్యం నుండి విడిపోయింది ఎక్కడికక్కడ స్వతంత్ర రాజ్యాలు పుట్టుకొచ్చాయి.

మౌర్య వంశ రాజులలో ఆఖరివాడు బృహద్రధుడు. అతను ఏడేళ్ళపాటు పాలించగలిగాడు. అతని వద్ద సేనానిగా ఉన్న పుష్యమిత్రుడు తిరుగుబాటు చేసి స్వంతంగా శుంగ రాజ్యాన్ని స్థాపించాడు. ఇది క్రీ.పూ.185 లో జరిగింది. దానితో మౌర్య సామ్రాజ్యం అంతం అయింది.

ఒక సువిశాల సామ్రాజ్యాన్ని ఏకీకృతంగా ఎక్కువకాలం పాటు ఒక కేంద్రం నుండి పాలించడం చాలా కష్టం. అంత పెద్ద రాజ్యాన్ని. పాలనను నిర్వహించడానికి అయే ఖర్చు, అవసరమైన పాలనా యంత్రాంగం కూడా పెద్ద సమస్యలుగా పరిణమించాయి. దానికి తోడు ఆయా ప్రాంతాల వైవిధ్యాలు కూడా సమస్యలను తెస్తాయి. ఐతే అశోకుడి వారసులకు సంబంధించిన సాధికార వివరాలు పెద్దగా లభ్యం కానందువలన వారి గురించి చారిత్రికంగా నిర్ధారణలకు రావడం, ఊహాగానాలనే చరిత్రగా ప్రచారం చేయడం ఉచితం అనిపించుకోదు. ❃



epaper.prajasakti.com

# కాశి, మధుర - ఉద్రిక్తతలు పెంచుతున్న సంఘ్ పరివార్

ఎ.కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

దేశంలోని సమస్యలను పరిష్కరించటం, అభివృద్ధిని సాధించటంలో విఫలమైన బిజెపి ప్రభుత్వం ప్రజల అసంతృప్తిని దారి తప్పించటం కోసం ప్రజలను మతాల వారీగా విభజించటం, మత విద్వేషాలను పెంచటం చేస్తున్నది. తాజాగా కాశీలోని గ్యాన్‌వాపి మసీదు, మధురలోని షాహి ఈద్గా మసీదులను వివాదాస్పదం చేయటానికి పూనుకున్నాయి. ఈ అంశాలపై కోర్టులు వ్యవహరిస్తున్న తీరు దీనికి మరింత ఆజ్యం పోసేదిగా ఉన్నది. అయోధ్యలోని బాబ్రీమసీదును వివాదాస్పదం చేసి కూల్చేసిన తర్వాత సంఘ్ పరివార్ కాశి, మధురలలోని విశ్వేశ్వరాలయం, కృష్ణాలయం పక్కన ఉన్న మసీదులను లక్ష్యంగా చేసుకున్నాయి. అయోధ్యలోని మసీదు వివాదంలో సుప్రీంకోర్టు న్యాయ, చారిత్రకమైన అంశాలను పక్కన పెట్టి, అక్కడ రామాలయం ఉండేదని వాదిస్తున్న వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దానితో ఆ సమస్యకు ఒక ముగింపు వచ్చింది. కాని సంఘ్ పరివార్‌కు కావలసినది బాబ్రిమసీదు వివాదానికి పరిష్కారం కాదు. ప్రజలలో మత విద్వేషాలను తీవ్రం చేయటం, వాటిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవటం వారి వ్యూహంలో భాగం. అందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాలలో మత విద్వేషాలను పెంచుతూనే ఉన్నారు. ఈ సంవత్సరం శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా దేశవ్యాపితంగా పథకం ప్రకారం మత ఘర్షణలు రెచ్చగొట్టారు. వాటిలో పాల్గొన్నారనే పేరుతో మైనారిటీలపై కేసులు పెట్టి, వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. అస్సాంలో ఒక యువకుడిని పోలీసులు కొట్టి చంపారనే ఆగ్రహంతో ప్రజలు పోలీసు స్టేషన్‌పై దాడి చేశారు. దానిని ఆసరాగా చేసుకుని అక్కడి బిజెపి ప్రభుత్వం ఆక్రమణల పేరుతో ముస్లింల నివాసాలను కూలగొట్టింది. ఈ విధంగా మత విద్వేషాలను పెంచటం ద్వారా వివిధ ప్రాంతాలలో ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నది.

సంఘ్ పరివార్ మతోన్మాద చర్యలపై చట్టాలతో నిమిత్తం లేకుండా కోర్టులు చేస్తున్న వ్యాఖ్యలు, ఇస్తున్న తీర్పులు వివాదాలను మరింతగా పెంచటానికి దోహదం చేస్తున్నాయి. వారణాసిలోని గ్యాన్‌వ్యాపి మసీదును వివాదాస్పదం చేయటానికి, దానిని తన రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవటానికి సంఘ్ పరివార్ చాలాకాలం నుండి ప్రయత్నం చేస్తున్నది. మొఘల్ పాలకుడు ఔరంగజేబ్ విశ్వనాథ ఆలయంలోని కొంతభాగాన్ని కూల్చివేసి, గ్యాన్‌వ్యాపి మసీదును నిర్మించారని వారణాసిలోని ఒక న్యాయవాది 2019లో దిగువ కోర్టులో పిటీషన్ దాఖలు చేశాడు. మసీదు ప్రాంగణంలో సర్వేచేసి, నివేదికను అందజేయాలని 2021 ఏప్రిల్‌లో కోర్టు పురాతత్వ శాఖ(ఎఎస్‌ఐ)ని ఆదేశించింది. మసీదు ప్రాంగణంలో శృంగారగౌరి, మరి కొందరు హిందు దేవతల విగ్రహాలు ఉన్నాయని, ఆ విగ్రహాలకు రోజువారీ పూజలు చేసుకోవటానికి తమను అనుమతించాలని ఐదుగురు మహిళల చేత వారణాసి కోర్టులో దావా వేయించారు. ఈ సంవత్సరం మే నెలలో మసీదు ప్రాంగణంలో వీడియోగ్రఫి సర్వే చేసి, రిపోర్టును అందించాలని కోర్టు ఆదేశించింది. వీడియోగ్రఫిని ఆపాలని కోర్టును కోరుతూ ఉత్తరప్రదేశ్ సున్ని వక్ఫ్‌బోర్డు, మసీదును నిర్వహిస్తున్న అంజుమన్ ఇంతెజామియా కమిటీలు పిటీషన్ దాఖలు చేశాయి. కోర్టు వీడియోగ్రఫిని పూర్తి చేయమని చెప్పటంతో ఆ కార్యక్రమం కొనసాగింది. వీడియోగ్రఫి పూర్తిచేసి, కోర్టుకు నివేదిక సమర్పించకముందే మసీదులో శివలిగం బయటపడిందని లీకులు వదిలారు. అది శివలింగం కాదని, మసీదులోని నీటి కొలనులో ఫౌంటెయిన్‌లో ఉపయోగించే స్థంభం అని చెప్పినప్పటికీ, ఈ ప్రచారం పెద్ద ఎత్తున కొనసాగింది. ఆ విధంగా మతోన్మాదాన్ని పెంచటం కోసం దీనిని ఉపయోగించుకుంటున్నారు.

మే 13వ తేదీన వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు సమస్య కొనసాగటానికి తోడ్పడ్డాయి. 1991లో పార్లమెంటు ఆమోదించిన ప్రార్ధనా స్థలాల పరిరక్షణ చట్టం 1947, ఆగస్టు 15వ తేదీనాటికి ఉన్న ప్రార్ధనా స్థలాల మత స్వభావాన్ని మార్చరాదని, వాటిని యధాతథంగా కొనసాగించాలని చెప్పింది. అప్పటికే వివాదం కొనసాగుతున్న అయోధ్యలోని బాబ్రిమసీదు వివాదానికి మాత్రం చట్టం నుండి మినహాయింపు నిచ్చింది. ఈ చట్టం ప్రకారం గ్యాన్‌వ్యాపి మసీదుపై వచ్చిన పిటీషన్లపై కోర్టులు విచారణ జరపరాదు. కాని చట్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా స్థానిక కోర్టులు, అలహాబాద్ హైకోర్టు వ్యవహరించటం వివాదం తీవ్రం కావటానికి కారణమైంది. చివరికి వివాదం తన ముందుకు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టు కూడా ఆ చట్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించింది. చట్ట ప్రకారం కేసును రద్దుచేయకుండా, తాను పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా, పరిష్కరించే బాధ్యతను వారణాసి జిల్లాకోర్టుకు అప్పగించింది. జిల్లాకోర్టు మే నెల 26వ తేది నుండి వాదనలు వింటానని ప్రకటించింది. ఈ విధంగా చట్టాలను పట్టించుకోకుండా కోర్టులు వ్యవహరించటం మత



epaper.prajasakti.com

సామరస్యం దెబ్బతినటానికి, మతోన్మాదం పెరగటానికి దోహదం చేస్తున్నది. ఇది దేశ సమైక్యతకు, బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక-కర్షక వర్గాలు, సామాన్య ప్రజానీకం చేస్తున్న పోరాటానికి తీవ్రమైన హాని చేస్తుంది.

" సబ్సిడీ పొందేవారు సబ్సిడీ పోనూ సిలెండర్‌కు 441 రూపాయలు అదనంగా చెల్లించాలి. సాధారణ వినియోగదారులు 641 రూపాయలు అదనంగా చెల్లించాలి. 2018 డిసెంబరు నాటికి దేశంలో 24 కోట్లమందికి పైగా వంటగ్యాస్ వినియోగదారులుండగా, 22.9 కోట్లమంది గ్యాస్ సబ్సిడి పొందుతున్నారు. కాని ఇపుడు ప్రభుత్వం తొమ్మిది కోట్లమందికి మాత్రమే 200 రూపాయల చొప్పున సబ్సిడీ ఇస్తామని ప్రకటించింది. "

### పెట్రో ధరల తగ్గింపు గారడి

పెట్రోలియం ఉత్పత్తులపై ఎడాపెడా ఎక్సైజ్ సుంకం, సర్‌ఛార్జిలను పెంచిన కేంద్ర ప్రభుత్వం మే నెల 21వ తేదీన కంటితుడుపు చర్యగా పెట్రోలుపై లీటరుకు ఎనిమిది రూపాయలు, డీజిల్‌పై ఆరు రూపాయలు, ఉజ్వల యోజన పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్‌లు పొంది, సంవత్సరానికి 12 సిలెండర్లలోపు వినియోగించే వారికి సిలిండర్‌కు 200 రూపాయల చొప్పున తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తీసుకునేటపుడు తాటికాయ, ఇచ్చేటపుడు ఈతకాయ అన్న చందంగా కేంద్రం పన్నులు పెంచటం ద్వారా ప్రజలపై విపరీతమైన భారాలు మోపి, ఇపుడు పెంచినదానిలో కొద్ది శాతమే తగ్గించినా, ప్రచారం మాత్రం పెద్దగా చేస్తున్నారు. మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కేంద్ర ప్రభుత్వం లీటరు పెట్రోలుపై 9.20 రూపాయలు, డీజిల్‌పై 3.46 రూపాయలు ఎక్సైజ్ పన్ను వసూలు చేసేది. 2014లో మోడి ప్రధాని అయిన తర్వాత దానిని 32.90, 31.80 రూపాయలకు పెంచింది. అంటే లీటరు పెట్రోలుపై 357 శాతం, డీజిల్‌పై 990 శాతం పెంచింది. దానిలో ఇపుడు తగ్గించినది ఎంత తక్కువో అంకెలే స్పష్టం చేస్తున్నాయి. ఇక మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత వంటగ్యాస్ సిలిండర్ ధర 414 రూపాయలుండగా, ఇపుడు 1055 రూపాయలు ఉన్నది. సబ్సిడీ పొందేవారు సబ్సిడీ పోనూ సిలెండర్‌కు 441 రూపాయలు అదనంగా చెల్లించాలి. సాధారణ వినియోగదారులు 641 రూపాయలు అదనంగా చెల్లించాలి. 2018 డిసెంబరు నాటికి దేశంలో 24 కోట్లమందికి పైగా వంటగ్యాస్ వినియోగదారులుండగా, 22.9 కోట్లమంది గ్యాస్ సబ్సిడి పొందుతున్నారు. కాని ఇపుడు ప్రభుత్వం తొమ్మిది కోట్లమందికి మాత్రమే 200 రూపాయల చొప్పున సబ్సిడీ ఇస్తామని ప్రకటించింది. అంటే సబ్సిడి పొందుతున్న వారిలో 12 కోట్లమందికి పైగా ఎటువంటి ఉపశమనం లభించదు. వారు పూర్తిధర చెల్లించాలి. ప్రభుత్వం పెట్టిన పరిమితిని మించి ఎవరైన అదనంగా ఒక్క సిలెండరును వినియోగించినా వారు సబ్సిడీని కోల్పోతారు. కాని 12 సిలెండర్లకు మించి వినియోగించే వారు వినియోగాన్ని తగ్గించినప్పటికీ సబ్సిడీని పొందలేరు. అంటే ప్రభుత్వం ప్రకటించిన దానికన్నా తక్కువ మంది మాత్రమే సబ్సిడీ పొందుతారని స్పష్టమౌతున్నది. మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'ప్రత్యక్ష నగదు బదిలీ' పేరుతో సిలెండర్ల ధరను పెంచి, పెంచిన మొత్తాన్ని వినియోగదారుల బ్యాంకు ఎకౌంట్లలో జమ చేస్తామని ప్రకటించింది. ప్రారంభం నుండి కొందరికి సబ్సిడి జమ కాలేదు. కొంతమంది ఎకౌంట్లలో కొంతకాలం పాటు పెంచిన మొత్తం జమయింది. ఆ తర్వాత క్రమంగా డబ్బు జమచేసేవారి సంఖ్యను తగ్గించారు. కోవిడ్‌కు ముందుగానే 2019 వచ్చేసరికి సబ్సిడీని తగ్గించి, సిలెండరుకు 40 రూపాయల చొప్పున మాత్రమే జమ చేయటం ప్రారంభించారు. 2020లో కోవిడ్ మహమ్మారిని ఉపయోగించుకొని మొత్తం సబ్సిడీని రద్దుచేశారు. తర్వాత ఆర్థికవ్యవస్థ కోవిడ్ దెబ్బ నుండి క్రమంగా బయటపడుతున్నప్పటికీ తిరిగి సబ్సిడీని పునరుద్ధరించలేదు. ఇపుడు ఉజ్వల యోజన ద్వారా గ్యాస్ కనెక్షన్‌లు పొందినవారికి సిలెండర్‌కు 200 రూపాయలు మాత్రమే సబ్సిడీ ఇవ్వటం అంటే సబ్సిడీ ఇస్తున్నట్లుగానే నటిస్తూ వారిపై ఏ విధంగా ధరల భారాన్ని మోపారో స్పష్టమౌతున్నది.

దేశ ప్రజలలో 80 శాతంకు పైగా నెలకు 10,000 రూపాయలకు లోపు ఆదాయం మాత్రమే పొందుతున్నారని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి. కోవిడ్ ప్రభావం, ప్రభుత్వం అనుసరిస్తున్న అపసవ్య ఆర్థిక విధానాల వలన నెలకొన్న మాంద్యం, విపరీతంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, పెరుగుతున్న నిరుద్యోగం తదితరాలు ప్రజల జీవితాలను కల్లోలపరుస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో పెట్రోలు, డీజిలు, వంటగ్యాస్ ధరల పెరుగుదల ప్రజలకు భారంగా పరిణమిస్తున్నాయి. ఈ భారాలను పూర్తిగా ఉపసంహరించుకొని ప్రజలకు అదనంగా రాయితీలు ఇవ్వవలసిన ప్రభుత్వం నామమాత్రంగా ధరలు తగ్గించి, అదే గొప్ప అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నది. ఇటువంటి విధానాల వలన ధరల భారం నుండి ప్రజలకు ఉపశమనం లభించదు. అందువలన ధరల పెరుగుదలతో పాటు, ఇతర సమస్యలను కూడా పరిష్కరించుకోవటం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించటంపైన ఆధారపడి ఉంటుంది.

### పెట్టుబడులు తెస్తున్నట్లు దావోస్ నుండి ప్రచారం

ప్రజల సమస్యలను పట్టించుకోని బిజెపి ప్రభుత్వం విదేశీ పెట్టుబడులు తీసుకొస్తున్నట్లు దావోస్ నుండి ప్రచారం చేసుకున్నది. ప్రపంచ ఆర్థికవేదిక(వరల్డ్ ఎకనామిక్ ఫోరం) సమావేశం మేనెల 22 నుండి 26వ తేది వరకు దావోస్‌లో జరిగింది. ప్రధాని నరేంద్రమోడితో పాటు పలువురు కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులు, దేశంలోని అనేకమంది బడా పెట్టుబడిదారులు ఈ సమావేశాలలో పాల్గొన్నారు. దేశంలోకి పెట్టుబడులను రాబట్టటమే లక్ష్యంగా తమ కార్యక్రమాలు ఉన్నట్లు వీరందరూ ప్రచారం చేసుకొంటున్నారు. మనదేశంలో పెట్టుబడులకు ఏ విధంగా అవకాశాలు ఉన్నాయో, ఇక్కడ పెట్టుబడులు పెడితే ఎంతగా లాభాలు



epaper.prajasakti.com

" ఈ విధంగా నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుని, నేరాలను అరికట్టటానికి అవసరమైన చర్యలు తీసుకోని ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై తీవ్రమైన నిర్బంధం ప్రయోగిస్తున్నది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు, కార్మికులు తదితరుల పోరాటాలను నిర్బంధంగా అణచివేస్తున్నది. కనీసంగా ప్రదర్శనలు, ధర్నాలకు కూడా అనుమతివ్వటం లేదు. ఉద్యమాల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. "

వస్తాయో చెప్పి, వారిని ప్రభావితం చేయటం కోసమే తామంతా కృషి చేసినట్లుగా చెప్పుకొంటున్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో మనదేశంలో 3.2 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టనున్నట్లు జపాన్ ప్రధాని ప్రకటించాడు. ఇతరంగా కొన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టటానికి అంగీకరించాయని ప్రచారం చేస్తున్నారు.

ఈ తరహా సమావేశాలు, వాటి ఫలితాలను గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు నాటి రాష్ట్ర ప్రభుత్వం, విడివడిన తర్వాత ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడులను ఆకర్షించటం కోసమంటూ ఇటువంటి వార్షిక సమావేశాలు అనేకం నిర్వహించాయి. ప్రతి సమావేశంలోనూ లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్లు ప్రచారం చేశారు. కాని జరిగిందేమిటనేది ప్రజలందరికీ తెలిసిందే. అదే తతంగాన్ని ఇపుడు దావోస్ నుండి కేంద్ర ప్రభుత్వం నడిపింది. ఈ సందర్భంలో ఒక విషయాన్ని పరిశీలించాల్సివుంది. విదేశీ పెట్టుబడిదారులు వచ్చి మనదేశంలో పెట్టుబడులు పెట్టాలని అడుగుతున్న ప్రభుత్వం దేశంలోని పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టాలని ఎందుకు అడగదు? విదేశీ పెట్టుబడిదారులు పెట్టుబడులు పెడితేనే పరిశ్రమలు వస్తాయా? దేశంలోని పెట్టుబడిదారులు పెట్టుబడులు పెడితే పరిశ్రమలు రావా? ప్రపంచంలోని డాలరు శతకోటీశ్వరులలో 166 మంది భారతదేశంలోనే ఉన్నారు. ఏ దేశంలో కన్నా ఎక్కువ వేగంతో మనదేశంలోని శతకోటీశ్వరులు, వారి సంపదలు పెరుగుతున్నాయి. ఈ విధంగా పెంచుకుంటున్న సంపదలో ఎంతశాతం తిరిగి మనదేశంలో పెట్టుబడులుగా పెడుతున్నారు? మనదేశంలోని పెట్టుబడిదారులు విదేశాలలో పెట్టుబడులు పెడుతుంటే వారిని గురించి ప్రస్తావించకుండా విదేశీ పెట్టుబడులు రావటం గురించి ప్రచారం చేయటంలో అర్థమేముంది? ప్రభుత్వరంగంలోని పరిశ్రమలను దేశ, విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెడుతూ కొత్త పెట్టుబడులు వచ్చాయని ప్రచారం చేసుకోవటం వలన ఉపయోగం ఏముంది? అందువలన కొత్తగా పరిశ్రమలు వస్తాయా లేక ఉద్యోగాలు వస్తాయా? ప్రతిపక్షాలు, తమ విధానాలను వ్యతిరేకిస్తూ రాజకీయంగా విమర్శలు చేస్తున్న వారిని, మైనారిటీలు, దళితులు తదితరులపై 'దేశద్రోహం' ముద్రవేసి వేధిస్తున్న ప్రభుత్వం మనదేశంలో పెట్టుబడులు పెట్టకుండా విదేశాలలో పెట్టుబడులు పెడుతున్నవారిని గురించి పల్లెత్తు మాటకూడా అనటం లేదు. మనదేశాభివృద్ధికి సహకరించని వీరిని సమర్థిస్తూ, అన్ని విధాలైన రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వానికి దేశాభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధి ఎంత? ప్రైవేటీకరణ విధానాలతో సాధించిన అభివృద్ధిని ధ్వంసం చేస్తున్న ప్రభుత్వం ప్రజలను మోసం చేయటం కోసం పెట్టుబడుల గురించి ప్రచారం చేస్తున్నది. ధరల పెరుగుదలతో దిగజారుతున్న ప్రజల జీవితాలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పోషకాహారలోపం తదితరాలు ప్రజల మూలుగలను పీల్చివేస్తుండగా వాటిని గురించి పట్టించుకోకుండా పెట్టుబడుల రాక గురించి డబ్బా కొట్టుకోవటం ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని తెలియజేస్తున్నది.

**రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు-నిర్బంధం.**

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, దళితులపై అత్యాచారాలు, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలు తీవ్రమౌతున్నాయి. అత్యాచారాల పట్ల మంత్రులు, ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరు నేరాలను అరికట్టటానికి దోహదం చేయటం లేదు. రేపల్లె రైల్వేస్టేషన్‌లోనూ, విజయవాడ ప్రభుత్వాసుపత్రిలోనూ మహిళలపై జరిగిన అత్యాచారాలను గురించిన వ్యాఖ్యలు, ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రజలు ఆమోదించలేదు. మహిళలపై వరుసగా అత్యాచారాలు జరుగుతున్నా నేరస్తులపై కఠినచర్యలు తీసుకోవటంలో ప్రభుత్వం విఫలమైంది. వైసిపి ఎంఎల్‌సి అనంతబాబు గతంలో తన వద్ద డ్రైవర్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యాన్ని హత్యచేసి, శవాన్ని తనకారులోనే తీసుకెళ్ళి ఇంటి వద్ద పడవేసినా, ఆయనను అరెస్ట్ చేయటానికి పోలీసులకు నాలుగురోజులు పట్టింది. అప్పటికీ కూడా రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమాలు జరిగిన తర్వాత మాత్రమే పోలీసులు స్పందించారు. ఈ విధంగా నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుని, నేరాలను అరికట్టటానికి అవసరమైన చర్యలు తీసుకోని ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై తీవ్రమైన నిర్బంధం ప్రయోగిస్తున్నది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు, కార్మికులు తదితరుల పోరాటాలను నిర్బంధంగా అణచివేస్తున్నది. కనీసంగా ప్రదర్శనలు, ధర్నాలకు కూడా అనుమతివ్వటం లేదు. ఉద్యమాల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. సమాజంలో అశాంతిని రేకెత్తించే అరాచక శక్తులపై చర్యలు తీసుకోవటానికి పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కోనసీమ జిల్లా పేరును డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మార్చటాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు విధ్వంసం సృష్టిస్తుంటే పోలీసులు సకాలంలో చర్యలు తీసుకోలేదు. కులాలు, మతాల పేరుతో చిచ్చు పెట్టటానికి పూనుకుంటున్న శక్తులను అణచివేయటం పట్ల శ్రద్ధ చూపటం లేదు. దీనిని ఉపయోగించుకొని బలపడటానికి మతోన్మాదశక్తులు ప్రయత్నం చేస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం నేరస్తులపై చర్యలు తీసుకోకుండా ప్రజా ఉద్యమాలను అణచివేయటం మతోన్మాదశక్తులకు మాత్రమే ఉపయోగపడుతుంది.


❋



epaper.prajasakti.com

# “గోద్రా మారణకాండ ప్రజాస్వామ్య పతనం

**ప్రేమ్ శంకర్ ఝా**



రచయిత సీనియర్ పాత్రికేయులు

ఫిబ్రవరి 27, 2002న మంటల్లో మండుతున్న ట్రైన్ - దాని చుట్టూ అల్లిన అబద్ధాలు, తప్పుడు కథనాలు - నరేంద్ర మోడీని గుజరాత్‌లో అధికారంలో ఉంచాయి, అలానే భారత దేశ ప్రధాన మంత్రి అయ్యేందుకు దారి సిద్ధం చేశాయి.

స్వతంత్ర భారత దేశ చరిత్రలో జరిగిన ఏకైక అత్యంత దురదృష్టకర సంఘటనకి ఈ వారం 20వ వారికోత్సవం. ఫిబ్రవరి 27, 2002 తెల్లవారుఝామున గోద్రా స్టేషన్ బయట సబర్మతి ఎక్స్‌ప్రెస్ లోని ఎస్-6 బోగీ మంటల్లో కాలిపోకపోతే, 59 మంది చనిపోకపోతే, గుజరాత్ అల్లర్లు జరిగి ఉండేవి కావు, ఈ రోజున నరేంద్ర మోడీ ప్రధానిగా ఉండేవాడు కాదు.

ఈ విషాద సంఘటన జరిగి ఉండకపోతే ముందుగా ప్రకటించిన విధంగా ఏప్రిల్ 2003లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చాల సులువుగా ఓడిపోయి ఉండేది.

కానీ, మతపర వైరుధ్యాల వల్ల జరిగిన అల్లర్లు మోడీ వాడుకుంటూ ఎన్నికలను 2002 డిసెంబర్‌కి ముందుకు జరిపారు. బిజెపి 2001లో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికలలో, అదే సంవత్సరంలో జరిగిన మూడు ఉపఎన్నికలలో ఓడిపోయి, తత్తరపాటుకు గురైంది. ఇదే కారణం గుజరాత్ ముఖ్యమంత్రి కేశూభాయ్ పటేల్‌ని అనారోగ్యం పాలవుతున్నారంటూ తొలగించటం, ఆయనకి ప్రత్యామ్నాయంగా అక్టోబర్ 2001లో మోడీ రావటానికి దారి తీసింది. గుజరాత్‌లో బిజెపిని ఒడ్డెక్కించి బలమైన మద్దతుదారులని కూడగట్టుకోటం అనే కష్టమైన పని మోడీ చేయవలసి వచ్చింది. సబర్మతి ఎక్స్ ప్రెస్ లోని మంటలు ఆ పార్టీ ప్రార్థనలకు రాజకీయ సమాధానంగా దొరికింది.

చాలా పెద్ద సంఖ్యలో కరసేవకులు ఉన్న ఆ రైలులోకి వారంతా అయోధ్యలో దౌర్జన్యంగా ఎక్కారు. అందువల్ల 1,100 మంది సామర్థ్యం కలిగిన ఈ బండి గోద్రా చేరేటప్పటికి 2000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్నారు. ఎస్-6 బోగీకి నిప్పు అంటుకునేటప్పటికి ఈ బండి కరసేవకులతో కిక్కిరిసి ఉంది.

ఒక నిజం ఏమిటంటే కొంత మంది కరసేవకులు అయోధ్యకు వెళుతున్నప్పుడు, తిరిగివస్తున్నప్పుడు కూడా గోద్రా ప్లాటుఫారం మీద ఉన్న చిన్న ముస్లింవ్యాపారులతో అనుచితంగా ప్రవర్తించారు. సరిగ్గా బండి కదలబోయే సమయానికి అది చిన్న గొడవగా మారింది. కరసేవకులు అక్కడ ఉండటం, ఆ దురదృష్టకర ఉదయం జరిగిన చిన్న గొడవకి కోపంగా ఉన్న ముస్లింలే ప్రతీకార చర్యగా రైలుని వెంబడించి బోగీకి నిప్పు పెట్టారని గుజరాత్ లోని అందరూ అభిప్రాయపడ్డారు.

ఫిబ్రవరి 27 మధ్యాహ్నానికల్లా గుజరాత్ ప్రాంతీయ వార్తాపత్రికలు అన్నీ దగ్గరలో ఉన్న గుడిసెల కాలనీలో ఉన్న ఘాంచి ముస్లింలు ప్రతీకారం తీర్చుకునేందుకు రాళ్ళ తోనూ, కిరోసిన్‌లో ముంచిన గుడ్డల తోనూ ఎదురు చూశారని ఆరోపించాయి. రైలు అలా ఆగిందో లేదో వీళ్ళు కిరోసిన్‌తో తడిసిన మండుతున్న గుడ్డలు కిటికీల మీదకి విసిరారు, బోగీ మంట అందుకుంది అని ఆ వార్తా పత్రికల కథనం.

సృష్టించబడిన ప్రత్యక్ష సాక్షులతో, ఈ నివేదికల ఆధారంగానే ఈ కేసుపై మొదటి పోలీసు ఛార్జ్ షీట్ తయారైంది. వీరందరూ విశ్వ హిందూ పరిషద్‌కి చెందిన వారు. వారందరూ బోగీ బయట నుండి కిరోసిన్ గుడ్డలు విసిరారు అని ఒకే విధమైన సాక్ష్యాలు ఇచ్చారు.

ఆ తర్వాత జరిగిన హత్యాకాండ ఇప్పుడు చరిత్ర. కానీ, చరిత్ర గతిని ఇలా మార్చిన తారుమారు అంశాలలో మరొకటి ఏమిటంటే రైలు మంటల గురించిన ఈ మొట్ట మొదటి పోలీసు వివరణ పూర్తిగా నిరాధారమైనది, చివరికి మరింత ఆమోదయోగ్యమైన దాని కోసం దానిని కూడా వదిలి పెట్ట వలసి వచ్చింది, కానీ అది కూడా అంతే నమ్మలేనటువంటి వాదన. మొట్టమొదటి రోజు నుండి ఈ అగ్ని ప్రమాదం బాగా లోతుగా ఆలోచించి చేసిన (ముస్లిం) కుట్ర అని ప్రకటించిన తర్వాత అన్ని సంఘటనలూ ఆ కథనానికి కొనసాగించటానికే తయారు చేయబడ్డాయి.

వివరించలేని వ్యత్యాసాలు స్పష్టంగా కనబడిపోతున్న ఒక అసత్యానికి బలం కల్పించి నిలబెట్టడానికి మోడీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎంత దూరమైనా పోవడం యాదృచ్ఛికం కాదు. మోడీయే దీనిని సమర్థించి, పోషించారు. గుజరాత్‌లో బిజెపిని మళ్ళీ అధికారంలోకి తీసుకురావటానికి ముస్లిం భయాన్ని సృష్టించారు.

2005లో యూపీఏ ప్రభుత్వంలోని రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ విశ్రాంత కలకత్తా హై కోర్ట్ జడ్జి యూ. సి. బెనర్జీని ఈ కేసు విచారణ కు నాయకత్వం వహించమని నియమించారు. బెనర్జీ కమీషన్ ఐదుగురు నిపుణుల బృందం నియమించి సాక్ష్యాలను మరల పరీక్షించమంది. మూడు సంవత్సరాల కాలం గడిచిపోయిన తర్వాత ఈ నిపుణుల బృందానికి పరీక్షించటానికి ఒకే ఒక్క దారి మిగిలింది. అది నిప్పు అంటుకున్న ఇతర బోగీలలో మంట, పొగ గుర్తులు, ఎస్-6 పొగ గుర్తులతో పోల్చటం.

కాలిపోయిన 5 బోగీలను మొదటి ఫోరెన్సిక్ పరీక్షల తర్వాత రైల్వే యార్డులో భద్రపరిచారు. ఈ ఐదింటిలో ఒకబోగీలో కాలిన గుర్తులు, ఎస్-6 బోగీ లోని కాలిన, పొగ గుర్తులు ఒకేలా ఉన్నాయి. ఆ బోగీ



epaper.prajasakti.com

**“ అహ్మదాబాద్‌లోని గుజరాత్ ప్రభుత్వం యొక్క స్వంత ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల నుండి మే3, 2002న సంఘటనా స్థలాన్ని నిపుణుల బృందం చూసి, తయారు చేసిన నివేదిక మొట్టమొదట పోలీసులు ఇచ్చిన వివరణలను అధికారికంగా అసత్యమని నిరూపించి ఇలా ముగించింది: “60 లీటర్ల మండిపోయే ద్రవాన్న, ఒక అసాధారణ, పెద్ద మూతి ఉన్న పాత్ర అంటే బక్కెట్టు వంటి దానితో” నేల పై కుమ్మరించి వెలిగిస్తే వచ్చే మంటలు ఎలా ఉంటాయో ఇక్కడ మంటలు కూడా దానికి అనుగుణంగా ఉన్నాయని చెప్పారు. ”**

అంటుకోటానికి కారణం ఏ మాత్రం అనుమానానికి తావు లేకుండా తెలుస్తోంది. అది ఏమిటంటే అక్కడ మంట బోగీ మధ్యలో నుండి ప్రారంభం అయింది. బహుశా ఎవరో భోజనం వేడిచేసుకునేందుకో, టీ కాచుకునేందుకో వెలిగించిన స్టవ్‌ని ఎవరో తన్నుకోవటం వల్ల ప్రమాదం జరిగింది.

ఆ మంటలు ఆ ప్రదేశానికి పరిమితం అయ్యాయి, కానీ మంట సృష్టించిన పొగ మొత్తం బోగీ పైన, క్రింద బెర్త్‌ల మధ్య ఉన్న ఖాళీల్లో, సీలింగ్ క్రింద భాగంలో అంతా విస్తరించింది. ఎస్-6లో లాగే చనిపోయిన చాలా మంది ఊపిరి ఆడక చనిపోయారు. ఈ వివరణ విశ్వసనీయత పొందింది ఎందుకంటే అప్పట్లో రైల్వే వారు రెండవ తరగతి పెట్టెలకి అగ్ని నిరోధక సామగ్రి వాడేవారు కాదు. అందుకని ఒక్క వెలిగే అగ్గిపుల్ల కూడా పెద్ద మంట సృష్టించగలదు, దాని ద్వారా అతి పెద్ద మొత్తంలో విషపు పొగలు కమ్ముకోగలవు. పైగా, దూర ప్రయాణాలలో రైలులోనే వండుకోటం లేదా తాము తెచ్చుకున్న ఆహారం వేడి చేసుకోటం అవేవి సనాతన హిందువులకు చాలా సాధారణమైన అలవాటు, బహుశా ఇప్పటికీ అది ఉందనుకుంటా.

బెనర్జీ కమీషన్ నివేదికను బిజెపి చాలా గట్టిగా తిరస్కరించింది. అప్పటి పార్టీ ప్రతినిధి, అరుణ్ జైట్లీ విధానపరమైన అభ్యంతరాలు లేవనెత్తారు. రైల్వే మంత్రిత్వ శాఖ కేంద్ర ప్రభుత్వానికి చెందినది అయినా దానికి ఇటువంటి విచారణలు జరిపే హక్కు లేదన్నారు. “అది కనుక ప్రమాదమే అయితే, ప్రయాణీకులు బయటకి దూకేయటానికి ఏది అడ్డం పడింది?” అని అడిగారు, సమాధానం తెలుస్తూనే ఉందిగా అన్నట్లు.

ఒక వ్యూహాన్ని అనుసరిస్తూ (అది ఇప్పుడు మనకు బాగా పరిచయమైపోయింది) రాష్ట్ర ప్రభుత్వం 2002లో గోద్రా ప్లాట్ ఫారం మీద అల్లర్లలో గాయపడిన ఒక హిందూ చేత జస్టిస్ బెనర్జీ కమీషన్ నివేదికని గుజరాత్ హైకోర్టులో సవాలు చేయించింది. అప్పుడు అధ్యక్షత వహించిన న్యాయమూర్తి బెనర్జీ కమీషన్ ఏర్పాటుని “రాజ్యాంగ విరుద్ధం, చట్ట విరుద్ధం మరియు పూర్తిగా చెల్లనిది”, అని ప్రకటించి, ఇది “అధికారంతో దురుద్దేశపూర్వకంగా రంగులు మార్చే ప్రక్రియ”అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అల్లర్లు జరిగిన వెంటనే, షా కమిషన్‌ని ఏర్పాటు చేసి మార్చ్ 8న ఆ కమీషన్‌కి విశ్రాంత సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి జీ. టి. నానావతిని కూడా నియమించిన తర్వాత బెనర్జీ కమీషన్ కమిటీ ఏర్పాటు చేయటానికి రైల్వే మంత్రిత్వ శాఖకు ఎంత ధైర్యం అని మందలించేంత వరకు కూడా ఆయన వెళ్ళారు. రైల్వే శాఖ తన స్వంత ఆస్తులకు జరిగిన అగ్ని ప్రమాదం ఎలా మొదలైంది అని తెలుసుకుని, భవిష్యత్తులో వాటిని నివారించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసెందుకు తనకి ఉన్న హక్కుని కూడా ఆయన కొట్టిపారేశారు.

ఈ తీర్పు పూర్తిగా అసాధారణం. కానీ, మంటలు ఎలా ప్రారంభం అయ్యాయి అనే అధికారిక వివరణను ప్రశ్నించటానికి బెనర్జీ కమీషన్ నివేదిక ఒక్క దానిమీదనే ఆధారపడనక్కలేదు. అహ్మదాబాద్‌లోని గుజరాత్ ప్రభుత్వం యొక్క స్వంత ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల నుండి మే3, 2002న సంఘటనా స్థలాన్ని నిపుణుల బృందం చూసి, తయారు చేసిన నివేదిక మొట్టమొదట పోలీసులు ఇచ్చిన వివరణలను అధికారికంగా అసత్యమని నిరూపించి ఇలా ముగించింది: “60 లీటర్ల మండిపోయే ద్రవాన్న, ఒక అసాధారణ, పెద్ద మూతి ఉన్న పాత్ర అంటే బక్కెట్టు వంటి దానితో” నేల పై కుమ్మరించి వెలిగిస్తే వచ్చే మంటలు ఎలా ఉంటాయో ఇక్కడ మంటలు కూడా దానికి అనుగుణంగా ఉన్నాయని చెప్పారు.

ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల (ఎఫ్ సి ఎల్) ఎందుకని పోలీసు చార్జిషీట్‌లోని ఆరోపణలని అంత సమగ్రంగా అసత్యమని చెప్పింది? దీనికి సమాధానం మోడీ ఇంటిలిజెన్స్ విభాగం నుండి తెలుసుకుని ఉంటారు- పట్టించుకునే పౌరుల ధర్మాసనం (కాన్సర్న్‌డ్ సిటిజన్స్ ట్రిబ్యునల్ - సిసిటి)కి అధ్యక్షుడు ఒకప్పటి న్యాయమూర్తి వి.ఆర్. కృష్ణ అయ్యర్ మే మొదటిలో గోద్రా వచ్చి చూడటానికి సన్నాహం చేసుకుంటున్నారని తెలిసింది. అప్పుడు ఘూంచి ముస్లిం ప్రతీకార కథన వివరణ నిలవదు.

సిసిటి తామే స్వంతంగా వెళ్ళి వచ్చిన తర్వాత ఈ విధంగా ముగించింది:

7-5-2002 న, బోగీని, అది కాలిపోయిన ప్రదేశాన్నిమేము పరీక్షించాము. రైలు ఆగిన ప్రదేశం ఒక ఎత్తైన కట్ట. నేల మీద నుండి ఆ కట్ట ఎత్తు ఇంచుమించు 12-15 అడుగులు ఉండచ్చు. ఇది ఒక వాలు ప్రదేశం. ఆ కట్ట పైన, రైలు పట్టాలకు రెండు పక్కల 2,000 మంది పట్టేంత చోటు ఉండటమే చాలా కష్టం. ఆ ప్రదేశంలో అంత మంది గుమిగూడారనే అనుకుందాం, ఆ జనం మొత్తం పట్టటానికి ఎస్-6 భోగీ ఉన్న చోటు కంటే ఇంకా ఎక్కువ ప్రదేశంలో విస్తరించాల్సి ఉంటుంది. ఇది కేవలం సూచించటానికి మాత్రమే, ప్రభుత్వం యొక్క కథనం నిజమైతే, ఇంకా మిగిలిన భోగీలు కూడా ఎస్-6 అంత సులభంగా దాడికి గురియై ఉండేవి.

మరల, ఆ కట్ట యొక్క ఎత్తుని, ట్రైన్ యొక్క ఎత్తుని పరిగణలోకి తీసుకున్నట్లైతే, మండుతున్న గుడ్డ బంతులు ట్రైన్ మీదకి విసిరితే, భోగీ బయట భాగం నల్లగా మసిబారాలి. కానీ మాకు అటువంటి గుర్తులు కిటికీ బయట, దిగువ భాగంలో ఏమీ కనబడలేదు. నల్ల మసిబారిన గుర్తులు కిటికీ చుట్టూ, కిటికి పైనా కూడా కనిపించాయి. అంటే ఇది చాల స్పష్టగా సూచస్తున్నదేమంటే మంటలు భోగీ లోపలే ప్రారంభమై, అవి కిటికీల గుండా బయటకి వచ్చి బయట భాగాన్ని, కిటికీ పైన (ఉద్ఘాటన జోడించబడింది) భాగాన్ని కాల్చాయి. మామూలు కంటికి కూడా ఇది చాల స్పష్టంగా కనిపిస్తున్నది, అంటే మంటలు ముందు లోపల నుండే వచ్చాయి, బయట నుండి కాదు.”

మంటలు లోపలి నుండే మొదలైతే, ఎవరు దీనిని మొదలుపెట్టి ఉంటారు? ఆ


epaper.prajasakti.com

సంఘటన తర్వాతి రోజుల్లో హిందువులు ముస్లింలనందరికీ కలిపికట్టి వేసిన శిక్షని సమర్థించుకునేందుకు గుజరాత్ ప్రభుత్వానికి ఒక సమాధానం అవసరం అయింది. ఎఫ్ ఎస్ ఎల్ యొక్క 'శాస్త్రీయ' విశ్లేషణ మీదుగా పోలీసులు ఒక కొత్త వివరణతో వచ్చారు. విచారణ చేసిన అధికారులు ఇలా ప్రకటించారు. రైలు ఫాలియా దగ్గర ఉన్న సిగ్నల్ ఎదురుగా ఆగినప్పుడు కొంతమంది ముస్లింలు ఎస్-6, ఎన్-7ని కలిపే ప్రదేశంలోకి ఎక్కి బలవంతంగా ఎస్-6 లోకి ఎక్కి 60 లీటర్ల పెట్రోల్ భోగీలో మధ్య నడిచే దారిలో పోసి అగ్గిపుల్ల వెలిగించారు.

ఈసిద్ధాంతాలలోని అసంగతాలు గత రెండు దశాబ్దాలుగా చాల సార్లు చూపెడుతూనే ఉన్నారు. మొదటిది, బక్కెట్లని చేతితో మోసుకువెళ్లవలసి వస్తుంది, అలానే చాలా తక్కువ బక్కెట్లు 20 లీటర్ల కంటే ఎక్కువ పరిమాణం కలిగినవి ఉంటాయి, అందుకని కనీసం మూడు బక్కెట్లు ట్రైన్ వరకు తీసుకువెళ్లవలసి ఉంటుంది. అంతేకాక, అత్యుత్సాహంతో కయ్యానికి కాలు దువ్వటానికి సిద్ధంగా ఉన్న కరసేవకులతో రైలు మొత్తం కిక్కిరిసి పోయి ఉన్నప్పుడు, అప్పటికే విరోధులుగా అయి గుమిగూడిన ముస్లిం గుంపు నుండి మూడు బక్కెట్ల ద్రవం, అదీ చాలా సులభంగా గుర్తుపట్టగలిగినది తీసుకుని రైలు ఎక్కటానికి ప్రయత్నిస్తే దానిని కరసేవకులు అనుమతించారా? చాలా స్పష్టంగా ఇలా జరగదు. అందుకనే ఈ కథ నిరూపించటానికి పోలీసులకి ఒక్క ప్రయాణికుడు కూడా దొరకలేదు.

ఎఫ్ ఎస్ ఎల్ నిపుణుల చేసిన 60 లీటర్ల లెక్క అది ఖాళీ భోగీలో ఎంత దూరం ప్రయాణిస్తుందో చూశారు గానీ, పూర్తిగా ప్రయాణీకులు వారి, సమానులతో కిక్కిరిసి పోయి ఉన్న చోట 60 లీటర్లు ఎలా ప్రయాణించి ఉండేదో వారు పట్టించుకోకపోటం వింతగా ఉంది. ప్రమాదం మొదలైనప్పుడు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్న ప్రయాణీకులను లెక్కలోకి తీసుకోకుండానే, చనిపోయిన, గాయపడిన వారి లెక్కని బట్టి చూస్తే మంట అందుకునే సమయానికి అక్కడ కనీసం 108 మంది ఉన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఇంత ప్రాథమిక స్థాయి తప్పు ఎలా చేసారో ఊహించలేము. అంటే ఇక మనకు మిగిలిన వివరణ - ముస్లింల మీద నింద కొనసాగేందుకు వీలుగా వాళ్ళని వేరే వివరణ కనుక్కోమని ఆదేశించబడ్డారు.

> **"అందుకని కనీసం మూడు బక్కెట్లు ట్రైన్ వరకు తీసుకువెళ్లవలసి ఉంటుంది. అంతేకాక, అత్యుత్సాహంతో కయ్యానికి కాలు దువ్వటానికి సిద్ధంగా ఉన్న కరసేవకులతో రైలు మొత్తం కిక్కిరిసి పోయి ఉన్నప్పుడు, అప్పటికే విరోధులుగా అయి గుమిగూడిన ముస్లిం గుంపు నుండి మూడు బక్కెట్ల ద్రవం, అదీ చాలా సులభంగా గుర్తుపట్టగలిగినది తీసుకుని రైలు ఎక్కటానికి ప్రయత్నిస్తే దానిని కరసేవకులు అనుమతించారా?"**

ఫిబ్రవరి 27, 2002న అహ్మదాబాద్‌లో విహెచ్‌పి శ్రేణులు అయోధ్యలో పవిత్ర కార్యం నెరవేర్చి పెద్ద సంఖ్యలో వస్తున్నకరసేవకులను గోద్రా దగ్గర ముస్లింలు సజీవంగా కాల్చివేశారు అని వీధుల్లో తిరుగుతూ చాటింపు వేశారు. ఫిబ్రవరి 28న నల్లగా కాలిపోయిన (గుర్తు పట్టలేని) శవాలు తీసుకుని పట్టణం గుండా ఊరేగింపు చేశారు. మర్నాటి ఉదయానికల్లా పట్టణమంతా పర్వతమంత ఎత్తు ద్వేషపు అలలు ఎగిసిపడేలా తయారైంది. వారి పనులు ఎంత నిందింపదగినవిగా భావించినా, ఎవరూ వారిని అనుమానించలేదు, ఇంకా ఈ రోజుకీ కూడా ఒక్కరికీ అనుమానం రాలేదు, ఈ శవాలు నిజంగా కరసేవకులవేనా అని. ఆ రోజు చనిపోయిన వారి వివరాలు, గుర్తులు జాగ్రత్తగా గమనిస్తే వారిలో చాలామంది ట్రైన్ అయోధ్యలో కరసేవకులతో నిడిపోకముందు లక్నో, దాని తర్వాత స్టాపులలో ఆ దురదృష్టకర ఎస్-6లో ఎక్కిన సాధారణ ప్రయాణీకులు.

రైల్వే బుకింగ్ చార్ట్‌లో ఎస్-6 భోగీలో కంఫర్మ్ అయిన 72 బెర్త్‌లలో 43 లక్నో నుండి అని చూపిస్తోంది. వీటిల్లో 19 మంది మగవారు, 19 మంది ఆడవారు, 5 గురు 18 సంవత్సరాలలోపు పిల్లలు. బుక్ చేసుకున్న వారిలో సగానికి పైగా ప్రయాణీకులు కుటుంబాలు. ఇంకొక 23 ప్రయాణీకులు తర్వాతి స్టేషన్‌లలో ట్రైన్ ఎక్కారు. అందరికీ బెర్త్‌లు ఉన్నందువల్ల, కొద్ది మంది కూడా భోగీ బయటికి వెళ్లే దారుల దగ్గరగా లేనందువల్ల మంటలు మొదలవ్వగానే తప్పించుకునే స్థితిలో వీరు లేరు.

మొట్టమొదట చనిపోయింది, అందరిలోకి బలహీనులైన మహిళలు, పిల్లలు. మూడు రోజుల తర్వాత జరిగిన ఫోరెన్సిక్ పరీక్షల ద్వారా నిర్ధారించబడింది ఏమిటంటే చనిపోయిన వారిలో 20 మంది మగవారు, 26 మంది ఆడవారు, 12 మంది పిల్లలు ఉన్నారు. చనిపోయిన 58 మందిలో 38 మంది కరసేవకులు అయ్యే వయసు కానీ, వారి లింగం కానీ సరిపోదు. చనిపోయిన మగవారిలో కూడా, ఎక్కువ మంది చనిపోటానికి కారణం, బహుశ వారు పొగలో చిక్కుపోయిన వాళ్ళ కుటుంబాలని బయటకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తూ వాళ్ళ కుటుంబాలతో ఉండిపోవటం అయి ఉంటుంది.

చనిపోయిన కరసేవకుల సంఖ్య కూడా చాలా తక్కువగానే ఉండచ్చు అని సిసిటికి అధ్యక్షత వహించిన న్యాయమూర్తి వి.ఆర్. కృష్ణ అయ్యర్ సూచించారు. ఎవరో కొద్దిమంది తప్ప కరసేవకులందరూ శారీరకంగా బలమైన యువకులు. భోగీలో బలవంతంగా దారి చేసుకుని వెళ్లగలిగిన వీరు భోగీ మధ్యలో కాకుండా రెండు చివరల ఉండగలిగి భోగీకి నిప్పు అంటుకున్నప్పుడు బలవంతంగా దారి చేసుకుని భోగీ బయటకి వెళ్ళి ఉంటారు. ఇలా చాలామంది కచ్చితంగా చేసి ఉంటారు అనేది ఏది సూచిస్తోంది అంటే భోగీ నుండి తప్పించుకు బయటపడిన 43 మందిలో కేవలం ఐదుగురుకి మాత్రమే ఆసుపత్రిలో చేరవలసి వచ్చింది. వీటన్నింటినీ పరిగణలోనికి తీసుకుంటే కనీసం ఒక డజను మంది కరసేవకులు కూడా చనిపోయే అవకాశం లేదు.

ఒక్క సారి వెనక్కి తిరిగి ఫిబ్రవరి 27, 2002 జరిగిన సంఘటనలు చూస్తే, ఈ రోజే ఆధునిక జాతీయత వైపుకి భారతదేశ ప్రయాణం భంగపడటం మొదలుపెట్టింది. గోద్రా నరేంద్ర మోడీని గుజరాత్‌లో అధికారంలోనికి తెచ్చింది. భారత దేశ ప్రధాన మంత్రి అయ్యేందుకు దారి సిద్ధం చేసింది. మోడీ రెండు కమ్యూనిటీల మధ్య భయం, అనుమానం అనే విత్తనాలు నాటటం ద్వారా గుజరాత్‌లో తన పార్టీ అధికారం స్థిరీకరించారు. అదే ఇప్పుడు ఇండియాలో కూడా చేస్తున్నారు. అతనిని ఆపగలిగిన వారు కూడా లేరు.




epaper.prajasakti.com

సిద్ధాంతం

# గ్రామీణ ప్రాంతంలో బలపడిన భూస్వామ్య కూటమి

బి.టి.రణదివే



రచయిత సిపిఐ(ఎం) మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు

రాజ్యాంగ యంత్రంలో ఉన్నతాధికారుల నిరంకుశాధికారం, పాలనా యంత్రాంగంపై వారి పట్టు పెరుగుతుండటం స్వాతంత్ర్యానంతరం జరుగుతున్న ఒక ముఖ్యమైన, ప్రమాదకరమైన పరిణామం. పెరుగుతున్న ప్రజల అసంతృప్తి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మారటంతో ఆ పార్టీ విచ్ఛిన్నం కావటం ప్రారంభమైంది. 1969లో ఆ పార్టీ రెండు ముక్కలుగా చీలిపోయింది. రాష్ట్రాలలో అధికారంపై గుత్తాధిపత్యం కోల్పోయింది. జాతీయ నాయకుల కన్నా స్థానిక నాయకులు, ముఖ్యమంత్రులు శక్తివంతులుగా మారారు. రాష్ట్రాలు తమకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేయటం పెరిగింది. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తమ కేంద్ర మంత్రులను విమర్శించటంలో వెనుకబడటం లేదు. పది సంవత్సరాలకు ముందున్న పరిస్థితి ఇది. ఇపుడు పరిస్థితి మరింత దిగజారింది. కాంగ్రెస్ పూర్తి నిర్మాణరహితంగా ఉన్నది. దీని ఫలితంగా భారతదేశంలోని ఉన్నతాధికారుల నిరంకుశాధికారం అసాధారణంగా పెరిగింది. వీరిలో ఒకభాగం అవినీతి, లాభాపేక్ష, ప్రజావ్యతిరేక దృక్పథంలో పేరుపడ్డవారుగా, తమకు ఎక్కువ ప్రయోజనం కలిగేలా ఉంటే ఎవరికైనా అమ్ముడుపోవటానికి సిద్ధంగా ఉన్నారు.

భారతదేశం స్వాతంత్ర్యం పొందే నాటికే ఉన్నతాధికారులు శక్తివంతులుగా ఉన్నారు. కాని కాంగ్రెస్ పాలకులకు విస్తారమైన ప్రజా మద్దతు ఉండటంతో ఒద్దికగా ఉన్నారు. కాంగ్రెస్ పలుకుబడి క్షీణించటం, పార్టీ అంతర్గత కలహాలు, మంత్రివర్గాలలో నిరంతరం మార్పులు, చివరిగా ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి తమకు ప్రమాదం కలిగించకుండా దృఢంగా వ్యవహరించాల్సి రావటం ఉన్నతాధికారులు ప్రజాస్వామిక శక్తులతో తలపడే స్థితిని తీసుకువచ్చింది.

రాజీవ్‌గాంధి ప్రభుత్వంలో ఉన్నతాధికారులు మరింత శక్తివంతులుగా మారారు. అధికారం పూర్తిగా ఒకవ్యక్తి, ప్రధానమంత్రి చేతుల్లో కేంద్రీకృతం కావటం, తరచుగా మంత్రుల శాఖలు మార్చటం, అసమర్థులైన వారిని మంత్రులుగా చేయటం, బోఫోర్స్ కుంభకోణం తర్వాత ప్రజలలో కాంగ్రెస్(ఐ), రాజీవ్‌గాంధి ప్రతిష్ఠ దిగజారటం, మంత్రులకు నైపుణ్యం లేకపోవటం తదితరాలు దేశాన్ని ఉన్నతాధికారుల దయాదాక్షిణ్యాలకు వదిలివేశాయి. తమ పార్టీలో ఎన్నికలు జరపకుండా నిరంకుశ పద్ధతిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాయకత్వం ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు ఎక్కువెక్కువగా ఉన్నతాధికారులపై ఆధారపడుతున్నది. మంత్రుల పరిస్థితిని ఆసరాగా తీసుకున్న ఉన్నతాధికారులు మంత్రుల అంగీకారంతో తమ స్వంత లక్ష్యాలను ముందుకు తీసుకుపోతున్నారు.

ఈనాడు రాజీవ్‌గాంధి ప్రభుత్వంలో రాజ్యాంగం, ప్రజలూ ఉన్నతాధికారుల బెదిరింపులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలను పార్లమెంటులో సమర్థించటానికే ఎన్నికైన మంత్రుల పాత్ర పరిమితమౌతున్నది.

### తీవ్ర వత్తిడులకు గురవుతున్న బూర్జువా-భూస్వామ్యవర్గాల కూటమి

గత 40 సంవత్సరాల కాలంలో పాలక బూర్జువా-భూస్వామ్యకూటమిలో కూడా తీవ్రమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాలమంతా ఆ కూటమిలో తీవ్రమైన ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కాలమంతా ఆ కూటమిలో తీవ్రమైన ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. కాంగ్రెస్‌కు విస్తారమైన ప్రజాదరణ ఉండటం వలన కూటమిలో జూనియర్ భాగస్వామి అయిన భూస్వామ్యవర్గం ఎటువంటి ప్రతిఘటన లేకుండా తమ స్థాయిని కుదించటాన్ని అంగీకరించింది. కాని తర్వాతి సంవత్సరాలలో మొదట రాజ్యాంగంలో ఆస్తికి కల్పించిన రక్షణను ఉపయోగించుకుని, తర్వాత భూసంస్కరణల చట్టాలకు విఘాతం కలిగించటం ద్వారా వారు తమ ప్రయోజనాలను కాపాడుకోవటానికి ప్రయత్నించారు. ప్రభుత్వ జోక్యం నుంచి భూస్వాముల ఆస్తిహక్కును కాపాడటం కోసం రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని మార్చే హక్కు పార్లమెంటుకు లేదని 1969లో సుప్రీంకోర్టు తీర్పుఇచ్చింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రాథమిక హక్కులలో పార్లమెంటు జోక్యాన్ని నివారించింది. అందువలన ప్రాథమిక హక్కులలో గణనీయమైన మార్పులు జరుగుతాయని ఆశించటానికి అవకాశం లేకుండాపోయింది.

ఈ సంఘటన తర్వాత ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న భూస్వాముల కూటమి భూ సంస్కరణల అమలును గురించి ప్రచారం చేస్తూనే, చట్టాల అమలుకు విఘాతం కలిగించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఫలితంగా కూటమిలో కొంతమేరకు భూస్వాములకు అనుకూలంగా మార్పు వచ్చింది. కాంగ్రెస్ పాలనలో భూస్వాములు, భూ యజమానులు, నూతన గ్రామీణ ఆస్తిపర, పెత్తందారీ వర్గాలన్నీ గతంలో ఏనాడూ లేని విధంగా అభివృద్ధి చెందాయి. భూ సంస్కరణల అమలు కోసం వరుసగా అనేక చట్టాలు ఆమోదించినప్పటికీ భూములపై వారి గుత్తాధిపత్యంలో పెద్దగా మార్పు రాలేదు. కాంగ్రెస్ వ్యవసాయ కార్యక్రమంతో వారు ప్రయోజనం పొంది, ఎక్కువ సంపదలు కూడబెట్టుకున్నారు. రాష్ట్ర



epaper.prajasakti.com

ప్రభుత్వాలపై ఆధిపత్యం చెలాయిస్తూ, చాలా రాష్ట్రాలలో వారు అత్యంత శక్తివంతులుగా ఉన్నారు. వ్యవసాయ ఆదాయంపై పన్నువేసే అధికారం రాష్ట్రాల చేతులలో ఉండటంతో, పెరిగిన తమ శక్తిని ఉపయోగించుకుని తమపై పన్నులు వేసుకోవటానికి వారు తిరస్కరించారు. కేంద్ర ప్రభుత్వం పన్నులు విధించటానికి చేస్తున్న ప్రయత్నాలను కోర్టుల సహకారంతో ప్రతిఘటించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఆదాయంపై పన్ను విధించాలని చేసిన ప్రయత్నాలను పంజాబ్-హర్యానా హైకోర్టు తీర్పు వమ్ముచేసింది.

> “ భూములు కలిగిన ధనిక కుటుంబాలకు చెందిన వారు బంధువులు, తమ కులాలకు చెందిన వారితో వివిధ రకాలుగా విస్తరించిన సంబంధాల ద్వారా సైన్యం, పోలీసు, న్యాయవ్యవస్థ, ఇతర ప్రభుత్వ విభాగాలలోని కీలక స్థానాలలో ప్రధాన భాగాన్ని చేజిక్కించుకున్నారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రభావితం చేయటం కోసం రాష్ట్ర శాసన సభలలోకి ప్రవేశించారు. ”

అదే సమయంలో ప్రజలపై కాంగ్రెస్ పలుకుబడి తగ్గటంతో గ్రామీణ ఓట్లను సంపాదించుకోవటంలో ఈ వర్గం కీలకంగా మారింది. ప్రధానమైన ఈ వర్గం నుండి మద్దతు లేకుండా పాలకపార్టీ ఎన్నికలలో గెలిచే పరిస్థితి లేదు. ఈ వర్గం పలుకుబడిని ఎదుర్కోవటం కోసం కాంగ్రెస్ పార్టీ తరచుగా దారిద్ర్య వ్యతిరేక కార్యక్రమాలను, వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులను ఆకర్షించటానికి ప్రయత్నం చేయటంతో పాటు, ప్రత్యేకంగా ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతంలోని దిగువ తరగతుల ప్రతినిధులపై ఆధారపడి గుజరాత్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలో కాంగ్రెస్ పార్టీ జయప్రదం అయింది. కాబట్టి అది భూస్వాములు, గ్రామీణ పెత్తందారులతో నిరంతరం ఘర్షణ పడుతున్నది. ప్రభుత్వాన్ని పడగొట్టటానికి వీరు భారిస్థాయి ఆందోళనలు, బంద్‌లు చేశారు. ఈ మధ్య ఆందోళనలలో వారు చేసిన డిమాండ్‌లలో ఒకటి వ్యవసాయ కార్మికుల కనీస వేతన చట్టాన్ని రద్దు చేయాలన్నది. గుజరాత్‌లో దిగువ తరగతుల ప్రజల మద్దతుతో జిల్లా పరిషత్, పంచాయితీ ఎన్నికలలో ఇతర పార్టీలను తుడిచిపెట్టి, కాంగ్రెస్(ఐ) పార్టీ ఘన విజయం సాధించింది. అదే సమయంలో మునిసిపాలిటి, కార్పొరేషన్ ఎన్నికలలో ఓడిపోయింది. కాంగ్రెస్(ఐ) ప్రభుత్వంతో భూస్వాములు ప్రత్యక్షంగా పోరాడుతున్న గుజరాత్‌లో ఈ కూటమిలో ఘర్షణలు తీవ్రమౌతున్నవి.

సమూలమైన భూసంస్కరణలను పక్కన పెట్టి, వెనుకబడిన తరగతులను కేవలం రిజర్వేషన్లతో సంతృప్తి పరచాలన్న కాంగ్రెస్(ఐ) ఎత్తుగడలు కుల ఘర్షణలు పెరగటానికి దారితీశాయి. ఉద్యోగాలు తగ్గిపోవటంతో భూస్వాములు, వారి మిత్రులుగా ఉన్నవారు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మధ్యతరగతి, యువతను సమీకరించి, అణచివేతకు గురవుతున్న తరగతులకు వ్యతిరేకంగా ఘర్షణలకు ప్రోత్సహించారు. రిజర్వేషన్లు, రిజర్వుడు స్థానాల సంఖ్యను పెంచటాన్ని ఆయుధంగా ఉపయోగించుకుని, బూర్జువా పార్టీలు పాలిస్తున్న అన్ని రాష్ట్రాలలోనూ ప్రజలను విభజించటానికి పూనుకున్నారు.

గ్రామీణ ప్రాంతంలోని ఆధిపత్య వర్గాల రాజకీయశక్తి పెరగటాన్ని విదేశాలలోని రచయితలు కూడా గుర్తించారు. 'రెండవస్థాయిలోని పెద్ద భూస్వాములు రాజకీయ ఉపరితలంలోకి విస్తారంగా ప్రవేశించటం, ఈ వర్గ ప్రధానశక్తులు రాజ్యాంగయంత్రంలోకి చొరబడటంతో వలస విధానం అంతమైన తర్వాత ఏర్పడిన నూతన పరిస్థితులు మారిపోయాయి'.

'స్వాతంత్ర్యం సాధించిన మొదటి 10-15 సంవత్సరాలలో గ్రామీణ ఆధిపత్య వర్గాల నుండి అభివృద్ధి చెందిన నూతన ఉన్నతాధికార వర్గం ప్రభుత్వ యంత్రంలోని లింకులపై (ప్రధానంగా రాష్ట్రాలు, జిల్లాలు) ఆధిపత్యం సాధించింది. భూములు కలిగిన ధనిక కుటుంబాలకు చెందిన వారు బంధువులు, తమ కులాలకు చెందిన వారితో వివిధ రకాలుగా విస్తరించిన సంబంధాల ద్వారా సైన్యం, పోలీసు, న్యాయవ్యవస్థ, ఇతర ప్రభుత్వ విభాగాలలోని కీలక స్థానాలలో ప్రధాన భాగాన్ని చేజిక్కించుకున్నారు. గ్రామీణ ప్రాంతాలకు సంబధించి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రభావితం చేయటం కోసం రాష్ట్ర శాసన సభలలోకి ప్రవేశించారు. 1970వ దశాబ్దంలో గ్రామాలలో స్వయం పాలిత విధానాన్ని ప్రవేశపెట్టటానికి తీసుకున్న చర్యలతో ప్రభుత్వంపై పలుకుబడిని పెంచుకోవటం కోసం పోరాటం చేయటానికి విస్తారమైన నూతన రంగం అందుబాటులోకి వచ్చింది. ఈ సంస్థలలోని అత్యధిక స్థానాలను భూస్వాములు, ఆధిపత్య కులాలలోని పై తరగతుల ధనికులు గెలుచుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న పెద్ద భూస్వాములు స్వతంత్రమైన రాజకీయశక్తిగా ఎదగటం వలన భారత రాజకీయ రంగంలో ఉన్న పార్టీలు, గ్రూపులు వారికి ప్రయోజనం కలిగించే విధానాలను అనుసరించటం యుద్ధానంతర అభివృద్ధిలో అత్యంత ప్రధానమైన పరిణామం'.

ప్రజలపై ఉన్న పలుకుబడిని కాంగ్రెస్(ఐ) పార్టీ కోల్పోవటంతో ఎన్నికలలో విజయం కోసం ఈ కూటమిపై ఆధారపడటం పెరుగుతున్నది. తప్పులు చేస్తున్న ముఖ్యమంత్రులతో వ్యవహరించటంలో కాంగ్రెస్ పార్టీ అశక్తత, బీహార్, ఒరిస్సా, ఇతర రాష్ట్రాలలో దళితులపై జరుగుతున్న దాడులను, నిధుల వినియోగంలో జరుగుతున్న అవినీతిని పరిగణనలోకి తీసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం తిరస్కరించటం కూటమిలోని బలాబలాలలో వచ్చిన మార్పుల ఫలితంగానే జరుగుతున్నాయి. కాంగ్రెస్ (ఐ) పార్టీ, దాని నాయకులు ఒక సమయంలో భూస్వాములతో సంబంధం లేకుండానే గ్రామీణ ఓటర్లపై ఆధిపత్యం సంపాదించారు. ఇపుడు కాంగ్రెస్ పార్టీ భూస్వాముల ద్వారా మాత్రమే ఓట్లు పొందగలుగుతున్నది. అందువలన భూస్వాములే అభ్యర్థులను నిర్ణయించే స్థితిలో ఉండటంతో భూస్వాముల కుటుంబాలు లేదా వారి కులాల నుండే ఎక్కువ మంది అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్రాలలోని కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో జరిగిన మార్పులు ఆ పార్టీలో పెరుగుతున్న భూస్వాముల కూటమి బలానికి నిదర్శనంగా ఉన్నాయి. ఈ క్రమంలో భాగంగానే


epaper.prajasakti.com

> "ఈ విధమైన పరిణామాల పూర్వరంగంలో మితవాద భావజాలం, తిరోగమన ఉద్యమాలు పెరగటం, తాత్కాలికంగానైనా వారు చేస్తున్న ప్రచారం విస్తారమైన ప్రజానీకంలోకి చొచ్చుకుపోవటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. మితవాద, అభివృద్ధి నిరోధక భావజాలాన్ని ప్రచారం చేస్తున్నవారికి గ్రామీణప్రాంతాలలో కుల, మత భావాలు యధాతధంగా కొనసాగటం ఉత్సాహం కలిగిస్తున్నాయి."

బ్రాహ్మణులైన కొందరు జాతీయ నాయకుల స్థానాలలో రాజపుత్రులుగా చెప్పుకుంటున్న వారిని నియమించారు.

ఆర్థిక ప్రణాళిక కోసం ద్రవ్య వనరులను సమీకరించటం, కులతత్వం, మతతత్వం, అంటరానితనం తదితర సమస్యల పట్ల రాజకీయంగా వ్యవహరించాల్సిన తీరు తదితరాలు బూర్జువా - భూస్వామ్యవర్గ కూటమి సాఫీగా పనిచేయటంపై ప్రభావం చూయిస్తాయి. కులం, అంటరానితనం, మతోన్మాదం తదితర సమస్యల పట్ల గతంలో ఊహించటం కూడా సాధ్యం కాని విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించటం ఈ గ్రామీణ కూటమి యధాతధ పరిస్థితులను కొనసాగించటానికి మొగ్గుచూపుతున్న ఫలితమే. భూస్వామ్యవర్గం తనకు రాయితీలు కావాలని, తన డిమాండ్లను అంగీకరించాలని నిరంతరం వత్తిడి చేస్తుండటం వలన ప్రజలను తన ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించుకోవటం కోసం బూర్జువా వర్గం వేస్తున్న ఎత్తులకు పరిమితులను విధిస్తున్నాయి.

కాంగ్రెస్ విధానాలను లోపలి నుండి ప్రభావితం చేయటంతోనే ఈ కూటమి సంతృప్తి చెందటం లేదు. గిట్టుబాటు ధరలు, ఇతర సమస్యలపై సామాన్య రైతాంగ ప్రతినిధులుగా ఫోజు పెడుతూ, అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా సమీకరిస్తున్నది. రాజకీయ అధికారంలో మరింత వాటా కోరుతూ, గ్రామీణ ప్రాంతంలో అమలు జరిపే విధానాలపై తమ పెత్తనమే ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. భారతీయ సమాజంలోని అత్యంత యధాతధవాద తరగతులకు చెందినవారు రాజకీయ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. మహారాష్ట్రలో శరద్‌జోషి, గుజరాత్, ఇతర రాష్ట్రాలలోనూ ఇటువంటి వారు ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. దేశం అనుసరిస్తున్న విధానాలను దారి తప్పించి, తమకు అనుకూలమైన విధానాలను రూపొందించేలా వత్తిడి చేయటమే వీరు నిర్వహిస్తున్న కిసాన్ మోర్చాల లక్ష్యం. జాతి వ్యతిరేక, విదేశీశక్తులకు లొంగిపోవటానికి, రాజీపడటానికి వీరు సులభంగా అంగీకరిస్తారు.

### బలపడుతున్న మితవాద భావజాలం

ఈ విధమైన పరిణామాల పూర్వరంగంలో మితవాద భావజాలం, తిరోగమన ఉద్యమాలు పెరగటం, తాత్కాలికంగానైనా వారు చేస్తున్న ప్రచారం విస్తారమైన ప్రజానీకంలోకి చొచ్చుకుపోవటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. మితవాద, అభివృద్ధి నిరోధక భావజాలాన్ని ప్రచారం చేస్తున్నవారికి గ్రామీణప్రాంతాలలో కుల, మత భావాలు యధాతధంగా కొనసాగటం ఉత్సాహం కలిగిస్తున్నాయి. రామజన్మభూమి విషయంలో వలెనే షాబాను కేసుతీర్పుతో ముస్లీం మతతత్వవాదులకు లొంగిపోయినట్లుగానే రాజీవ్ గాంధి నాయకత్వంలోని అధికారపార్టీ ఎన్నికల విజయాలు, ఇతర ప్రయోజనాల కోసం ఈ తిరోగమనవాదులకు లొంగిపోతున్నది. అధికార యంత్రాంగం అభివృద్ధి నిరోధక దృక్పధంతో నిండిపోయినపుడు మైనారిటీలు, ముఖ్యంగా ముస్లీం మైనారిటీల రక్షణకు ఉన్న అవకాశాలేమిటి? మత ఘర్షణలు జరిగినపుడు మైనారిటీలను అణచివేసే విధానాన్ని అనుసరించటంతో గత కొద్ది సంవత్సరాలలో హిందు-ముస్లిం మతోన్మాదాలు పెరుగుతున్నాయి. ఘర్షణల సమయంలో మీరట్, మలియానాలలో సంభవించిన పరిణామాలు దేశభక్తులైన ప్రజలను కలవరపరిచాయి. కాని కాంగ్రెస్ పార్టీ పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు, ఎటువంటి గుణపాఠాలను నేర్చుకోలేదు.

హిందు మతోన్మాదం అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని కనీసం నటించటం కూడా లేదు. దాని పెరుగుదలను అదుపు చేయటం కోసం శక్తివంతమైన చర్యలు తీసుకుంటున్న పరిస్థితీ లేదు. ముస్లీం మైనారిటీ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవటానికి, వాటిని పరిష్కరించటానికి నిజాయితీగా ప్రయత్నాలు చేయటం లేదు. హిందుమతోన్మాదుల వలెనే విదేశీ శక్తుల సహకారంతో, వారి ఆర్థిక మద్దతుతో పనిచేస్తున్న ముస్లీం మతోన్మాదులకు ముస్లీం ప్రజానీకాన్ని అప్పగిస్తున్నారు. రాజ్యాంగం సమానత్వానికి హామి ఇచ్చినప్పటికీ దేశంలో ముస్లీంలు రెండవ తరగతి పౌరులుగా జీవిస్తున్నారన్న వాస్తవాన్ని గుర్తించినట్లైతే, పరిస్థితులను చక్కదిద్దటం కోసం తగిన చర్యలు తీసుకోవటం సులభమౌతుంది. ప్రభుత్వం ఆ విధంగా వ్యవహరించకపోవటం వలన దేశంలోని కష్ట జీవులందరూ అనుభవిస్తున్న నిరుద్యోగం, దరిద్రం లాంటివి తమకు మాత్రమే పరిమితమని వారు భావిస్తున్నారు. రాజకీయాల నుండి మతాన్ని వేరు చేస్తామని ప్రకటించటం, అపుడపుడు జాతీయ ఐక్యత, సమగ్రతలపై ప్రదర్శనలు జరపటం మినహా బూర్జువా-భూస్వామ్య ప్రభుత్వం గత 40 సంవత్సరాలలో ఎటువంటి చర్యలూ తీసుకోకపోవటంతో మైనారిటీలు వేరుపడిపోవటం కొనసాగుతున్నది.

దేశ ఐక్యత, సమగ్రతలకు మతసమస్య ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. దాని ప్రభావాన్ని పరిమితం చేయటానికి, కనీసం హాని లేకుండా చేయటంలో ఐక్య వర్గ ఉద్యమం విఫలం కావటం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. కాంగ్రెస్(ఐ) పార్టీ లేదా పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో సాగటానికి పూనుకున్న ఏ పార్టీ అయినా ఈ సమస్యను పరిష్కరించలేదని, దేశ ఐక్యతను కాపాడలేదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. పరిస్థితి మరింత దిగజారకుండా చూడటం కోసం వామపక్షాలు, ప్రజలు దృఢంగా జోక్యం చేసుకోవలసి ఉంది. సిపిఐ(ఎం), వామపక్షాలకు ప్రజల మద్దతు పెరిగితే ఏమిచేస్తాయో దిగువ ప్రకటన స్పష్టం చేస్తున్నది. 'గత వారాంతంలో కలకత్తాలోని గార్డెన్ రీచ్ ప్రాంతంలోనూ, తర్వాత మాల్డా జిల్లాలోని మనిర్కా ప్రాంతంలోనూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న వేగవంతమైన, నిర్ణయాత్మక చర్యలు దేశంలోని ఉత్తరాది ప్రాంతాలలో సహజమైనవిగా జరుగుతున్న మతోన్మాద విధ్వంసం నుండి రాష్ట్రాన్ని రక్షించాయి. విధ్వంసకారులపై తగిన


epaper.prajasakti.com

చర్యలు తీసుకోవటం, శాంతి భద్రతలను కాపాడటం, బాధితులకు రక్షణ కల్పించటం ద్వారా ఇటువంటి హింసాకాండకు దారితీసే పరిస్థితులను అదుపు చేయటం సాధ్యమౌతుందని వామపక్ష ప్రభుత్వం మరోసారి రుజువు చేసింది. అరాచక పరిస్థితుల వలన ప్రయోజనం పొందేవారు ఇటువంటి చర్యలను విమర్శిస్తున్నప్పటికీ, కావాల్సినది బాధ్యతాయుతంగా ప్రవర్తించే పౌరుల విశ్వాసం మినహా ఇటువంటి అరాచకశక్తుల అభిప్రాయం కాదు. మత సామరస్యాన్ని కాపాడటానికి, బలపరచటానికి వామపక్ష ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రభుత్వ యంత్రాంగం శ్రద్ధ పెట్టటంతో దాని ప్రతిష్ఠ పెరుగుతున్నది. ఈ విధమైన నిర్మాణాత్మక చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని రామజన్మభూమి/బాబ్రీ మసీదు వివాదం విషయంలో మరోసారి స్పష్టమైంది. ఉత్తరప్రదేశ్, ఇతర రాష్ట్రాలలో ఘర్షణలు జరుగుతున్నపుడు పశ్చిమ బెంగాల్‌లో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. ఢిల్లీ, మీరట్‌లలో ఈ సంవత్సరం జరిగిన కొట్లాటల ప్రభావం బెంగాల్‌పై పడలేదు. వామపక్ష ప్రభుత్వం లౌకిక సూత్రాలకు కట్టుబడి ఉండటం మతపరమైన విభజనను నివారించింది' (స్టేట్స్‌మెన్, సెప్టెంబరు 10 సంపాదకీయం).

రాజీవ్‌గాంధి ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నదని ఆగస్టు 10వ తేదీన జరిగిన సిపిఐ (ఎం) కేంద్రకమిటీ సమావేశం పేర్కొంది. తనకు ముందున్న నాయకులు పెట్టుబడిదారి మార్గాన్ని ఎంచుకోవటం వలన సంభవిస్తున్న పరిణామాల ఫలితం తన పాలనలో శిఖర స్థాయికి చేరటం రాజీవ్‌గాంధి దురదృష్టం. భారతదేశంలో విభిన్నమైన భాషలతో కూడిన జాతులు ఉండటాన్ని గుర్తించటంలో విఫలం కావటం, పురోగమనం, అభివృద్ధికి సంబంధించి అందరికీ న్యాయం జరుగుతున్నదన్న భావన కల్పించటంలో ఉన్న ప్రాధాన్యతను గుర్తించకపోవటం, ఈ అంశాలపై సమగ్రమైన చర్యలు తీసుకోవటంలో విఫలం కావటాన్ని విదేశీ, సామ్రాజ్యవాద సంస్థల ఆర్థిక సహకారం, ప్రోత్సాహం అందుకుంటున్న వేర్పాటువాద సంస్థలు ఉపయోగించుకుంటున్నాయి. ఫలితంగా 40వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో దేశం తీవ్రమైన వేర్పాటువాద ప్రమాదాన్ని ఎదుర్కుంటున్నది. భారతదేశం తిరిగి చీలిపోతుందని, దేశం నుండి పంజాబ్ వేరుపడుతుందని, ఈశాన్య ప్రాంతంలో అస్సాం, డార్జిలింగ్‌లలో నిర్ణాయకమైన శక్తులుగా వేర్పాటువాదులున్నారని అమెరికా ప్రభుత్వంలోని కొన్ని తరగతులు భావిస్తున్నాయి. అస్సాంలో రాజీపడినప్పటికీ వేర్పాటువాద శక్తుల కార్యకలాపాలు అవిచ్ఛిన్నంగా సాగుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రాలు కావాలన్న వేర్పాటువాద డిమాండ్లు పెరుగుతున్నవి. పంజాబ్‌లో ఖలిస్థాన్ టెర్రరిస్టుల సాయుధ పోరాటం మూడు సంవత్సరాలకు పైగా కొనసాగింది. నూతనంగా విముక్తి పొందిన అనేక దేశాలు ఇటువంటి సవాళ్ళను ఎదుర్కున్నాయి. వీటికి అనేకదేశాలు తలవంచాయి. ఇటువంటి శక్తుల నుండి దేశ సమగ్రత, సమైక్యతలను పరిరక్షించుకోవటంలో విఫలమైతే అది భారతప్రజలకు అత్యంత అవమానకరంగా ఉంటుంది.

### దేశం విచ్ఛిన్నమయే ప్రమాదం

కాంగ్రెస్(ఐ) పార్టి, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చూస్తే దేశం విచ్ఛిన్నమయే ప్రమాదాన్ని ఎదుర్కుంటున్నదన్న విషయం వారే మాత్రం గుర్తించలేదని స్పష్టమౌతున్నది. అస్సాంలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్న ఆపరేషన్ బ్రహ్మపుత్ర వెనుక అమెరికా ప్రభుత్వ సంస్థలు ఉన్నాయని, వారు ఆ ఉద్యమానికి ఆర్థిక సహాయం చేస్తున్నారని స్పష్టమౌతున్నది. ఖలిస్థాని ఉద్యమకారులకు పాకిస్తాన్‌లో సైనిక శిక్షణ ఇస్తున్న సిఐఎ వారికి ఆర్థిక సహాయంతో పాటు ఆయుధాలు కూడా అందిస్తున్నది. ఈశాన్యపాంతంలోని చర్చి నిర్వాహకులు బహిరంగంగా వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఐక్యతను విచ్ఛిన్నం చేసి, దేశాన్ని విభజించటం కోసం సామ్రాజ్యవాద శక్తులు దేశ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్నాయి.

తీవ్రమౌతున్న ఈ ప్రమాదం గురించి ప్రజలలో ఏమైనా జాగరూకత ఉన్నదా? భారతదేశానికి వ్యతిరేకంగా జరుగుతున్న వేర్పాటువాద కుట్రలను పాలకపార్టి, బూర్జువా ప్రతిపక్ష పార్టీలు అరుదుగా మాత్రమే సామ్రాజ్యవాదులతో ముడిపెడుతున్నాయి. పాలకపార్టీ విదేశీ హస్తం గురించి అపుడపుడు ప్రస్తావిస్తున్నది. సామ్రాజ్యవాదులకు వీటితో సంబంధం ఉన్నదని చెప్పటానికి బూర్జువా ప్రతిపక్ష పార్టీలు అంగీకరించవు. ఉభయులూ దీనిని కేవలం శాంతి, భద్రతల సమస్యగా మాత్రమే పరిగణిస్తున్నారు. పంజాబ్ పరిణామాలను మతపరమైన సమస్యగా చూస్తున్నారు. పంజాబ్ అయినా, అస్సాం అయినా, డార్జిలింగ్ అయినా వేర్పాటువాదులను ప్రజల నుండి వేరు చేయటం కోసం సైద్ధాంతిక, రాజకీయ పోరాటం నిర్వహించాలన్న వాస్తవాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే విస్మరిస్తున్నారు. ఈ రాష్ట్రాలలోని జాతి వ్యతిరేక శక్తులతో రాజకీయ పోరాటం చేయాలని కాంగ్రెస్ (ఐ)గాని, ఇతర పార్టీలు కాని తమను అనుసరించే ప్రజలకు చెప్పటం లేదు. పంజాబ్‌లో సిపిఐ(ఎం), సిపిఐ ఈ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. అస్సాం, డార్జిలింగ్‌లలో సిపిఐ(ఎం) మాత్రమే పోరాటం చేస్తున్నది. అస్సాం, పంజాబ్‌లలోని కార్మికులు చేస్తున్న విధంగానే డార్జిలింగ్‌లో సిపిఐ(ఎం), సిఐటియు నాయకత్వంలో పనిచేస్తున్న టీ తోటలలోని కార్మికులు దేశ ఐక్యతను కాపాడటం కోసం ధైర్య, సాహసాలతో పోరాడుతున్నారు.

40 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాతి పరిస్థితులను అంచనా వేయటానికి, అర్థం చేసుకోవటానికి సానుకూల, ప్రతికూల అంశాలన్నింటినీ పరిశీలించటం అవసరం. భారతదేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటం, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగించటం, జాతీయ ప్రణాళికా విధానం, సోవియట్ ప్రభుత్వ సహకారంతో అనేక వ్యూహాత్మక పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవటం మన ఆర్థికవ్యవస్థ పశ్చిమదేశాల

> “ కాంగ్రెస్(ఐ) పార్టి, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చూస్తే దేశం విచ్ఛిన్నమయే ప్రమాదాన్ని ఎదుర్కుంటున్నదన్న విషయం వారే మాత్రం గుర్తించలేదని స్పష్టమౌతున్నది. అస్సాంలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్న ఆపరేషన్ బ్రహ్మపుత్ర వెనుక అమెరికా ప్రభుత్వ సంస్థలు ఉన్నాయని, వారు ఆ ఉద్యమానికి ఆర్థిక సహాయం చేస్తున్నారని స్పష్టమౌతున్నది. ”



epaper.prajasakti.com

“ ప్రతికూలమైన, ప్రమాదకరమైన రెండవ అంశం ప్రజాస్వామ్యానికి సంబంధించినది. అధికారికంగా పార్లమెంటరీ విధానం కొనసాగుతున్నప్పటికీ పౌరహక్కులపై దాడి జరుగుతున్నది. సమ్మెలను అణచివేస్తున్నారు. గ్రామాలలో ఉంటున్న సామాన్య ప్రజలకు హక్కులు గాని, న్యాయం కాని అందటం లేదు. పోలీసులు చేసున్న దౌర్జన్యాలు, హత్యల నుండి రక్షణ లేదు. ”

సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలోకి వెళ్ళకుండా నివారించటానికి తోడ్పడింది. అపుడపుడూ కుదుపులు, దాడులకు గురైనప్పటికీ పార్లమెంటరీ విధానం, వయోజన ఓటింగు హక్కు, ఎన్నికలు, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పెద్దశక్తులతో ఉన్న సైనిక కూటములలో చేరటానికి భారతదేశం తిరస్కరించింది.

ఈ విధమైన సానుకూల అంశాలు ఉన్నప్పటికీ 40 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులలో ఉన్నది. మొదటగా జాతీయ ప్రణాళికా విధానం, వరుసగా అమలుచేస్తున్న పంచవర్ష ప్రణాళికలు మన ఆర్థికవ్యవస్థ సామ్రాజ్యవాదులకు లొంగిపోవటాన్ని నివారించినప్పటికీ, మన ప్రజలపై పెద్ద భారాలను మోపింది. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో సాగటం కోసం రూపొందించిన ఈ ప్రణాళికా విధానంలో పారిశ్రామికాభివృద్ధి నిదానంగా సాగటం ప్రజల సమస్యలు, బాధలను తీవ్రం చేసింది. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో సాగుతున్నపుడు ఫ్యూడల్ భూ సంబంధాలను పూర్తిగా నిర్మూలించి, రైతాంగానికి స్వేచ్ఛ కల్పించాల్సిన అవసరం ఉండదు. భారతదేశ రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనం సేచ్ఛగా జీవించే రైతులు, కూలీల కన్నా కట్టుబానిసలకు దగ్గరగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో నాలుగు కోట్లమంది నిరుద్యోగులున్నారని అంచనా వేశారు. కంపెనీలను మూసివేయటం, లాకౌట్‌లు, ఉద్యోగాల నుండి సామూహికంగా తొలగించటం, నిరుద్యోగం తదితరాలను కార్మికవర్గం ఎదుర్కొంటున్నది.

రాజీవ్‌గాంధీ అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాలు ప్రభుత్వరంగాన్ని రద్దుచేసి, బహుళజాతి కంపెనీలను బహిరంగంగా ఆహ్వానించటానికి, ఆర్థికవ్యవస్థ స్వయం సమృద్ధిని దెబ్బతీసి, విదేశీ పెట్టుబడుల దోపిడీకి మార్గం సుగమం చేయటానికి, విదేశీ ఆధిపత్యానికి దారితీస్తాయి. ఈ విధానాలను మార్చుకోకపోతే మన అలీన విదేశాంగ విధానం నిరంతరం ఒత్తిళ్ళను ఎదుర్కొంటుంది.

ప్రతికూలమైన, ప్రమాదకరమైన రెండవ అంశం ప్రజాస్వామ్యానికి సంబంధించినది. అధికారికంగా పార్లమెంటరీ విధానం కొనసాగుతున్నప్పటికీ పౌరహక్కులపై దాడి జరుగుతున్నది. సమ్మెలను అణచివేస్తున్నారు. గ్రామాలలో ఉంటున్న సామాన్య ప్రజలకు హక్కులు గాని, న్యాయం కాని అందటం లేదు. పోలీసులు చేసున్న దౌర్జన్యాలు, హత్యల నుండి రక్షణ లేదు. ఒకదాని తర్వాత ఒకటిగా పార్లమెంటరీ విధానం, ప్రజాస్వామిక సూత్రాలపై దాడులు జరుగుతున్నాయి. పోలీసుల దౌర్జన్యాలను, ఉన్నతాధికారుల అవినీతిని వెలికితీస్తున్న విలేకరులు అరెస్టులు, వేధింపులు, చివరికి హత్యలకు గురయే ప్రమాదాన్ని కూడా ఎదుర్కొంటున్నారు. సామాన్య ప్రజలు పై నుండి కింది వరకు అవినీతి సమస్యను ఎదుర్కొంటున్నారు. రాజీవ్‌గాంధి ప్రభుత్వంలో జరిగిన అవినీతి కుంభకోణాలు కాంగ్రెస్(ఐ), ఆ పార్టీ ప్రభుత్వాన్ని పూర్తిగా ఎండగట్టాయి. అధికార పార్టీ కేంద్రంలో అన్ని అధికారాలను కేంద్రీకరించుకుని, సమాఖ్య రాజ్యాంగాన్ని ఫార్సుగా దిగజార్చింది. గవర్నర్లు ఎన్నికైన ప్రభుత్వాలను నిరంకుశంగా రద్దు చేస్తున్నారు. కాంగ్రెస్‌తో పోరాటం చేస్తున్న కొన్ని ప్రతీఘాతుక పార్టీలు తమ సంకుచిత ప్రయోజనాల కోసం ఇటువంటి అధికారాలను రాష్ట్రపతికి ఇవ్వాలని కోరుతున్నాయి. పెట్టుబడిదారీ విధానం కారణంగా రాజ్యాంగం, పార్లమెంటరీ విధానంపై నిరంతరం దాడులు జరుగుతాయని అత్యవసర పరిస్థితిని విధించటం భారత ప్రజలను హెచ్చరిస్తున్నది. ఈ హెచ్చరిక వాస్తవమైంది. న్యాయవ్యవస్థను ముఖస్తుతి చేసేవారితో నింపటానికి, దాని స్వాతంత్ర్యాన్ని హరించటానికి ప్రతిరోజూ దాడులు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు, పోలీసులు తరచుగా కోర్టుల ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు. అధికార యంత్రాంగం క్రమంగా నిర్వీర్యం అవుతున్నది. జైళ్ళు అవినీతి, అక్రమాలకు కేంద్రాలుగా మారాయి. అక్రమాలను ప్రశ్నించేవారికి రక్షణ లేకుండాపోయింది. పెట్టుబడిదారులు, భూస్వాముల ప్రయోజనాలను రక్షించటం కోసం పాలకపార్టీ పార్లమెంటరీ, ప్రజాస్వామిక సూత్రాలను ఉల్లంఘిస్తున్నది. ఈ మధ్య రాష్ట్రపతి, ప్రధానికి మధ్య వివాదం జరిగినపుడు ఈ విషయం వెల్లడైంది. ఈ వర్గ కూటమిలో పెద్ద పోరాటం జరుగుతున్నది. భూస్వామ్యవర్గం బలపడి, మరింత అధికారం కోసం పోరాడుతున్నది.

దీనితోపాటు 40 సంవత్సరాల జాతీయ సమైక్యతా రికార్డు మరింత ప్రమాదకరంగా ఉన్నది. శతాబ్దానికి పైగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో భారత ప్రజలు అనేక బలిదానాల ద్వారా ఐక్యతను రక్షించుకుని, మరింతగా పెంపొందించారు. భారత ప్రజల ఐక్యత ముందు బ్రిటిష్ పాలకులు తలవంచి, దేశం వదిలిపోయారు. ఆ విధంగా సాధించిన ఐక్యత కాంగ్రెస్ పాలనలో బలహీనపడింది. బ్రిటీష్ వారు దేశాన్ని వదిలిపోయేటపుడు విభజన చేయటం ద్వారా దేశ ఐక్యతపై దెబ్బకొట్టారు. దేశ ఐక్యతకు ఇకముందు ప్రమాదం రాదని అపుడు భావించారు. ఈ రోజు మతం, భాష, ప్రాంతం పేరుతో విస్తారమైన ప్రజానీకాన్ని తమ వెనుక సమీకరించుకుంటూ, విచ్ఛిన్నకర, వేర్పాటువాద, పాక్షిక ప్రయోజనాలను సాధించాలనుకుంటున్న వారు దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారు. పంజాబ్‌లో ఖలిస్థానీ ఉద్యమం, డార్జిలింగ్‌లో గూర్ఖాలాండ్ ఉద్యమం, అస్సాంలో వేర్పాటువాద ఉద్యమం దేశ ఐక్యతకు సవాలు విసురుతున్నాయి. వీటితో పాటుగా పెరుగుతున్న హిందూ, ముస్లిం మతోన్మాదాలు, షాబానో కేసు, బాబ్రిమసీదు/రామ జన్మభూమి లాంటి సమస్యలతో దేశ ఐక్యతపై దాడి చేస్తున్నారు. అమెరికన్ ప్రభుత్వ సంస్థలు ఈ ఆందోళనలన్నింటికీ ఆర్థిక సహకారం అందిస్తున్నాయి. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో పయనిస్తున్న బూర్జువా-భూస్వామ్య కూటమి, కాంగ్రెస్(ఐ) ప్రభుత్వం 40


epaper.prajasakti.com

సంవత్సరాల పాలన లాభ నష్టాల జాబితా ఇది.

**వామపక్ష, ప్రజాస్వామిక శక్తుల చారిత్రక బాధ్యత**

బూర్జువా-భూస్వామ్య వర్గాల పాలనలో సంభవిస్తున్న ప్రతికూల పరిణామాలను ఎదుర్కోవటానికి, భారతదేశ ఐక్యతను బలహీనపరుస్తున్న విధానాలను ఓడించటానికి ఈ కాలంలో వామపక్ష, ప్రజాస్వామిక శక్తులు నిరంతరం పోరాడాయి. వీటితో పాటు ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాపాడటానికి, ఆర్థికంగా వారి స్థితిగతులను మెరుగు చేయటానికి అనేక విజయవంతమైన పోరాటాలు కూడా చేశాయి. అత్యవసర పరిస్థితి పాలనను ఓడించటం ప్రజాస్వామిక, ప్రజాశక్తుల ఐక్యతలో అత్యంత ముఖ్యమైన విజయం.

అయినప్పటికీ అనైక్యత, అస్థిర పరిస్థితులు, మతశక్తులు, ఆర్థిక సమస్యలను తీవ్రం చేస్తున్న విధానాలను ప్రజాశక్తులు నివారించలేకపోయాయని స్పష్టమౌతున్నది. ఈ అంశాలలో బూర్జువా ప్రతిపక్ష పార్టీల బలహీనతలు వెల్లడౌతున్నాయి. అస్థిర పరిస్థితులు, మతోన్మాదం, విదేశాంగ విధానాలకు సంబంధించి వారికి సరైన అవగాహన, దృక్పథం లేవు. మన విదేశాంగ విధానంలో పశ్చిమ దేశాల వైపు మొగ్గు ఉండాలని వారిలో కొందరు భావిస్తున్నారు. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరచటం, రద్దు చేయాలన్న విషయంలో దాదాపుగా అందరూ మౌనంగా ఉంటున్నారు. జాతీయ సమైక్యతను రక్షించాలన్న ప్రధానాంశంపై వారందరూ నిలకడ లేని వైఖరిని తీసుకుంటున్నారు.

కాబట్టి సిపిఐ(ఎం), వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు చాలా గొప్ప బాధ్యతను నిర్వహించాల్సి వుంది. దేశాన్ని ఎదుర్కుంటున్న సమస్యలపై వారికి సరైన అవగాహన ఉంది. ప్రతీఘాతుక శక్తులతో పోరాడటంలోనూ, సామ్రాజ్యవాద సవాలును ఎదుర్కోవటంలోనూ, పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో ప్రయాణించటం వలన సంభవిస్తున్న పరిణామాలను, రాజీవ్‌గాంధి ప్రభుత్వం, కాంగ్రెస్(ఐ) పార్టి విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు జాతీయ రాజకీయాలలో పెరుగుతున్న వామపక్షాల బలం, పలుకుబడి సహాయపడతాయి. తక్షణ పరిస్థితులను ఎదుర్కోవటం, పాలక పార్టీని ఒంటరి చేసి ఓడించటం కోసం సిపిఐ(ఎం), వామపక్షాలు లౌకిక ప్రతిపక్ష పార్టీలతో ఉమ్మడి అవగాహన, కార్యాచరణకు పూనుకోవాలి. ఇది అత్యవసర కర్తవ్యం. ఆ విధమైన లౌకికవాద కూటమి ప్రజలు మతోన్మాద శక్తులతో పోరాడటానికి ప్రోత్సాహమిస్తుంది. అందరితో కలిసి కూటమిగా ఏర్పడటం ప్రతిపక్ష పార్టీలకు ఉన్న లౌకికవాద ముద్రను తుడిచివేసి, ప్రజల మధ్య విభజన సృష్టించటానికి ప్రతీఘాత శక్తులకు అవకాశం కల్పిస్తుంది. అయినప్పటికీ కొందరు అవకాశవాద బూర్జువా నాయకులు ఇటువంటి ప్రతీఘాతుక కూటమిని ఏర్పాటు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

> **“ ఆ విధమైన లౌకికవాద కూటమి ప్రజలు మతోన్మాద శక్తులతో పోరాడటానికి ప్రోత్సాహమిస్తుంది. అందరితో కలిసి కూటమిగా ఏర్పడటం ప్రతిపక్ష పార్టీలకు ఉన్న లౌకికవాద ముద్రను తుడిచివేసి, ప్రజల మధ్య విభజన సృష్టించటానికి ప్రతీఘాత శక్తులకు అవకాశం కల్పిస్తుంది. అయినప్పటికీ కొందరు అవకాశవాద బూర్జువా నాయకులు ఇటువంటి ప్రతీఘాతుక కూటమిని ఏర్పాటు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ”**

రాజీవ్‌గాంధి రాజీనామా చేయాలని, ప్రభుత్వం జోక్యం చేసుకుని కరువుకు గురైన ప్రజలకు సహాయం అందించటం కోసం ఆర్థిక విధానాలను మార్చాలని, జాతీయ సమైక్యతను పరిరక్షించాలని, ప్రజల తక్షణ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న సమైక్య ప్రచారం, పోరాటం నూతన ప్రజాశక్తులను రంగంలోకి తీసుకువచ్చి, ప్రజాతంత్ర ఉద్యమం ముందుకుపోవటానికి దోహదం చేస్తాయి. విస్తారమైన ప్రజల చైతన్యంలో మార్పు రావటానికి, ముఖ్యంగా మైనారిటీలలో విశ్వాసం పెరగటానికి ఈ పోరాటం దోహదం చేస్తుంది.

కాని దేశాన్ని పట్టిపీడుస్తున్న చెడుగులు, అది ఎదుర్కుంటున్న ప్రమాదాలపై పోరాడటం కోసం ప్రజల చైతన్యం, వారి భౌతిక పరిస్థితులలోనూ బూర్జువా పార్టీల దృక్పథాన్ని అధిగమించే తీవ్రమైన మార్పులు రావలసి ఉంది. వామపక్షాలు ఈ అంశాలపై స్వతంత్ర చొరవతో పోరాటాలు నిర్వహించాలి. వామపక్షాల ఐక్యత, నిరంతరం చొరవతో కార్యకలాపాలు కొనసాగించటం, వామపక్షాల స్వతంత్ర కార్యక్రమాలు ప్రస్తుత ప్రమాదాలను ఎదుర్కొని పోరాడటంలో అత్యంత ప్రధానమైనవి.

భౌతిక పరిస్థితులను ఎదుర్కోవటానికి అవసరమైనంతగా కమ్యూనిస్టు ఉద్యమం, వామపక్ష శక్తుల పెరుగుదల లేనప్పటికీ, సిపిఐ(ఎం) చేస్తున్న పోరాటాలు, బలిదానాలు, ప్రజల సమస్యలపై వామపక్ష పార్టీలు చేస్తున్న పోరాటాలు ఇప్పటి వరకు ఈ పార్టీల పలుకుబడికి దూరంగా ఉన్న ప్రజలను ప్రభావితం చేయటానికి దోహదం చేస్తాయి. పశ్చిమబెంగాల్, త్రిపురలలో కాంగ్రెస్(ఐ) వరుసగా ఓటమి చెందటం, 1987లో కేరళలో సిపిఐ(ఎం) నాయకత్వంలో వామపక్ష సంఘటన విజయం సాధించటం, వామపక్ష ప్రభుత్వాల పనితీరు విస్తారమైన ప్రజల మన్ననలు పొందుతున్నాయి. వామపక్ష ప్రభుత్వాలు జాతీయ సమైక్యత కోసం దేశ వ్యతిరేకశక్తులతో పోరాడుతున్న తీరును మిత్రులతో పాటు శత్రువులు కూడా అభినందిస్తున్నారు. ప్రస్తుత దేశ రాజకీయాలలో వామపక్షాలు కీలకమైన స్థానాన్ని ఆక్రమించాయి. భారతదేశ ప్రజాస్వామ్యం, ఐక్యత పరిరక్షణలో వామపక్ష ప్రభుత్వాలు అగ్రస్థానంలో ఉన్నాయని భావిస్తున్నారు.

ఈ సవాళ్ళను ఎదుర్కోవాల్సిన చారిత్రక కర్తవ్యం వామపక్ష, ప్రజాస్వామిక శక్తులపై ఉన్నది. ప్రజలకు తమపై పెరుగుతున్న నమ్మకాన్ని ఆయుధంగా చేసుకుని, తమ నాయకత్వంలోని ప్రజాసంఘాల పెరుగుతున్న బలాన్ని తోడు చేసుకుని, సరైన అవగాహనతో, ప్రతిదశలోనూ లౌకికశక్తులను ఐక్యం చేయాల్సిన కర్తవ్యాన్ని నెరవేర్చగల స్థితిలో వామపక్షాలు ఉండాలి. ఏ దశలోనూ పరిస్థితులపై తమకున్న పట్టు కోల్పోకూడదు.

మన ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయటంలో వామపక్షాలకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ(ఎం)పై ప్రత్యేకమైన బాధ్యత ఉన్నది. జాతీయ సమైక్యత కోసం పోరాడుతూ పంజాబ్, అస్సాం, త్రిపుర, డార్జిలింగ్ జిల్లాలో చేస్తున్న బలిదానాల ద్వారా

(మిగతా 34వ పేజీలో)



epaper.prajasakti.com

ఈ మాసం ప్రత్యేకం

# గోథా కార్యక్రమం మార్క్స్ విశ్లేషణ



రచయిత డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు

వై.రాము

మార్క్స్ ప్రాసంగిక రచనల్లో "గోథా కార్యక్రమంపై విమర్శ'' ఒకటి. గోథా కార్యక్రమంలో ఉన్న లోపాలను, ముఖ్యంగా లాసాల్‌వాదం, అది అనుసరిస్తున్న ఆర్థిక సూత్రీకరణల పట్ల మార్క్స్ తన వైఖరిని స్పష్టంగా వ్యక్తపరిచాడు. ఇది పూర్తిగా కార్మికవర్గ సిద్ధాంతం నుండి ప్రక్కదారి పట్టించే విధంగా ఉందని విమర్శించాడు. మార్క్స్, ఏంగెల్స్‌ల చే విమర్శలకు గురైన గోథా కార్యక్రమం గురించి తెలుసుకోవాలంటే దాని నేపథ్యాన్ని పరిశీలించాలి.

**గోథా కార్యక్రమం నేపథ్యం :**

జర్మన్ కార్మికవర్గ ఉద్యమం పై మార్క్స్, ఏంగెల్స్‌లు ప్రత్యేకమైన దృష్టి పెట్టారు. ఉద్యమం విప్లవకర మార్గంలో సాగాలని ఆకాంక్షించారు. అయితే జర్మన్ కార్మికవర్గ ఉద్యమంలో రెండు ధోరణులు తలెత్తాయి. అవి ఒకటి 1963వ సంవత్సరంలో ఏర్పడిన జనరల్ అసోసియేషన్ ఆఫ్ జర్మన్ వర్కర్స్ సంస్థ, రెండవది 1969వ సంవత్సరం ఐసినార్ పట్టణంలో ఏర్పడిన సోషల్ డెమోక్రటిక్ పార్టీ. లాసాల్ నాయకత్వాన జనరల్ అసోసియేషన్ ఆఫ్ జర్మన్ వర్కర్స్ సంస్థ పని చేస్తున్నది. లాసాల్ సూత్రీకరణలు, ప్రతిపాదనలనే లాసాల్‌వాదం అంటారు. మరోవైపు మార్క్స్ సన్నిహితుడైన కార్ల్ లిబ్‌క్నెఖ్ట్ సోషల్ డెమోక్రటిక్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నాడు. అయితే ఈ రెండు కార్మిక సంస్థలు విలీనం కావాలని భావించాయి. ఈ నేపథ్యంలోనే జర్మనీలోని గోథా ప్రాంతంలో 1875 సంవత్సరంలో మే 22-27వ తేదీలలో జరిగిన మహాసభలో "ఐక్య జర్మనీ సోషలిస్టు కార్మిక పార్టీ" గా ఏర్పాడ్డాయి. ఈ మహాసభలో చర్చించడానికి రూపొందించిన ముసాయిదానే "గోథా కార్యక్రమం".

**మార్క్స్ ఎందుకు రాయాల్సి వచ్చింది :**

గోథా ముసాయిదా కార్యక్రమంలో తీవ్రమైన పొరపాట్లు ఉన్నాయనేది మార్క్స్ అభిప్రాయం. మార్క్స్ ని సంప్రదించకుండానే ఐసెనార్ల బృందం లాసాలియన్ పార్టీతో విలీనానికి ముందుకు వెళ్ళింది. ఈ విలీన మహాసభ కోసం రూపొందించిన ముసాయిదాను ఐసెనార్ బృంద సభ్యుడు బ్రాకే లేఖ ద్వారా మార్క్స్‌కి పంపించాడు.

బ్రాకే పంపిన ముసాయిదాను అధ్యయనం చేసిన మార్క్స్ దాని అంతర్గత స్వభావాన్ని బహిర్గతం చేస్తూ ఈ రచన చేశాడు. ఈ కార్యక్రమం లాసాల్‌వాదాన్ని తలకెత్తుకుందని, కార్మిక సంస్థలు రెండూ విలీనం అవ్వటం ప్రత్యేకమైన అంశమయినా ఇది శాశ్వతం కాదన్నాడు. ఈ విలీనం కార్మికవర్గ సిద్ధాంత పునాదిపై జరగాలి కాని వర్గ సంకర, కార్మిక వ్యతిరేక సూత్రీకరణల పై కాదని గట్టిగా వాదించాడు. ఈ ఐక్యత ఎక్కువ కాలం నిలబడదన్నాడు. విలీనం అనేది కార్మికులకు సంతోషం కలిగించే అంశం అయినప్పటికి జర్మన్ కార్మిక సమాజం అత్యధిక మూల్యం చెల్లించాల్సి ఉంటుందని మార్క్స్ అభిప్రాయం. లాసాల్ సూత్రీకరణల మనుగడ కోసమే లాసాల్‌వాదులు విలీనం కోసం పదేపదే వెంటపడుతున్నారని అర్థం చేసుకోవాలని మార్క్స్ చెప్పాడు.

**లాసాల్‌వాదం అంటే ఏమిటి ?**

లాసాల్ గొప్ప వక్త, తన వాదనలతో, మాటల గారడితో కార్మికులను ఆకర్షించగలిగాడు. జనరల్ అసోసియేషన్ ఆఫ్ జర్మన్ వర్కర్స్ సంస్థను 1863 సంవత్సరంలో మే 23వ తేదిన స్థాపించాడు. వర్కర్స్ సంస్థను పునాది స్థాయి నుండి నిర్మించడంలో కీలకపాత్ర వహించాడు. 1863 సంవత్సరం ఆగష్టు నాటికి 900 సభ్యత్వంతో ఉన్న వర్కర్స్ సంస్థ ఒక్క సంవత్సరకాలంలోనే 4,600 సభ్యత్వానికి చేరుకొంది. ఈ సంస్థ భావజాల పరంగా సోషలిస్టు రూపంలో కనిపించడంతో వర్కర్స్‌ని ఆకర్షించగలిగింది. కానీ లాసాల్ సూత్రీకరణలు బూర్జువా చట్రం పరిధిలోనే ఉన్నాయి. 1864 సంవత్సరంలో లాసాల్ మరణానంతరం ఆయన అనునయులు కూడా ఇదే పద్ధతిని కొనసాగించారు.

**కార్యక్రమం పై మార్క్స్ విశ్లేషణ :**

మార్క్స్ ఈ ముసాయిదాను నాలుగు విభాగాలుగా వివరించి విశ్లేషించాడు. తన విశ్లేషణను "శ్రమయే సమస్త సంపదలకు, సకల సంస్కృతికి మూలాధారం'' అనే వాఖ్యలతో ప్రారంభించాడు. 4 విభాగాలకి సంబంధించి,

మొదటి విభాగంలో

1.శ్రమ - సంపద

2.శ్రమ సాధనాలు-భూస్వాములను విస్మరించిన లాసాల్

3.శ్రమ యొక్క ఆదాయం - న్యాయమైన పంపిణి

4.కార్మికవర్గ కర్తవ్యం - అభివృద్ధి నిరోధక సమూహం

5.కార్మిక వర్గం - వర్తమాన జాతీయ రాజ్య వ్యవస్థ

రెండవ విభాగంలో వేతన వ్యవస్థ రద్దు

మూడవ విభాగంలో సామాజిక సమస్య పరిష్కారం - ప్రభుత్వ సహాయం

నాల్గవ విభాగంలో స్వేచ్ఛయుత రాజ్యం - అసమానతల రద్దు అంశాలపై చర్చించాడు.

**మొదటి విభాగం:**

**1.శ్రమ - సంపద:**

శ్రమ గురించి వివరిస్తూ శ్రమ మాదిరిగానే ప్రకృతిని కూడా ఉపయోగపు విలువల మూలధారం అని చెప్పవచ్చు. ఎందుకంటే శ్రమ అనేది ప్రకృతి యొక్క



epaper.prajasakti.com

ఒకానొక శక్తి, మానవ శ్రమ శక్తికి వ్యక్తీకరణ. పెట్టుబడిదారులు శ్రమకు కృతకమైన అర్థాన్ని ఆపాదిస్తున్నారు. అది మానవాతీతమైన సృజనశక్తిలా పేర్కొంటున్నారు. పెట్టుబడిదారులు ఉద్దేశపూర్వకంగానే ఈ వాదన చేస్తున్నారని మార్క్స్ స్పష్టం చేశాడు. ఎందుకంటే ? శ్రమ ప్రకృతిపై ఆధారపడుతుంది కనుక, శ్రమశక్తి తప్ప మరే ఇతర ఆస్తీలేని మనిషి సమాజం, సంస్కృతికి సంబంధించిన వాటిపై ఆధిపత్యం చెలాయించే వారికి బానిసలు కావాలన్నదే వారి ఉద్దేశ్యం. దీనికి సంబందించి సకల సంపదలకు శ్రమయే మూలాధారం, శ్రమలేనిదే సమాజమే లేదనేది. కాని దీనికి విరుద్ధంగా సమాజం లేనిదే శ్రమ లేదనే విరుద్ధ అంశాన్ని ఈ ముసాయిదా ప్రస్తావిస్తున్నది.

"కార్మికవర్గం మినహా మిగతా వర్గాలన్నీ అభివృద్ధి నిరోధక సమూహం" గా వర్ణించారు. కాని కమ్యూనిస్టు ప్రణాళిక చెప్పిన దాని ప్రకారం "ఈనాడు బుర్జువా వర్గానికి ముఖా ముఖిగా నిలిచిన వర్గాలన్నింటిలోకి శ్రామికవర్గం ఒక్కటే నిజమైన విప్లవ వర్గం తక్కిన వర్గాలన్ని ఆధునిక పరిశ్రమల ప్రభావం వల్ల క్షీణించి చివరకు అదృశ్యమవుతాయి. శ్రామికవర్గంఆధునిక పరిశ్రమల ప్రత్యేక సృష్టి".

**2. శ్రమ సాధనాలు - భూస్వాములను విస్మరించిన లాసాల్:**

"వర్తమాన సమాజంలో శ్రమ సాధనాలు పెట్టుబడిదారీ వర్గపు గుత్తాధిపత్యంలో ఉన్నాయి. తత్పర్యవసానంగా ఏర్పడిన కార్మికవర్గ పరాధీనతే అన్ని రూపాల దైన్యదాసత్వాలకి కారణం".

వర్తమాన సమాజంలో శ్రమ సాధనలు (ఉత్పత్తి సాధనాలు) అనేవి పెట్టుబడిదారులతో పాటు భూస్వాములు చేతిలో కూడా ఉన్నాయి. కానీ భూస్వాములను ఈ ముసాయిదా విస్మరించింది. దీనికి లాసాల్ ప్రతిపాదనలే కారణం. శ్రమ సాధనాలలో భూమి కూడా ఉందనేది కీలకమైన విషయం. లాసాల్ గుత్తాధిపత్యం విషయంలో పెట్టుబడిదారుల పైనే దాడి చేసన్నా భూస్వాములను విస్మరించాడు.

**3. శ్రమ యొక్క ఆదాయం - న్యాయమైన పంపిణి :**

"శ్రమ యొక్క ఆదాయం" అంటే ఏమిటి? అది శ్రమ యొక్క ఉత్పాదితమా? లేక దాని విలువా? ఇవి ఏవీ వివరించకుండా శ్రమ యొక్క ఆదాయం అంశాన్ని అస్పష్టంగా వదిలేశారు ఇవేమి వివరించలేదు. ఈ విషయాలు అస్పష్టమైన అభిప్రాయాలుగా మిగిలిపోయాయి. అదే విధంగా " న్యాయమైన పంపిణి"కి సంబంధించి ప్రస్తుతం చలామణిలో ఉన్న పంపిణి న్యాయమైనదని, సమానమైనదని బుర్జువాలు బలంగా చెబుతున్నారు. కాస్త లోతుగా ఆలోచిస్తే ఆర్థిక సంబంధాలు చట్ట సంబంధమైన భావాల చేత నియంత్రించబడతాయా? లేక దానికి విరుద్ధంగా చట్ట సంబంధమైన అంశాలే ఆర్థిక సంబంధాలను నియంత్రిస్తాయా? ఈ విషయాలు అర్థం చేసుకోవాలంటే మరో అంశమైన "శ్రమ యొక్క ఆదాయం తగ్గింపు లేకుండా సమాన హక్కులతో సమాజ సభ్యులందరికీ చెందుతుంది" అనే ప్రస్తావనని పరిశీలించాలి. ఇందులో శ్రమ చేయని వారికి కూడా ఆదాయం అందటం అని ఉంది. శక్తి ఉండి శ్రమ చేయని వారికి ఆదాయం ఎందుకు ఇవ్వాలి? లాసాల్ ప్రభావంతో పంపిణి విషయంలో సంకుచిత దృక్పధాన్ని ఈ ముసాయిదా ప్రకటించింది. ప్రతి ఒక్కరికి శక్తిని బట్టి శ్రమ, శ్రమను బట్టి సంపద అనేది న్యాయమైన పంపిణికి పరిష్కారం.

**4. కార్మికవర్గ కర్తవ్యం - అభివృద్ధి నిరోధక సమూహం:**

"శ్రమ విమోచన అన్నది కార్మికవర్గ కర్తవ్యంగా ఉండాలి" కార్మికవర్గం తనను తాను విముక్తి చేసుకొని మిగతా పీడితులను కూడా విముక్తి చేస్తుంది. అంతేగాని శ్రమను విముక్తి చేయటం కాదు. కార్మికవర్గ విమోచన స్వయంగా కార్మికులే సాధించుకొవలసిన కర్తవ్యం.

"కార్మికవర్గం మినహా మిగతా వర్గాలన్నీ అభివృద్ధి నిరోధక సమూహం" గా వర్ణించారు. కాని కమ్యూనిస్టు ప్రణాళిక చెప్పిన దాని ప్రకారం "ఈనాడు బుర్జువా వర్గానికి ముఖా ముఖిగా నిలిచిన వర్గాలన్నింటిలోకి శ్రామికవర్గం ఒక్కటే నిజమైన విప్లవ వర్గం తక్కిన వర్గాలన్ని ఆధునిక పరిశ్రమల ప్రభావం వల్ల క్షీణించి చివరకు అదృశ్యమవుతాయి. శ్రామికవర్గంఆధునిక పరిశ్రమల ప్రత్యేక సృష్టి". ప్రణాళిక ఆధారంగా చూసినప్పుడు అభివృద్ధి నిరోదక సమూహం అనేదానికి అర్థమే లేదు.

**5. కార్మికవర్గం - వర్తమాన జాతీయ రాజ్య వ్యవస్థ :**

"కార్మికవర్గం తన విమోచన కోసం మున్ముందుగా వర్తమాన జాతీయ రాజ్య వ్యవస్థ పరిధిలోపలే కృషి చేస్తుంది" ఈ నిర్ధారణ కార్మిక ఉద్యమాన్ని అత్యంత సంకుచిత జాతీయ స్థాయికి దిగజార్చటమే అవుతుంది. జర్మన్ కార్మికవర్గ పార్టీ తన అంతర్జాతీయతను సంకుచితం చేసుకుంటున్నదని మార్క్స్ విమర్శించాడు. అంతిమంగా ఈ వద ప్రయోగం పాలకవర్గాలకు, వాటి ప్రభుత్వాలకు మేలు చేస్తుంది.

**రెండవ విభాగం**

**వేతన వ్యవస్థ రద్దు:**

"వేతనాలకు సంబంధించిన కఠిన నియమంతో పాటు వేతన వ్యవస్థను రద్దు చేయటం". దీనికి సంబంధించి కఠిన నియమంతో పాటు కఠిన అనే దానిని పరిశీలిస్తే వేతన శ్రమను రద్దు చేస్తే దానికి అనుగుణంగా అ నియమాలు కఠినమైనవి అయినా కాకపోయినా రద్దు అవుతాయి. లాసాల్ ప్రతిపాదనలతో కార్మికుడు సగటు వేతనం మాత్రమే పొందుతాడు. లాసాల్ ఈ వాదాన్ని మాల్తుస్ జనాభా సిద్ధాంతం, రికార్డో నుండి అనుకరించాడు. వేతనమంటే ఏమిటొ లాసాల్‌కి తెలియదు కాని అతను బుర్జువా అర్థ శాస్త్రజ్ఞుల అడుగుజాడల్లో కనిపించే రూపాన్ని అంతఃసారంగా అర్థం చేసుకున్నాడు.

**మూడవ విభాగం**

**సామాజిక సమస్యల పరిష్కారం - ప్రభుత్వ సహాయం :**

"సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గాన్ని సుగమం చేసేందుకుగాను జర్మన్ కార్మికవర్గ పార్టీ శ్రామిక జన సామాన్యపు ప్రజాస్వామిక అజమాయిషి కింద, ప్రభుత్వ సహాయంతో ఉత్పత్తిదారుల సహకార సంఘాల స్థాపనను కోరుతుంది"



epaper.prajasakti.com

> “ రాజ్యం ఎక్కడైతే స్వేచ్ఛగా ఉంటుందో అక్కడ నిరంకుశత్వ పరిస్థితులు ఏర్పడతాయి. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రకారం చూస్తే సోషలిస్టు సామాజిక వ్యవస్థ నిర్మాణంతో రాజ్యం రద్దు అవుతుంది. దీన్ని విస్మరించి ప్రజారాజ్యం, స్వేచ్ఛాయుత రాజ్యం భావనల జపం చేస్తున్నారు. రాజ్యమనేది బలంతో శత్రువుని అణచడానికి వినియోగించే సాధనం. అలాంటప్పుడు స్వేచ్ఛాయుత రాజ్యం గురించి ప్రస్తావించడం అర్థరహితం. ”

సామాజిక సమస్యల పరిష్కారాన్ని ముందు పెట్టి లాసాల్‌వాదులు తమ నగ్నత్వాన్ని బయటపెట్టుకున్నారు. వారు ప్రభుత్వ సహాయాన్ని వదులుకోవడానికి నిరాకరిస్తున్నారు. ప్రభుత్వ సహాయం ద్వారా సామాజిక సమస్యల పరిష్కారం అవుతుందని, ఒక కొత్త సమాజం నిర్మితమవుతుందని లాసాల్ వాదులు కలలు కంటున్నారు. ప్రభుత్వ సహాయం అనేది సహకార సంఘాల ఏర్పాటుకు ఉపయోగపడుతుంది. కాని ప్రభుత్వం ఇచ్చే రుణాలతో ఒక కొత్త రైలు మార్గం నిర్మించినట్లుగా ప్రభుత్వ సహాయంతో ఒక కొత్త సమాజం నిర్మితం కాదు.

**నాల్గవ విభాగం**

**స్వేచ్ఛాయుత రాజ్యం :**

కార్మికవర్గాన్ని ట్రేడ్ యూనియన్ల ద్వారా ఒక వర్గంగా సంఘటితపరిచే విషయం కార్యక్రమంలో ఎక్కడా లేదు. ట్రేడ్ యూనియన్ అనేది శ్రామికవర్గపు నిజమైన వర్గ సంఘం. కార్మికవర్గం దాని ద్వారానే శిక్షణ పొంది పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాడుతుంది. పార్టీ నిర్మాణంలో దానికి ప్రత్యేక స్థానం కల్పించటం పూర్తిగా అవసరం. అలాగే ప్రతి ఉదారవాద బుర్జువా కార్యక్రమంలోనూ ఉండే విజ్ఞానశాస్త్ర స్వేచ్ఛ, అంతఃకరణ స్వేచ్ఛ వంటి డిమాండ్లూ ఉన్నాయి. “స్వేచ్ఛాయుత రాజ్యంకు

సంబంధించి రాజ్యం ఎక్కడైతే స్వేచ్ఛగా ఉంటుందో అక్కడ నిరంకుశత్వ పరిస్థితులు ఏర్పడతాయి. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రకారం చూస్తే సోషలిస్టు సామాజిక వ్యవస్థ నిర్మాణంతో రాజ్యం రద్దు అవుతుంది. దీన్ని విస్మరించి ప్రజారాజ్యం, స్వేచ్ఛాయుత రాజ్యం భావనల జపం చేస్తున్నారు. రాజ్యమనేది బలంతో శత్రువుని అణచడానికి వినియోగించే సాధనం. అలాంటప్పుడు స్వేచ్ఛాయుత రాజ్యం గురించి ప్రస్తావించడం అర్థరహితం.

**మార్క్స్ మరణాంతరం వెలుగులోకి :**

మార్క్స్ అభిప్రాయాలను, వాదనలను సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకత్వం పట్టించుకోలేదు. ముసాయిదాలో స్వల్పమైన మార్పులు చేసి ఆమోదించుకున్నారు. ఈ రాత ప్రతిని మార్క్స్ మరణానంతరం ఏంగెల్స్ వెలుగులోనికి తీసుకొనివచ్చాడు. అనేక పరిణామాల అనంతరం 1891లో జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఎర్‌ఫర్ట్‌లో జరగబోయే మహాసభకు కొత్త కార్యక్రమాన్ని తయారు చేస్తామని ప్రకటించింది. గతంలో చేసిన పొరపాటే మరలా పునరావృతం అవుతుందని ఏంగెల్స్ భావించి ఈ రచనను పుస్తకంగా ప్రచురించాడు. ఈ పుస్తకం సంచలనం రేపింది. విస్తృతమైన చర్చకు దారితీసింది. పార్టీ సాధారణ సభ్యులు, ఇతర దేశాలకు చెందిన సోషలిస్టులు మార్క్స్ గోథా కార్యక్రమ విమర్శపై హర్షామోదాలు వ్యక్తం చేశారు. ఎర్‌ఫర్డ్ మహాసభలో మార్క్స్ వ్యక్తపరిచిన విశ్లేషణల ఆధారంగా కొత్త కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు. ఈ కార్యక్రమంపై ఏంగెల్స్ సంతృప్తిని వ్యక్తం చేశాడు. మార్క్స్ మరణానంతరం వెలుగులోకి వచ్చి కార్మికవర్గ కరదీపికగా మారడం “గోథా కార్యక్రమంపై విమర్శ” రచనకు ఉన్న ప్రత్యేకత.....

❋

# బలపడిన భూస్వామ్య కూటమి ...

(31వ పేజీ తరువాయి)

పార్టీ కార్యకర్తలు ఇప్పటికే ఇతరులకు ఆదర్శంగా ఉన్నారు. రానున్న సంవత్సరాలలో విస్తారంగా బలిదానాలు, ధైర్యంతో పోరాడటం, వ్యక్తిగత త్యాగాలు చేయాల్సిన పరిస్థితులు ఎదురుకానున్నాయి. వామపక్ష ఐక్యతను కొనసాగిస్తూ, విస్తారమైన సమస్యలపై లౌకికపార్టీలతో అవగాహన సాధిస్తూ, మార్క్సిజం-లెనినిజం స్ఫూర్తితో సరైన మార్గంలో పయనిస్తున్న సిపిఐ(ఎం) తన ముందున్న చారిత్రక కర్తవ్యాలను నిర్వహించగల స్థితిలో ఉన్నది.

బూర్జువా-భూస్వామ్య వర్గాల ప్రభుత్వం పెట్టుబడిదారి అభివృద్ధి మార్గంలో ప్రయాణించటం వలన దేశానికి మరింత ప్రమాదకరమైన పరిణామాలు ఎదురౌతాయని గత 40 సంవత్సరాల అనుభవం స్పష్టం చేస్తున్నది. ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేయటంలో విఫలం కావటం వలన అణచివేత పెరగటం, స్వాతంత్ర్యాన్ని కోల్పోయే ప్రమాదం, ఐక్యత విచ్ఛినం కావటంతో పాటు నయా వలసవాద బానిసత్వంలోకి వెళ్ళే ప్రమాదం కూడా ఉన్నది. సిపిఐ(ఎం), ఇతర వామపక్షాలు రాజీవ్‌గాంధి రాజీనామా వరకే పరిమితమై, మౌలిక మార్పుల కోసం పోరాటాన్ని ముందుకు తీసుకుపోకపోతే వినాశకరమైన పరిణామాలు ఎదురౌతాయి. రాజీవ్‌గాంధి తక్షణమే రాజీనామా చేయాలని సాగుతున్న మహోద్యమంలో మౌలికవర్గాల ప్రజలకు అనుకూలమైన వర్గశక్తుల నూతన పొందికకు అవసరమైన ప్రాతిపదికను రూపొందించాలి. తక్షణ ప్రమాదాలకు వ్యతిరేకంగానూ, రాజీవ్‌గాంధి రాజీనామా చేయాలని ప్రణాళికాబద్ధంగా సాగుతున్న పోరాటంలో ప్రస్తుతమున్న చట్రాన్ని అధిగమించి భవిష్యత్‌ను చూడాలని, అత్యవసర కర్తవ్యమైన ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తిచేసి, కార్మిక-కర్షక ఐక్యత ప్రాతిపదికగా జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేయటం కోసం ముందుకుసాగాలని ప్రజలకు బోధించాలి. ఇటువంటి భావనను కలిగించటం, అందుకోసం ప్రజలను సమీకరించటంలో విఫలం కావటమే గత నాలుగు దశాబ్దాలలో ప్రధాన బలహీనతగా ఉన్నది. ఇది మన ప్రజలు, దేశ భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెడుతున్నది.

(సమాప్తం)

అనువాదం : ఎ కోటిరెడ్డి



epaper.prajasakti.com

# మార్క్సిస్టు సిపిఐ(ఎం) ఆవిర్భావం

(2వ పేజీ తరువాయి)

తరగతులలోని పెట్టి బూర్జువా వర్గం విప్లవ పోరాటంలో కార్మికవర్గ మిత్రులుగా ఉంటారు. ఇతర ఊగిసలాడే తరగతులను ఈ సంఘటన వైపుకు ఆకర్షించటం, అందులో స్థిరంగా ఉంచటం కార్మిక, కర్షక మైత్రి దృఢత్వంపైనే ఆధారపడి ఉంటుంది. ''జాతీయ బూర్జువావర్గంలోని వేర్వేరు తరగతులు ఏ మేరకు ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాలలో పాలుపంచుకుంటారు అన్నది కార్మిక, కర్షక మైత్రి స్థిరంగా ఉండడంపై ఆధారపడి ఉంటుంది. స్థూలంగా చెప్పుకోవాలంటే కార్మిక కర్షకమైత్రిని ఎంత దృఢంగా నిర్మించగలం అన్నదానిపై విప్లవానికి నాయకత్వం వహించే జనతా ప్రజాతంత్ర సంఘటనను ఎంత విశాలంగా ఏర్పాటు చేసుకోగలం అన్నది ఆధారపడి ఉంటుంది.”

పి.డి.ఎఫ్ ద్వారానే ప్రజాతంత్ర విప్లవం కోసం సామ్రాజ్యవ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక విప్లవ శక్తులను కూడగట్టి, ఐక్యంగా ఉంచటానికి పార్టీ కృషి చేస్తుంది. ప్రజా పోరాటాల ద్వారా ఈ సంఘటన నిర్మితమై పటిష్టమౌతుంది. ఈ సంఘటనను ఏర్పాటు చేయటం కోసం రూపొందించిన కార్యక్రమం ప్రాతిపదికగా జరిగే ప్రజా ఉద్యమాల ద్వారానే సంఘటన ఏర్పడుతుందని పార్టీ కార్యక్రమం ప్రకటించింది.

భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభలో వారు ఆమోదించిన కార్యక్రమం ఇందుకు భిన్నంగా ఉంది. రాజ్యం యొక్క విశ్లేషణ, ప్రజాస్వామిక విప్లవంలో వర్గ సంఘటనకు నాయకత్వంపై అంచనాలో ప్రధానమైన వ్యత్యాసం ఉంది. సిపిఐ కార్యక్రమంలో భారత రాజ్యాన్ని భిన్నంగా విశ్లేషించారు. రాజ్యాధికారం చెలాయించే మిత్రులలో భూస్వాములు లేరు. అధికారంలో ఉన్న బూర్జువాజికి భూస్వాములతో బలమైన సంబంధాలు ఉన్నాయని మాత్రమే పేర్కొంది. బూర్జువా, భూస్వామ్య కూటమికి బడా పెట్టుబడిదారులు నాయకత్వం వహిస్తారని కూడా వారు అంగీకరించలేదు. రాజ్యాధికారంపై బడా పెట్టుబడిదారులు బలమైన ప్రభావం చూపిస్తారని మాత్రమే అంగీకరించారు. విదేశీ ద్రవ్య పెట్టుబడితో పాలకవర్గ కూటమికి ఉన్న సంబంధాలను కూడా వీరు అంగీకరించరు. ఈ అవగాహన వల్లనే బడా బూర్జువా, భూస్వాములను ఒంటరి పాటు చేయడానికి రాజ్యాధికారంతో మిలాఖత్ అవ్వాలన్న వ్యూహాన్ని రూపొందించారు. అందువల్ల వారి “జాతీయ ప్రజాతంత్ర సంఘటన”కు నాయకత్వం వహించేది కార్మికవర్గం కాదు. జాతీయ బూర్జువా వర్గం, కార్మికవర్గం కలిసి నాయకత్వం వహిస్తారు. కార్యక్రమంలోని ఈ అవగాహన వర్గ సంకరానికి దారితీసింది.

ఇద్దరి కార్యక్రమాలను పోల్చి చూస్తే భారత కమ్యూనిస్టు పార్టీ రివిజనిస్టు విధానం బయట పడుతుంది. పార్టీ సభ్యులలో అత్యధికులు రివిజనిస్టుల రాజీ విధానాలను అర్థం చేసుకున్నారు. పార్టీ ఏడవ మహాసభలో సభ్యులు పార్టీ వెనక నిలబడిన తీరులో ఇది ప్రతిబింబించింది.

పార్టీ కర్తవ్యాలపై ఆమోదించిన తీర్మానం, ఏడవ మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి దిశా నిర్దేశం చేశాయి. ఇప్పుడున్న కార్మిక సంఘం, రైతాంగ ఉద్యమాలు, ఇతర ప్రజాసంఘాల బలహీనతలను అధిగమించి, వేగంగా వాటి రాజకీయ చైతన్యాన్ని పెంచాలని పార్టీ తీర్మానం నిర్దేశించింది. నిజమైన విప్లవ పార్టీని నిర్మించడాన్ని గురించి తీర్మానం ఈ విధంగా హెచ్చరించింది. ''ప్రజా ఉద్యమాలను నిర్మించకుండా, పోరాటాలు చేయకుండా, వాటిలో చొరవతీసుకోకుండా, నాయకత్వం వహించకుండా, పార్టీని మార్క్సిస్టు లెనినిస్టు పునాదులపై నిర్మించే కర్తవ్యాన్ని సంపూర్ణంగా నిర్వహించలేం. మౌలిక వర్గాల సమస్యలు పరిష్కరించేందుకు చేసే కృషిలో మన కార్యకలాపాలు భాగంగా ఉండాలి. అవే పార్టీ మొత్తాన్ని పునరుత్తేజపరిచి ప్రజలతో సంబంధాలను ఏర్పరుస్తాయి”.

పార్టీలో రివిజనిజం, ఒంటెత్తుపోకడల వ్యక్తీకరణలు, వాటి రాజకీయ, సైద్ధాంతిక మూలాలకు సంబంధించిన వివరమైన పత్రాన్ని తయారు చేయాలని, తద్వారా ఈ పెడధోరణులకు వ్యతిరేకంగా పోరాడే విధంగా పార్టీ మొత్తానికి అవగాహన కల్పించాలని రాజకీయ తీర్మానం కొత్తగా ఎన్నికైన కేంద్ర కమిటీని ఆదేశించింది.

1951లో పార్టీ మహాసభ ఆమోదించిన విధాన ప్రకటననే కొన్ని సవరణలు చేసి పార్టీ మహాసభ తిరిగి ఆమోదించింది. ‘రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం,’ అనే తీర్మానాన్ని కూడా ఆమోదించింది. దీనిని రాజకీయ, నిర్మాణ నివేదికగా మహాసభ ముందు ఉంచింది.

సైద్ధాంతిక సమస్యలపై పార్టీలో అంతర్గతంగా ‘ఓర్పుతో’ చర్చించే విధంగా’ చూడాలని కేంద్ర కమిటీని ఆదేశిస్తూ ఇంకో తీర్మానాన్ని ఆమోదించింది. ‘బూర్జువా సంస్కరణలకు వ్యతిరేకంగా, పార్టీ నిర్మాణానికి విఘాతం కలిగించే డాంగే గ్రూపు పద్ధతులకు వ్యతిరేకంగా జరిగిన మొదటి పోరాట దశ ముగిసిందని’ ప్రకటించింది. “తదుపరి దశలో, రాబోయే కొద్ది నెలల్లో ఈ రోజు పేరుకు డాంగే గ్రూపులో ఉన్న చాలామంది, లేదా ఎటూ కలవకుండా తటస్థంగా ఉన్న వారు మా వైపుకు వస్తారు. దానితో డాంగే గ్రూపు అనుసరించిన రివిజనిస్టు, వేర్పాటువాద విధానాలకు చరమగీతం పాడబడుతుంది” అని పేర్కొంది.

పార్టీ ఏడవ మహాసభ కేంద్ర కమిటీ, తొమ్మిది మంది సభ్యులు గల పొలిట్ బ్యూరోను ఎన్నుకుంది. అందులో కామ్రేడ్ పి.సుందరయ్య, ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్, బి.టి.రణదివే, ప్రమోద్‌దాస్ గుప్త, ఎం.బసవపున్నయ్య, ఏ.కె.గోపాలన్, జ్యోతిబసు, పి.రామమూర్తి, హరికిషన్ సింగ్ సూర్జిత్ ఉన్నారు. కామ్రేడ్. పి.సుందరయ్య ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ఆ విధంగా పార్టీ ఏడవ మహాసభ, దేశంలోని కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక కొత్త వొరవడికి దారి చూపింది.

అనువాదం : కె.ఉషారాణి

❃


## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**




epaper.prajasakti.com

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month. మార్క్సిస్టు
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 17, issue : 1 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# మోడి పాలనలో ఎరువుల ధరల పెంపు భారం

2014లో మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల ధరలు విపరీతంగా పెరగటంతో రైతులపై పెనుభారం పడింది. కాని అందుకు తగిన విధంగా ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలు పెంచలేదు. దానితో రైతులు రుణాల ఊబిలో కూరుకుపోవటం, భూములు కోల్పోవటం, ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతున్నది. 2014లో ఉన్న ఎరువుల ధరలు, వరి, గోధుమల మద్దతు ధరలను పోల్చిచూస్తే ఈ తేడా మనకు అర్ధం అవుతుంది. 2014లో మోడి అధికారంలోకి వచ్చేనాటికి డిఎపి 50 కిలోల బస్తా 409.00, ఎన్‌పికె 466.93, ఎంఒపి 420 రూపాయలుగా ఉన్నాయి.

2022లో ఎన్‌పికె బస్తా 1470, డిఎపి 1350, ఎంఒపి 750 రూపాయలుగా ఉన్నాయి. ఎనిమిది సంవత్సరాల కాలంలో ఎన్‌పికె కు 3.15 రెట్లు, డిఎపి కి 3.30 రెట్లు, ఎంఒపి కి 78 శాతం ధరలు పెరిగాయి.

మరోవైపు వరి మద్దతు ధర 2014లో క్వింటాలుకు 1360 రూపాయలుండగా 2022కు 1940 రూపాయలక్కు, అంటే 44 శాతం మాత్రమే పెరిగింది. అదే సంవత్సరం గోధుమలు క్వింటాలుకు 1400 రూపాయలుండగా, 2022లో 2015 రూపాయలకు, 43 శాతం మాత్రమే పెరిగింది. ఒక్క ఎరువుల ధరలను మాత్రమే పరిశీలిస్తేనే ఇంత వ్యత్యాసం ఉంది. పురుగుమందులు, విత్తనాలు, యంత్రాలు ఇతర వ్యవసాయోపకరణాల ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుంటే రైతాంగం ఎంతగా దోపిడీకి గురవుతున్నారో స్పష్టమౌతుంది. వీటితో పాటు పెరుగుతున్న నిత్య జీవితావసరాల ధరలు వారి మూలుగలను పీల్చివేస్తున్నాయి. మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దోపిడి ఎంత తీవ్రమైందో వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**
ఇంటి నెంబరు........................
వీధి........................
గ్రామం........................
మండలం లేదా పట్టణం........................
జిల్లా........................

పోస్టు స్టాంపు

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,



epaper.prajasakti.com